www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 255 | బుధవారం 07-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

కాషాయ దాష్టీకం

లెనిన్ విగ్రహం ధ్వంసం

- సీపీఎం కార్యకర్తలపై దాడులు
- కార్యాలయాలకు నిప్పు
- త్రిపురలో బీజేపీ దమనకాండ

త్రిపురలో ఇంకా గద్దెనెక్కలేదు. అధికారం చేపట్టలేదు. అప్పుడే మతోన్మాదులు, వేర్పాటువాదులు చెలరేగిపోతున్నారు. సీపీఎం కార్యకర్తలు, కార్యాలయాలపై దాడులకు బరితెగించాయి. అటు కేంద్ర హోంశాఖ, ఇటు రాష్ట్ర గవర్నర్ కనుసన్నల్లో పోలీసులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తుండగా సీపీఎం కార్యకర్తల ఇళ్లను తగులబెడుతున్నారు. కార్యాలయాలను ధ్వంసం చేస్తున్నారు. లూటీలకు పాల్పడుతున్నారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్, ఐపీఎఫ్టీ మూకల స్వైరవిహారంతో త్రిపుర ప్రజలు తల్లడిల్లిపోతున్నారు.





2లో

లెనిన్ అంటే విగ్రహం కాదురా
కూల్చేస్తే ముక్కలు కావటానికి
లెనిన్ అంటే అట్టడుగు జనంరా
పడిలేచాడా ప్రళయాగ్నిరా
- సి.నా.రే

భావజాలం బట్టబయలైంది

త్రిపురలో హింసకు సీపీఐ ఖండన

న్యూఢిల్లీ: త్రిపురలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ గూండాలు సృష్టించిన హింసాకాండను సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. త్రిపురలో కమ్యూనిస్టులు, వారి - మిగతా 2 లో

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు

హస్తినలో గర్జించిన ఎర్రదండు



ప్రసంగిస్తున్న రాజా

కేంద్రం మోసపూరిత వైఖరి : సీపీఐ కార్యదర్శి రాజా

చంద్రబాబు, పవన్‌కల్యాణ్, జగన్ ఢిల్లీకి రండి

మీ... తడాఖా కేంద్రానికి చూపించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ఢిల్లీలో మంగళవారం హోదా ధర్నాలో ప్రసంగిస్తున్న రామకృష్ణ. వలీఉల్లా ఖాద్రీ, జంగాల, శ్రీనివాసరావు, చలసాని, మధు, ముప్పాళ్ల, రాఘవులు, గౌతంరెడ్డి, రావుల వెంకయ్య, జేవీఎస్ఎన్ మూర్తి తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండు చేస్తూ వామపక్షాల నేతృత్వంలో మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్‌లో మహాధర్నా జరిగింది. సీపీఐ నేత డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, సీపీఎం నేతలు బీవీ రాఘవులు, పి.మధు, వి.శ్రీనివాసరావుతో పాటు అనేక మంది వామపక్ష నేతలు హాజరయ్యారు. ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు హాజరై తమ గళాన్ని వినిపించారు. వామపక్ష నేతలు కార్యకర్తల నినాదాలతో హస్తిన దద్దరిల్లి పోయింది. ప్రత్యేక హోదా ఇచ్చే వరకు ఢిల్లీని వదిలి వెళ్లేది లేదని కార్యకర్తలు నినాదాలు చేశారు. ఏపీకి - మిగతా 11 లో

గతం మరవొద్దు

అన్యాయం చేసిన కాంగ్రెస్ అడ్రస్ లేదు

- విభజన చట్టాన్ని అమలు చేయమంటున్నాం
- హోదా విషయంలో రాజీ ప్రసక్తేలేదు
- రూ.3 వేల కోట్లే వస్తాయని ఎన్నడూ చెప్పలేదు
- బీజేపీ వ్యాఖ్యలు తప్పుతోవ పట్టించేలా ఉన్నాయి
- మిత్రపక్షం కాబట్టే పదే పదే చెబుతున్నా
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సీరియస్



విశాలాంధ్రబ్యూరో - అమరావతి
రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో ఎట్టి పరిస్థితిలోనూ రాజీపడే ప్రసక్తేలేదని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామని, అదనంగా ఏదీ అడగటంలేదని - మిగతా 2 లో

హోదా..గీదా లేదు

- ఏపీకిస్తే అన్నీ రాష్ట్రాల నుంచి ఒత్తిడి ఖాయం
- ఇచ్చిన నిధులకు లెక్కలు చూపండి
- రాజకీయం చేయాలని చూస్తే మీకే నష్టం...
- యుద్ధాలు లేవని రక్షణ శాఖ నిధులు అడిగేలా ఉన్నారు
- సర్కారుకు కేంద్రం ఝలక్....



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ :
ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్రం తేల్చి చెప్పేసింది. ఈ విషయాన్ని సాక్షాత్తు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేరుగా టీడీపీ బృందానికి స్పష్టం చేసినట్లు సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీతో టీడీపీ నేతల బృందం సోమవారం రాత్రి భేటీ అయిన విషయం విధితమే. టీడీపీ నేతలు మాత్రం కేంద్రం చెప్పిన వాటిని దాచి పెట్టి మంగళవారం కొన్ని మీడియా సంస్థలకు లీకులు అందించారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా పిలుపు మేరకు ఢిల్లీ వచ్చిన టీడీపీ ఏపీ నేతల బృందం అమిత్‌షాను కలవకుండా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసింది. ఈ మతలబు ఏంటని టీడీపీ నేతలను మీడియా ప్రశ్నిస్తే దానికి ఎన్నో కారణాలు చెప్పారు. ఢిల్లీలోని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కార్యాలయంలోని - మిగతా 2 లో



వెంకటరామారావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేస్తున్న ట్రాన్స్‌కో జోన్‌సీఈ ప్రవీణ్. చిత్రంలో ఓబులేసు తదితరులు

సమ్మె విరమణ

- విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జేఏసీతో ట్రాన్స్‌కో సీఎండీ చర్చలు సఫలం
- 9న పూర్తిస్థాయిలో చర్చలకు నిర్ణయం
- నిరవధిక నిరాహార దీక్ష విరమించిన చలసాని, గఫూర్, జేఏసీ నేతలు
- నేటి విద్యుత్ సౌధ ముట్టడి రద్దు
- ఉద్యమానికి విరామం మాత్రమే : ఓబులేసు

11లో



దండకారణ్యంలో

ప్రతీకారాగ్ని..!

- చెలరేగిన మావోయిస్టులు
- మాజీ కానిస్టేబుల్ కాల్చివేత
- మూడు బస్సులు, నాలుగు ట్రక్కుల దహనం

11లో

స్తంభించిన పార్లమెంట్

9లో

- కుదిపిన బ్యాంకింగ్ అక్రమాలు
- ప్రధాని నోరువిప్పాలని ప్రతిపక్షాల డిమాండు
- ఉభయసభలు నేటికి వాయిదా
- రిజర్వేషన్లలో తెలంగాణ కోటా పెంచాలని టీఆర్ఎస్ విజ్ఞప్తి

కార్తీకి మరో 3 రోజులు సీబీఐ కస్టడీ

9లో

ఇదీ లోకం!



డీఎస్సీ ఎప్పుడో?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలపై ఇంతవరకూ స్పష్టత రాలేదు. కొన్ని జిల్లాల డీఈవోలు ఖాళీల నివేదికల్ని పంపలేదు. పదోతరగతి పరీక్షల నిర్వహణలో విద్యాశాఖాధికారులు నిమగ్నమయ్యారు.దీంతో ఖాళీల సేకరణపై కొంత జాప్యం నెలకొంది.ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పూర్తవ్వడంతో.. ఇక డీఎస్సీపైనే అందరి దృష్టి నెలకొంది.టెట్ తుది కీను ఈ వారంలో విడుదల చేస్తారు.ఆ తర్వాత టెట్ ఫలితాల్ని అధికారులు వెల్లడిస్తారు.ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే డీఎస్సీ(టీఆర్టీ) నోటిఫికేషన్ను ప్రభుత్వం ప్రకటిస్తుందని అభ్యర్థులు ఆశిస్తున్నారు.టెట్ పరీక్షల ప్రక్రియ దాదాపు పూర్తయినప్పటికీ ఉపాధ్యాయ ఖాళీలను సేకరించడంలో విద్యాశాఖాధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి.ఈ ఏడాది మార్చి చివరి వరకూ ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల నివేదికల్ని అందజేయాలని డీఈవోలను పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి.ఈ నెల 15 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతాయి.ఈ పరీక్షల - మిగతా 11 లో



- ఉపాధ్యాయ ఖాళీలపై అస్పష్టత
- 13జిల్లాల డీఈవోల నివేదికలో జాప్యం
- 15వేలకు పెరగనున్న ఉపాధ్యాయ పోస్టులు..!
- కొత్తగా పాఠశాల యాజమాన్యం సిలబస్..?

రాజ్యసభకు డొక్కా ?

ఎమ్మెల్సీగా జూపూడి ?
యోచిస్తున్న టీడీపీ అధిష్టానం

విశాలాంధ్ర-అమరావతి :
రాజ్యసభకు జరగనున్న మూడు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ రెండు స్థానాలకే పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ పరిణామాలు, బీజేపీతో కొనసాగుతున్న పోరు తీవ్రతరమైన పరిస్థితుల్లో రెండు స్థానాలకే అభ్యర్థులను నిలబట్టే ఆలోచనతో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. అయితే ఆ రెండుస్థానాల్లో ఒక స్థానాన్ని దళితులకు ఇవ్వాలన్న ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణంగా ప్రస్తుతం టీడీపీ లోక్‌సభ సభ్యులుగా ఉన్నముగ్గురు ఎంపీలు మాలవర్గానికి చెందినవారు. రాష్ట్రంలోని నాలుగు ఎస్సీ లోక్‌సభ నియోజకవర్గాలకు మాల వర్గీయులకే టిక్కెట్లు లభించాయి. అటు రాజ్యసభలో గానీ, లోక్‌సభలో గానీ మాదిగవర్గానికి ప్రాతినిధ్యం లేదు. ఈ కారణంతో రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకదాన్ని మాదిగవర్గానికి కేటాయించాలని తెలుగుదేశం అధిష్టానం యోచిస్తున్నట్లుగా తెలిసింది. తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, వర్లరామయ్య,





హేమలత పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం శాసనమండలిలో టీడీపీ ఎమ్మెల్సీలలో మాలవర్గీయులకు ప్రాతినిధ్యం లేదు. అందువల్ల ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను రాజ్యసభకు పంపి టీడీపీలో ఉన్న మాల వర్గానికి చెందిన జూపూడి ప్రభాకర్‌రావు, కె.ప్రతిభా భారతి, జెఆర్.పుష్పరాజ్‌లలో ఒకరికి ఎమ్మెల్సీ పదవి కట్టబెడితే బాగుంటుందున్న అభిప్రాయాలు టీడీపీలోని పలువురు సీనియర్లు చెప్పుకొస్తున్నారు. రెండుసార్లు శాసనసభ్యుడుగా, మంత్రిగా పనిచేసిన డొక్కా మాణిక్యవరప్రసాద్‌కు ఢిల్లీలోని పలు రాజకీయ పార్టీల ప్రముఖులతో సత్సంబంధాలు ఉన్నాయని, రాష్ట్ర, దేశ - మిగతా 2 లో

వాతావరణంపై ఐరాస ప్రతినిధి బ్లూమ్ బర్గ్



ఐరాస: ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి అంటోనియో గుటెరస్ వాతావరణ విభాగం ప్రతినిధిగా న్యూయార్క్ మాజీ మేయర్ మైఖేల్ బ్లూమ్‌బర్గ్ తాజాగా నియమితులయ్యారు. 2019లో ఐరాస ప్రధాన కార్యాలయంలో జరగనున్న సమ్మిట్‌కు వాతావరణ మార్పులపై వ్యూహం, ఏర్పాట్లు చేసేందుకు బ్లూమ్‌బర్గ్ కృషి చేస్తారు. 2020 నాటికి సాధించవలసిన వాతావరణ లక్ష్యాలకు సంబంధించిన కార్యాచరణను రూపొందించేందుకే 2019లో వాతావరణంపై సమ్మిట్ జరుగుతుంది. పారిస్ ఒప్పందాన్ని అమలుచేయడంలో ఆయా దేశాలను ప్రోత్సహించేందుకు బ్లూమ్‌బర్గ్ తన దృష్టిని కేంద్రీకరిస్తారు. బ్లూమ్‌బర్గ్ 2014లోకూడా ఆనాటి ఐరాస ప్రధానకార్యదర్శి బాన్‌కిమూన్ ప్రత్యేకదూతగా పనిచేసారు.

శ్రీలంకలో ఎమర్జెన్సీ

కొలంబో: శ్రీలంకలో మత ఘర్షణల నేపథ్యంలో 10 రోజుల పాటు ఎమర్జెన్సీని విధిస్తున్నట్లు అక్కడి మంత్రి ఎస్.బి దిస్సనాయకే వెల్లడించారు. శ్రీలంకలోని కాండీ జిల్లాలో బౌద్ధులు, ముస్లింల మధ్య తీవ్ర ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ అల్లర్లలో ఇద్దరు మరణించారు. ఈ ఘర్షణలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా ఆపేందుకు దేశంలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు దిస్సనాయకే తెలిపారు. అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ఆధ్వర్యంలో మంత్రిమండలి ప్రత్యేకంగా సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.సోషల్ మీడియా ద్వారా ప్రజలను హింసాత్మక ఘటనలకు ప్రేరేపిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 10 రోజుల అనంతరం పరిస్థితులను బట్టి అత్యవసర స్థితి పొడిగించాలా వద్దా అనేది నిర్ణయం తీసుకుంటారు. కాండీ జిల్లాలో పలు ప్రాంతాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున బలగాలను పంపి కర్ఫ్యూ విధించారు. అల్లర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాన్ని రంగంలోకి దింపారు.

విశాలాంధ్ర ప్రపంచం

వెనిజులాలో సమ్మిట్‌కి రాల్‌కాస్ట్రో హాజరు

కారకాస్ : వెనిజులాలో జరిగిన 15వ బొలివేరియన్ అలయన్స్ ఫర్ ది పీపుల్స్ ఆఫ్ అవర్ అమెరికా-ట్రేడ్ ట్రీటీ ఆఫ్ ది పీపుల్స్ (ఏఎల్‌బిఏ-టీసీపీ) సమ్మిట్‌కి క్యూబా అధ్యక్షుడు రాల్ కాస్ట్రో హాజరయ్యారు. ఆయనకు వెనిజులా రక్షణశాఖమంత్రి వ్లదిమీర్ పడ్రినోవ్ సైమన్ బొలీవర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. వెనిజులా మాజీ అధ్యక్షుడు హూగో ఛావెజ్ ఐదవ వర్ధంతి సందర్భంగా ఈ సమ్మిట్ జరుగుతున్నది. సమ్మిట్‌లో పాల్గొనేం దుకు రాల్ కాస్ట్రోతోపాటు బొలీవియా అధ్య క్షుడు ఏఓ మొరేల్స్, నికరాగ్వా నేత డానియల్ ఒర్టెగా కారకాస్ చేరుకున్నారు. ఈ సమ్మిట్ వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోకు తమ తోడ్పాటును ప్రకటించింది. అమెరికా దాని మిత్రదేశాలు వెనిజులాను బెదిరిస్తున్న నేప థ్యంలో సమ్మిట్ తోడ్పాటు ప్రభావం చూపించ గలదని భావిస్తున్నారు. ట్రంప్ బెదిరింపులను ఈ కూటమి తీవ్రంగా ఖండించింది. ఈ కూటమిలో క్యూబా, బొలీవియా, నికరాగ్వా, డొమినికా, ఈక్వెడార్,సెయింట్ విన్సెంట్, గ్రెనడా,యాంటిగువా, బర్బుడా, సెయింట్ లూసికా, సెయింట్ కిట్టీస్, నెవిస్, సూరినోవ్ దేశాలు ఉన్నాయి.



వర్జీనియాలో టీచర్ల సమ్మె

చార్లెస్‌టన్ : వెస్ట్ వర్జీనియాలో గత 8రోజులుగా టీచర్లు సమ్మె చేస్తున్నారు. చార్లెస్‌టన్ నగరంలోని కాపిటల్‌భవనం ఎదురుగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. గౌరవమైన వేతనాలు చెల్లించాలని కోరుతూ, 30,000 మందికిపైగా టీచర్లు సమ్మెలో పాల్గొంటున్నారు. వేతనాలు, ఇతర ప్రయోజనాలు పెంచేందుకు ప్రభుత్వం కఠిననిర్ణయం తీసుకో వాలని డిమాండ్‌చేస్తూ, గత నెల 22 నుండి సమ్మె నిర్వహిస్తున్నారు. అమెరికాలోకల్ల వెస్ట్‌వర్జీనియాలో అత్యంత తక్కువగా వేతనాలను ఇస్తున్నారు. కార్మికవర్గమేకాదు...ఉపాధ్యాయులు, తదితర విభాగాల్లోనూ వేతనాల కోసం ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తున్నారు. గవర్నర్ రెండు శాతం వేతనాలు వచ్చే ఏడాదినుండి పెంచుతామని ప్రకటించారు. అయితే ప్రస్తుతం ద్రవ్యోల్బణం 2.1శాతం ఉన్నదనీ, పెంచిన వేతనాలు అత్యల్పమని టీచర్లు సమ్మె చేస్తున్నారు. కనీసం 5శాతం వేతనాలను పెంచాలని టీచర్ల యూనియన్లు, డిమాండ్ చేస్తున్నారు. వేతనాలను పెంచేవరకు తాము విధులలోకి రాబోమని హెచ్చరించారు.

ఘనమైన ఆర్థికవ్యవస్థ నిర్మాణం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు



బీజింగ్ : పరిశ్రమలలో గుణాత్మకమైన మార్పులు, అభివృద్ధి చేయడం ద్వారా ఘనమైన ఆర్థికవ్యవస్థను నిర్మించేందుకు ప్రాముఖ్యత ఇవ్వాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఆర్థికవ్యవస్థ పటిష్టతకు మరింత కృషి జరగాలన్నారు. ఇన్నర్ మంగోలియా అటానమస్ రీజియన్ (మంగోలియా స్వయం ప్రతిపత్తి ప్రాంతం) డిప్యూటీల ప్యానల్ చర్చలలో ఆయన పాల్గొని మాట్లాడారు. 13వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ప్రథమ సెషన్‌లో ఈ చర్చలు జరిగాయి. చైనా ఆర్థికవ్యవస్థ వేగంగా వృద్ధిచెందే దశనుండి ఘనమైన అభివృద్ధి దశకు మార్పుచెందుతున్నదని ఆయన అన్నారు. స్థానిక ప్రభుత్వాలు, స్వతంత్రంగా తమ ఆర్థికవ్యవస్థలను పటిష్టపరచుకునేందుకు అత్యంత నాణ్యమైన, విలువైన, సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందేందుకు, పెట్టుబడులు, సాంకేతికతను పరిశ్రమలలో అధికంగా వినియోగించుకునేందుకు కృషి చేయాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

బహువిధమైన, బహుళమైన, ఆధునిక పరిశ్రమలను నెలకొల్పాలని ఆయన అన్నారు. ప్రపంచ పారిశ్రామిక ధోరణులను పసిగట్టి అమలుచేయడం ద్వారా ఇన్నర్ మంగోలియా అటానమస్ రీజియన్ ఆధునిక ఇంధన రంగాన్ని అభివృద్ధి పరచాలని ఆయన సూచించారు. ఇంధనరంగం ఆధారిత పరిశ్రమలను విస్తరించాలని, వినియోగరేటును పెంచుకోవాలని ఆయన సూచించారు. ఆధునిక పరికరాల ఉత్పత్తి, సేవలు, మెరుగుపరచుకోవాలని ఎలక్ట్రానిక్, సమాచారం, ఇంధనపొదుపు, వాతావరణ పరిరక్షణ, జీవ ఔషధాలు, తదితర రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. రుణానికి సంబంధించిన ఇబ్బందులను జాగ్రత్తగా పరిశీలించి వాటి ప్రభావాన్ని నివారించాలని సూచించారు.

గూఢచారిపై దర్యాప్తుకు సహకారం

రష్యా

మాస్కో : తమ మాజీ గూఢచారి సెర్గి స్క్రిపాల్ బ్రిటన్‌లో జబ్బుపడిన కారణం తెలుసుకునేందుకు దర్యాప్తుకు సహకరిస్తామని రష్యా తెలిపింది. ఆయన ఎలా,ఎందుకు,జబ్బుపడ్డాడని దర్యాప్తు చేసేందుకు తాము సహకరిస్తామని తెలిపింది. 66ఏళ్ల స్క్రిపాల్ బ్రిటన్ తరపున గూఢచర్యం నిర్వహిస్తున్నాడని గుర్తించిన రష్యా 2006లో విచారణ అనంతరం 13ఏళ్ల జైలుశిక్ష విధించింది. శిక్ష పూర్తిచేసిన అనంతరం ఆయన లండన్ చేరుకున్నారు. స్క్రిపాల్ జబ్బుపడిన కారణాన్ని తెలుసుకునేందుకు దర్యాప్తుకోసం బ్రిటన్ తమ సహాయం కోరలేదనీ, అయినప్పటికీ సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ ప్రతినిధి డిమిత్రీ పెస్కోవ్ తెలియజేశారు.

టర్కీలో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రదర్శన



అంకారా : సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రచారంలో భాగంగా, టర్కీ కమ్యూనిస్టు యూత్ విభాగం ఆధ్వ ర్యంలో ఇస్తాంబుల్ సెంట్రల్‌జిల్లాలలో ర్యాలీలు జరిగాయి. అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని, నాటో కూటమి చర్యలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేసారు. సామ్రాజ్యవాద సంస్థలు, టర్కీ మధ్య జరిగిన ఒప్పందాలకు న్యాయబద్ధతలేదని వాటిని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అమెరికా, నాటో దేశాల స్థావరాలను టర్కీలో తక్షణం ఖాళీచేయాలని ప్రదర్శకులు నినదించారు. కమ్యూనిస్టు వ్యతిరేకతతోనే టర్కీ నాటో కూటమిలో చేరిందని కార్మికవర్గ వ్యతిరేకత వలన సైనిక తిరుగుబాట్లు టర్కీలో జరుగుతున్నాయని కమ్యూనిస్టు యూత్ పేర్కొంది. 1968లో అమెరికా ఆరవ నౌకాదళం ఇస్తాంబుల్‌కు చేరుకున్న సందర్భంగా దేశభక్తియుతమైన విప్లవ భావాలు కల యువత తీవ్రంగా ప్రతిఘటించిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. టర్కీలో ఉన్న విదేశీ సైన్యాలను తిరిగి వారివారి దేశాలకు తక్షణం పంపించాలని డిమాండ్ చేసారు.

ముగిసిన 'నాఫ్టా' చర్చలు



మెక్సికోసిటీ : నార్త్ అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్(నాఫ్టా) ఏడవదఫా చర్చలు ముగిసాయి. ఈ చర్చలవల్ల పెద్దగా పురోగతి జరగలేదని అమెరికా భావిస్తుండగా, మెక్సికో మాత్రం సంతృప్తిని వ్యక్తం చేసింది. అమెరికా ప్రతినిధి రాబర్ట్ లిటిజర్ మాట్లాడుతూ, నాఫ్టా ఒప్పందంలోని 30 చాప్టర్లను మాత్రమే ఇంతవరకు చర్చించామన్నారు. చర్చలలో అంతగా పురోగతి లేదన్నారు. పూర్తిస్థాయి ఒప్పందానికి కాలం హరించుపోతున్నదని, అనేక రాజకీయ ఆటంకాలు కలుగుతున్నాయన్నారు. మెక్సికోలో అధ్యక్ష ఎన్నికలు, అమెరికాలో మధ్యంతర ఎన్నికలు, కెనడాలోని అంటారియాలో రాష్ట్రస్థాయి ఎన్నికలు, తదితర అంశాలు చర్చలలో పురోగతికి ఆటంకంగా ఉన్నాయని రాబర్ట్ చెప్పారు. అయితే ఈ చర్చలు సంతృప్తిగా ఉన్నాయని మెక్సికో ఆర్థిక మంత్రి గుజార్డో అన్నారు. ఈ వాణిజ్యం, టెలి కమ్యూనికేషన్లు, ఇంధనం ఇతర సాంకేతిక పరమైన ఆటంకాలు పూర్తిస్థాయి ఒప్పందానికి అడ్డుగా ఉన్నాయని వివిధ దేశాల మధ్య విభేదాలను పరిష్కరించుకోవలసిఉందని పరిశీలకులు భావిస్తున్నారు. నాఫ్టా ఒప్పందాన్ని ఆధునీకరించుకునేందుకు సమయం పడుతుందని కెనడా విదేశాంగమంత్రి క్రిస్టియా ఫ్రీ లాండ్ అన్నారు.

కాషాయ దాష్టీకం



అగర్తాలా: : ప్రమాణ స్వీకారం చేయక ముందే త్రిపురలో బీజేపీ అరాచకం తారా స్థాయికి చేరింది. హింసను రగిల్చింది. కమ్యూనిస్టులను లక్ష్యం చేసుకుని బీజేపీ గూండాలు వరుస దాడులకు దిగారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొన్ని గంటల్లోనే బీజేపీ కూటమి మూకలు నడిరోడ్డుల్లో అలజడి సృష్టించారు. అల్లర్లతో భయోత్పాతం సృష్టించారు. దక్షిణ త్రిపురలోని బెలోనియా పట్టణం నడిబొడ్డులోని కమ్యూనిస్టు నేత లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. బుల్‌డోజర్లతో లెనిన్ విగ్రహాన్ని బీజేపీ కార్యకర్తలు కూల్చివేశారు. భారత్ మాతాకీ జై అనే నినాదాలు చేస్తూ ఈ విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ ఘాతుకానికి పాల్పడిన జేసీబీ డ్రైవర్ ఆశిష్‌పాల్‌ను అరెస్టు చేసినట్టు దక్షిణ త్రిపుర ఎస్పీ ఐ మాన్‌చక్ తెలిపారు. ఐతే, అతడిని విడిచి పెట్టాలని బీజేపీ మూకలు పోలీసు స్టేషన్ ఎదుట యాగీకి దిగటంతో తలొగ్గిన పోలీసులు స్టేషన్ బెయిల్‌పై నిందితుడిని విడుదల చేశారు. ధ్వంసమైన విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని, మున్సిపాలిటీ అధికారులకు అప్పగించామని ఎస్పీ తెలిపారు. ఇక త్రిపురలో సీపీఎం కార్యాలయాలు, కార్యకర్తలను లక్ష్యం చేసుకుని బీజేపీ ఐపీఎఫ్‌టీ మూకల దౌర్జన్యకాండకు అంతులేదు. గడచిన 48 గంటల్లో 514 మంది సీపీఎం కార్యకర్తలపై భౌతిక దాడులు చేశారు. 1539 ఇళ్లను ధ్వంసం చేశారు. 196 ఇళ్లకు నిప్పు పెట్టారు. 134 పార్టీ కార్యాలయాను ధ్వంసం చేశారు. 64 కార్యాలయాలను తగులబెట్టారు. 208 కార్యాలయాను ఆక్రమించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వ నిర్ణయాన్ని మరో ప్రజాస్వామ్య ప్రభుత్వం వ్యతిరేకించటం సర్వసాధారణమని ట్వీట్ చేశారు. పరోక్షంగా బీజేపీ మూకల ఆగడాలను గవర్నర్ భుజానికి ఎత్తుకున్నారని సీపీఎం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన బీజేపీ కార్యకర్తలు ఉన్మాదంతో రెచ్చిపోయారని, లెనిన్ తలను వేరు చేసి ఫుట్‌బాల్ ఆడారని బెలోనియా సీపీఎం సబ్‌డివిజన్ కార్యదర్శి తపాస్ దత్తా ఆరోపించారు. ఈ ఘర్షణలపై కంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఆ రాష్ట్ర గవర్నర్ తథాగత రాయి, డీజీపీ ఏకే శుక్లతో మాట్లాడారు. నూతన ప్రభుత్వం ఏర్పడే వరకు హింస చోటుచేసుకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ ఆదేశించారు. గత 48 గంటల్లో మొత్తం ముగ్గుర్ని అరెస్టు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి అనేక అల్లర్లు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదుల అందుతున్నాయి. రాష్ట్ర ప్రజల్లో బీజేపీ భయం సృష్టిస్తోందని సీపీఎం ట్వీట్ చేసింది. ఈ ఘటనలను సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి రాజకీయ దాడులు ఆమోదయోగ్యం కాదని, మన దేశంలో బహుళ రాజకీయపార్టీల వ్యవస్థ ఉందని, ఒక పార్టీ విజయం సాధిస్తే మరో పార్టీ పరాజయం చెందటం సర్వసాధారణమని, గెలిచిన పార్టీ ప్రతీకార దాడులకు దిగటం మంచిది కాదన్నారు. లెనిన్ విగ్రహాన్ని కూల్చటం దారుణమని, చట్ట ప్రక్రారం దోషులను శిక్షించాలని రాజా డిమాండు చేశారు. అల్లర్లు, అల జడులు సృష్టించటం మినహా బీజేపీ ఆర్ఎస్ఎస్‌కు మరో రాజకీయ భవిష్యత్తు లేదని, త్రిపుర ప్రజలు తప్పని సరిగా ఈ కూటమికి బుద్ధి చెబుతుందని సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి అన్నారు.

విజయవాడలో వామపక్షాల నిరసన

విశాలాంధ్ర - విజయవాడ(కృష్ణలంక) : త్రిపురలో ప్రజలపైన, వామపక్ష పార్టీల కార్యకర్తలపైన బీజేపీ, ఆర్ఎస్ఎస్.గూండాల దాడులను, లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ మంగళవారం విజయవాడ లెనిన్‌సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. లెనిన్ విగ్రహం వద్ద వందలాది కార్యకర్తలు, నాయకులు బీజేపీ విధానాలను ఖండిస్తూ నినాదాలు చేశారు. బీజేపీ, ఆర్ఎస్సెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయనీ, దాడులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ వెస్టు త్రిపురలోని బోలినియాలోని లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడం దుర్మార్గమన్నారు. బీజేపీకి ప్రజాస్వామ్యం మీద, లౌకికతత్వం మీద నమ్మకం లేదన్నారు. ప్రజలు శాంతియుత జీవన విధానంపై వారికి నమ్మకం లేదన్నారు. త్రిపురలో గెలుపుతో విర్రవీగి లెనిన్ విగ్రహం కూల్చడం దుర్మార్గమని, ఇలాంటి చర్యల వల్ల వామపక్షాల మనోధైర్యాన్ని దెబ్బకొట్టాలనుకోవడం అవివేకమన్నారు. ప్రతిపక్ష పార్టీల ఆఫీసులపై దాడులు చేయడంల ఇప్పటి వరకు మన దేశంలో జరగలేదన్నారు. ఇటువంటి బెదింపులు కమ్యూనిస్టులకు, వామపక్ష పార్టీలకు కొత్తకాదనీ, వీటిని ఎదుర్కొంటామని హెచ్చరించారు. గాంధీని చంపిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని మంటగలిపే చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు పల్లా సూర్యారావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, వి.కృష్ణయ్య, పశ్చిమ కృష్ణా కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో వామపక్షాల నిరసన

బట్టబయలైంది

(మొదటిపేజీ తరువాయి)

మద్దతుదారులపైన గతంలో ఏనాడూలేనంతగా హింసాకాండకు పాల్పడటంద్వారా బీజేపీ-ఆర్ఎస్ఎస్ వాటి అనుబంధ సంఘాలు తమ అసలు స్వరూపాన్ని బైట పెట్టుకున్నాయి. కమ్యూనిస్టుపార్టీ కార్యాలయాలను పెద్ద సంఖ్యలో ధ్వంసంచేసి వాటిని తగులబెట్టారు. ఆర్ఎస్ఎస్-బీజేపీ గూండాలు వందలాదిపార్టీ కార్యాలయాలను ఆక్రమించుకున్నారు. కమ్యూనిస్టు కార్యకర్తలకు చెందిన అనేక వందల ఇళ్లను దహనం చేసారు. ఆర్ఎస్ఎస్-బీజేపీ హింసాకాండను, గూండాయిజాన్ని ప్రజాస్వామ్య శక్తులన్నీ ఖండించాలి. లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడం, ఇతర చిహ్నాలను ధ్వంసం చేయడం అత్యంత గర్హనీయం. లెనిన్ ఆయన భావజాలం ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమ హృదయాలలో పదిలపరచుకున్నారు. ఒక విగ్రహాన్ని కూల్చడం ద్వారా ప్రజల హృదయాలలో నిలుపుకున్న భావజాలాన్ని తుడిచివేయలేరు. త్రిపురలో హింసాకాండను ఆపడంలో విఫలమైతే కమ్యూనిస్టులు దీన్ని సైద్ధాంతిక సవాలుగా తీసుకుని తగిన సమాధానం చెబుతారు.

హోదా..గీదా లేదు

(మొదటిపేజీ తరువాయి)

నాలుగు గోడల మధ్య ఏం జరిగిందంటే.... ఏపీకి హోదా ఇచ్చేది లేదు. ఢిల్లీలో ధర్నాలు, ఆందోళనలు చేసి సమస్యను రాజకీయం చేయాలని చూస్తే మీకే నష్టం అని కూడా జైట్లీ టీడీపీ నేతలను హెచ్చరించినట్టు కూడా ఇచ్చినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఎన్ని పోరాటాలు చేసిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వబోమని వెల్లడించింది. సెంటిమెంట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోబోమని కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించినట్టు సమాచారం. పరిశ్రమలకు రాయితీలు ఇవ్వడం ఇప్పట్లో కుదరదని, గతంలో ప్రకటించిన ప్యాకేజి మాత్రమే ఇవ్వగలమని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. నాలుగేళ్లలో ఏపీకి రూ. 12,500 కోట్లు ఇచ్చామని, ఒక్క రూపాయికి కూడా టీడీపీ ప్రభుత్వం లెక్కచెప్పలేదని వ్యాఖ్యానించినట్టు సమాచారం. ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చినట్టు రాయితీలు ఇస్తే మిగతా రాష్ట్రాలు కూడా అడుగుతాయని ఆర్థిక శాఖ వర్గాలు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. ఏపీకి కొత్తగా పన్నులు రాయితీలు ఇవ్వడం సాధ్యపడకపోవచ్చని స్పష్టం చేశాయి. ఆత్మగౌరవం పేరిట రాజకీయ సెగ రాజేసి ఏపీ నేతలు సతమవుతున్నారని పేర్కొన్నాయి. తెలుగు సెంటిమెంట్ అంటున్నారు తర్వాత తమిళం, మలయాళ సెంటిమెంట్ అంటారా అని ప్రశ్నించినట్టు సమాచారం. ఇప్పుడేమీ యుద్ధాలు జరగడంలేదు కదా.. రక్షణ శాఖకు అన్ని నిధులు ఎందుకని అడిగినా అడుగుతారని ఆర్థికశాఖ ఘాటుగా వ్యాఖ్యానించినట్లు సమాచారం. సైన్యానికి కేటాయించిన నిధులు కూడా ఏపీకి కేటాయించాలని డిమాండ్ చేసినా చేస్తారని ఆర్థిక శాఖ అధికారులు అన్నట్లు తెలుస్తోంది. ఏపీ కొత్తగా అడుగుతున్న రాయితీలు ఇవ్వడం సాధ్యం కావని కేంద్రం తేల్చి చెప్పేసింది. . పార్లమెంటును స్థంబింప చేసి, ఢిల్లీలో ధర్నాలు చేయటం, కేంద్ర ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేయటం ఏ మాత్రం సరికాదని టీడీపీ నేతలకు జైట్లీ హితవు పలికినట్లు తెలిసింది. కేంద్రం నుంచి వచ్చిన సమాచారాన్ని నేరుగా బయటకు చెప్పలేని టీడీపీ నేతలు మంగళవారం కూడా పార్లమెంటు ఉభయ సభల్లో ఆందోళనను కొనసాగించారు. పార్లమెంటులోని గాంధీ విగ్రహం వద్ద టీడీపీ, టీఆర్ఎస్, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎంపీలు ఆందోళన చేశారు. కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీలు పార్లమెంటు స్ట్రీట్‌లో మహాధర్నాను నిర్వహించాయి. ఏఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ కూడా కేంద్రం మాత్రం నిర్లక్ష ధోరణినే ప్రదర్శించింది.

గతం మరవొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసినందుకు కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోయిందనే విషయాన్ని మరవకూడదని మిత్రపక్షం బీజేపీకి ఆయన చురక వేశారు. ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి రూ.3 వేల కోట్లు మాత్రమే వస్తాయని తాను ఎన్నడూ చెప్పలేదని స్పష్టం చేసిన చంద్రబాబు, బీజేపీ ఇలాంటి ప్రచారంతో ప్రజలను తప్పుతోవ పట్టించొద్దని సూచించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు స్పీకర్ డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు మంగళవారం అనుమతించారు. దీనిపై బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ (రాజమహేంద్రవరం) మాట్లాడుతూ, ప్రత్యేక హోదా వల్లే రాష్ట్రానికి రూ.3 వేల కోట్లే వస్తాయని సాక్షాత్తు సీఎం చంద్రబాబు ప్రకటించారని, అందుకు సంబంధించిన వార్తలు పత్రికలలో వచ్చాయన్నారు. ఆ సమయంలో సభలోనే ఉన్న సీఎం చంద్రబాబు సత్యనారాయణ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. హోదా వల్లే రూ.3 వేల కోట్లే వస్తాయని తానెన్నడూ చెప్పలేదని సీరియస్‌గా చెప్పారు. అనంతరం ఆయన ప్రత్యేక హోదా ఇవ్వకపోవటంపై మిత్రపక్షం బీజేపీ వైఖరిపై ఆగ్రహంతో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో మిత్రపక్షంగా ఏర్పడి కలిసి ఎన్నికల్లో పోటీ చేశామని, అందువల్లే ఎంతో సంయమనంతో మాట్లాడుతున్నానని, మరో పార్టీ అయితే పరిస్థితి వేరుగా ఉంటుందని ఘాటుగా వ్యాఖ్యానించారు. పునర్విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలు మినహా కొత్తగా ఏదీ అడగటంలేదని తెలిపారు. విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలు, ప్రధాన మంత్రి ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవటం శోచనీయమన్నారు. ఆనాడు రాజ్యసభలో నాటి ప్రధాన మన్మోహన్‌సింగ్ ప్రత్యేక హోదాపై చేసిన ప్రకటనకు కేంద్రం కట్టుబడి ఉండాలన్నారు.

ఇక్కడ పరిస్థితిని కేంద్రానికి వివరించండి

రాష్ట్రంలోని పరిస్థితిని బీజేపీ నాయకులు కేంద్రానికి వివరించాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రానికి న్యాయం చేయాలని, విభజన హామీలు అమలు చేయాలని 29సార్లు ఢిల్లీ వెళ్లాలనని చెప్పారు. బీజేపీ నాయకులు రాష్ట్ర పరిస్థితులపై కేంద్రంలో ఎందుకు సమీక్షించరని ప్రశ్నించారు. ఒకరికొకరు విమర్శించుకోవటం సరికాదని, తెలుగు గడ్డపై పుట్టిన వారు రాష్ట్రానికి న్యాయం చేయకపోతే ఇంకెందుకని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగానే ఆయన రాష్ట్రానికి అన్యాయం చేసిన కాంగ్రెస్ అడ్రస్ లేకకుండా పోయిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రజల ఆత్మాభిమానం, మనోభావాలకు సంబంధించిందని, ఏదేదో మాట్లాడటం సరికాదన్నారు. పదే పదే విభజన హామీలను అమలు చేయాలనే కోరుతున్నామని, మిత్రపక్షంగా బీజేపీ కూడా గట్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తనకు రాష్ట్ర ప్రజలు, ప్రయోజనాలే ముఖ్యమని, ఇందుకోసం ఎక్కడా రాజీపడే ప్రసక్తేలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఏడు మండలాలను విలీనం చేయాలని కోరకపోతే, నేడు ప్రాజెక్టు పనులు ఇంత వేగంగా జరిగేవికాదన్నారు. ప్రపంచ పటంలో హైదరాబాద్‌కు ఇంత గుర్తింపు వచ్చిందంటే అది తన ప్రతిభేనని మరోసారి చంద్రబాబు చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చేంత వరకు పోరాడతానని ఆయన పేర్కొన్నారు.

మేమేదో చేశామని చెప్పటంలేదుగా... : ఆకుల సత్యనారాయణ

రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తేనే పరిశ్రమలు వస్తాయని, పెట్టుబడులు వస్తాయనే భ్రమలో ప్రజలు ఉన్నారని, అది సరైందికాదని బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ చెప్పారు. ఈ విషయంలో ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలనే ఉద్దేశంతోనే తాను మాట్లాడుతున్నట్లు తెలిపారు. 'మేమేదో చేసేశామని చెప్పటంలేదుగా, అందరం కలిసి రాష్ట్రానికి నిధులు తెచ్చుకుందాం' అని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సీరియస్‌కావటంతో ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ తన ప్రసంగాన్ని కొనసాగించేందుకు కష్టపడాల్సి వచ్చింది.

రాజ్యసభకు డొక్కా?

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ, సామాజిక అంశాలపై అవగాహన ఉన్న నాయకుడుగా డొక్కాకు అందరిలో గుర్తింపు ఉంది. ఆ కారణంతో డొక్కాను రాజ్యసభకు పంపి, ఆయన ఖాళీ చేసిన స్థానంలో మాలవర్గానికి చెందిన జూపూడి ప్రభాకర్‌రావుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టటం సమంజసమని ఓ టీడీపీ ప్రముఖుడు చెప్పుకొచ్చారు. ఎమ్మెల్సీగా ఉంటూనే జూపూడి ప్రభాకర్‌రావు టీడీపీలో చేరారని, ఆయన రాజీనామా చేసిన ఎమ్మెల్సీ పదవి ఆయనకే కేటాయించినా ఆ సమయంలో ఏపీలో ఆయనకు ఓటు లేని కారణాను నామినేషన్ దాఖలు చేయలేకపోయారు. చివరి నిమిషంలో కావలి ప్రతిభాభారతికి అవకాశం ఇచ్చారు. ఆమె పదవీకాలం కూడా ముగిసింది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని ఎస్సీ పార్లమెంటు నియోజకవర్గాలైన చిత్తూరు, తిరుపతి, బాపట్ల, అమలాపురంలలో మాదిగలకు టిక్కెట్లు దక్కే పరిస్థితులు లేవు. అందువల్ల రెండు రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానాన్ని మాదిగలకు కేటాయించటం ఖాయమని టీడీపీ నేతలు గట్టిగా చెబుతున్నారు. ఇదిలా ఉండగా రాజ్యసభ టిక్కెట్ల కోసం సిట్టింగ్ ఎంపీ సీఎం.రమేష్, నెల్లూరు జిల్లాకు చెందిన బీదా మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కంభంపాటి రామమోహన్‌రావు, రిలయన్స్ మాధవ్, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎవరికి రాజ్యసభ స్థానాల టిక్కెట్లు దక్కనున్నాయో ఈ నెల 11న తేలనుంది.



రాజధాని ప్రభుత్వ నగర హౌసింగ్ ప్రాజెక్టులపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అమరావతి రాజధాని ప్రభుత్వ నగరంలో చేపట్టిన హౌసింగ్ ప్రాజెక్టులపై ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ సమీక్షించారు. విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో ఆయా ప్యాకేజీలపై సంబంధిత అధికారులు, ప్రతినిధులతో చర్చించారు. ప్యాకేజ్-1లో ఎమ్మెల్యేలు, ఆలిండియా సర్వీసు అధికారుల నివాసాలను ఎన్‌సీసీ, ప్యాకేజ్-2లో ఎన్జీఓల నివాసాలను ఎల్ అండ్ టీ, ప్యాకేజ్-3లో గజిటెడ్ అధికారులు, క్లాస్-4 ఉద్యోగుల నివాసాలను షాపూర్జీ-పల్లోంజీ సంస్థలు నిర్మిస్తున్నాయి. అధికారులు ఆయా ప్రాజెక్టు పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. నిర్ణీత సమయంలో నిర్మాణాలు జరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ప్రస్తుతం పైలింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు తెలిపారు.

ఏప్రిల్ చివరిలోగా అన్ని రకాల అనుమతులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. మూడు ప్యాకేజీలకు సంబంధించిన ఎన్‌సీసీ, ఎల్ అండ్ టీ, షాపూర్జీ-పల్లోంజీ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు, అధికారులు, పీఎంసీల ప్రతినిధులు హాజరయ్యారు.

విభజన హామీల కోసం పోరాటం

ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి

విశాలాంధ్ర-అమరావతి : విభజన హామీల కోసం మండలిలో తమ వంతు పోరాటం చేస్తున్నామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ, విభజన జరిగి ఇన్ని సంవత్సరాలు గడిచినా ప్రత్యేక హోదా, ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్ వంటివి అమలుకు నోచుకోలేదని చెప్పారు.తక్షణం సీఎం అఖిలపక్ష సమావేశం వేయాలని డిమాండు చేశారు. విభజన హామీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుండి నడిపించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చినటువంటి హామీలలో ఎటువంటి పురోగతి లేదని విమర్శించారు.గాలి ముద్దు కృష్ణమ నాయుడు మృతి పై తీవ్ర సంతాపాన్ని మండలిలో తెలియజేశామని చెప్పారు. ఆయన గుర్తుగా నగరిలోని డిగ్రీ కళాశాల కు ,జలాశయానికి గాలి ముద్దు కృష్ణమనాయుడు పేరు పెట్టాలని శాసన మండలిలో ప్రకటన చేసినట్లు తెలిపారు.

ప్రతిపక్షాలుగా మారిన మిత్రపక్షాలు

టీడీపీ-బీజేపీ నేతల విమర్శల వర్షం

విశాలాంధ్ర - అమరావతి : అసెంబ్లీ సమావేశాలలో మీడియా వేదికగా మిత్రపక్షాలు ప్రతిపక్షాలుగా విమర్శలు చేసుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షం సమావేశాలకి హాజరుకాకపోయినా బీజేపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. రాష్ట్రానికి విభజన హామీలను నెరవేర్చలేదని టీడీపీ నేతలు విమర్శిస్తే..తాము చేయవల్సింది చేశామంటూ ప్రతిగా సమాధానమిస్తున్నారు. ముందుగా బీజేపీ ఎమ్మెల్సీలు మాధవరావు , సోము వీర్రాజులు మాట్లాడుతూ. రాజధాని శంకుస్థాపనకు ప్రధాని మోడీ గుప్పెడు మట్టి, చెంబు నీళ్లు ఇచ్చారని విమర్శించారని , మరి అన్ని నదులు నుంచి ముఖ్యమంత్రి తెచ్చింది గాడిద పాలా అని ఎద్దేవాచేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి లోపల బేరాలు ఆడుతూ, బయట ఉద్యమాలు చేస్తున్నారని ఇది మిత్రపక్షానికి సబబా అని ప్రశ్నించారు. వైసీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలతో కలసి మిత్రపక్షమైన టీడీపీ పని చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికీ తాము మిత్రత్వానికి కట్టుబడి ఉన్నామని, తాము అడ్డం తిరిగితే ఏం జరుగుతుందో తెలుసుకోవాలని హెచ్చరించారు. పార్లమెంట్ సాక్షిగా పార్లమెంట్ పవిత్రతను టీడీపీ నేతలు మంటగలుపుతున్నారని విమర్శించారు. దేశ ప్రధానిని అవమానపరిచే విధంగా వాసుపల్లి గణేష్ మాట్లాడటం సరికాదని, దీనిని ఖండిస్తున్నామని చెప్పారు. అయితే సోము వీర్రాజు వ్యాఖ్యలకు సమాధానంగా టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ, చంద్రబాబుని విమర్శించే విధంగా హేళన చేయడాన్ని సహించబోమని అన్నారు. రాజధాని శంకుస్థాపన కార్యక్రమానికి గాడిద పాలు తెచ్చారా అంటు ప్రజల మనోభావాలు కించపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోము వీర్రాజు రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా మాట్లాడటం లేదని ధ్వజమెత్తారు. అయితే ఇక్కడితో ఆగకుండా ఇరుపార్టీల నాయకులు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, ఆకుల సత్యనారాయణలు మాట్లాడుతూ, టీడీపీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ గవర్నర్ ప్రసంగానికి కూడా హాజరు కాకుండా మహిళలతో ధర్నా చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మోడీ మెడలు వంచుతామంటూ వాసుపల్లి మహిళలతో మోడీని అవమానించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గుండాలను, రౌడీలను అద్దెకు తీసుకుని వాసుపల్లి ధర్నాలు నిర్వహించారని మండిపడ్డారు. సీఎం వెంటనే గణేష్ పై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సీఎం మౌనంగా ఉంటే, ఆయన ప్రోత్సాహం ఉందని భావించాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే దీనికి ప్రతివిమర్శగా టీడీపీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ మాట్లాడుతూ, ఉద్యమంలో ముందుండే వారిని ముద్దాయి అంటారని మండిపడ్డారు. రౌడీ షీటర్ అంటూ నేడు విమర్శలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఆనాడు విష్ణుకుమార్ రాజు విజయం కోసం ఎంతగానో శ్రమించారని చెప్పారు. చంద్రబాబు 29 సార్లు ఢిల్లీ వెళ్లినా దొరకని మోడీ అపాయింట్‌మెంట్ ఏ1 జగన్‌కి, ఏ2 విజయసాయి రెడ్డి కి ఎలా అపాయింట్‌మెంట్ దొరికిందని ప్రశ్నించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన నిధులు అందేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు.





రాజకీయ పక్షాలన్నీ చంద్రబాబుకు పవర్స్ ఇవ్వాలి

విశాలాంధ్ర- అమరావతి : కేంద్రం నుంచి రావాల్సిన విభజన హామీల అమలు కోసం రాజకీయ పక్షాలన్నీ సహకరించి చంద్రబాబుని నాయకుడుగా ఎన్ను కోవాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ మీడియా పోయింట్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు.కాంగ్రెస్, వైసీపీ, సీపీఎం, సీపీఐ అన్ని పార్టీలు ఒక తీర్మానం చేసి చంద్రబాబు కి పవర్స్ ఇవ్వాలని, అప్పుడే కేంద్రం దిగి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు చంద్రబాబు కు నాయకత్వం అప్పజెప్పి కలసి నడవాలి అని కోరుతున్నానని అన్నారు. అపారమైన అనుభవం ఉన్న రాజకీయ వేత్త అయిన సీఎం చంద్రబాబుకి పూర్తిస్థాయి మద్దతు తెలియచేసి రాష్ట్ర సంక్షేమానికి కృషిచేయాలని అన్నారు.

కేంద్ర వైఖరిపై సీపీఐ, సీపీఎం నిరసన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ప్రత్యేక తరగతి హోదాపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఐ,సీపీఎం రాష్ట్ర కమిటీలు పిలుపునిచ్చాయి. ఈమేరకు రెండు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కె రామకృష్ణ, పి మధు మంగళవారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. ఎన్ని ఉద్యమాలు చేసినా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యపడదని కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించడాన్ని ఇరువురూ తీవ్రంగా ఖండించారు. ప్రజల సెంటిమెంట్ ఆధారంగా ప్రత్యేక హోదా ఇవ్వబోమని, ప్యాకేజీకి మాత్రమే కట్టుబడి ఉన్నామని ప్రకటించడం ఏపీ ప్రజలను మోసగించడమే అవుతోందన్నారు. పద్నాలుగవ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు భవిష్యత్‌లో ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉండదని చెప్పి, ప్యాకేజీ ప్రకటనతో కేంద్రం సరిపెట్టిందన్నారు. ఈశాన్య రాష్ట్రాల మాదిరిగా రాయితీలు ఏపీకి ఇవ్వడం సాధ్యం కాదని ఆర్థికశాఖ స్పష్టం చేయడం కేంద్రం పక్షపాత ధోరణతో వ్యవహరించడమే అన్నారు. సైన్యానికి కేటాయించిన నిధులు కూడా అడుగుతారని వ్యాఖ్యానించడం ఏపీ ప్రజలను అవమానించే విధంగా ఉన్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయమని కోరుతుంటే, సెంటిమెంటు ఆధారంగా ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని చెప్పడం దగా చేయడమేనని వారు స్పష్టం చేశారు. కేంద్రం రాష్ట్రం పట్ల అనుసరిస్తున్న మోసపూరిత విధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని నేతలు కోరారు.

ఎమ్మెల్యేలకు ర్యాంకులు

విశాలాంధ్ర అమరావతి: ఎమ్మెల్యేల పనితీరుపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ర్యాంకులివ్వడం మొదట్నుంచి వస్తోంది.మంగళవారం అసెంబ్లీ లో ర్యాంకులు ప్రకటించారు. పార్టీ పనిలోనూ, ప్రభుత్వ విధానాలలోనూ వారి పనితీరు ఆధారంగా నేతలకు ర్యాంకులు కేటాయించే పద్ధతికి చంద్రబాబే శ్రీకారం చుట్టారు.గతంలోను తన పార్టీ నేతలకు, ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో ర్యాంకులు కేటాయించి కలకలం రేపిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో ఎవరి పనితీరు ఎలా ఉందనే దానిపై చంద్రబాబు ర్యాంకులు ప్రకటించారు. బెస్ట్ పొలిటికల్ పంచ్-అచ్చెన్నాయుడు,బెస్ట్ ప్రజెంటేషన్ దేవినేని ఉమా మహేశ్వరరావు, బెస్ట్ మీడియా పాయింట్ ప్రజెంటేషన్ వాసుపల్లి గణేష్,రెండో స్థానం బుద్దా వెంకన్న,మూడో స్థానం జీవీ ఆంజనేయులు,బెస్ట్ సప్లిమెంటరీ ఎమ్మెల్యే వర్మలుగా చంద్రబాబు ప్రకటించారు.

ప్రతిపక్షం రాకపోవడం హాస్యాస్పదం

చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి ,ఎమ్మెల్యే యామినిబాల

విశాలాంధ్ర అమరావతి : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రధాన వేదికగా నిలిచే అసెంబ్లీకి ప్రతిపక్ష పార్టీ వైసీపీ రాకపోవటం ప్రజల సంక్షేమంపై వారికున్న చిత్తశుద్ధి అర్థమవుతోందని ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి ,విప్ యామినిబాలలు విమర్శించారు. రాష్ట్రానికి మంచి చెయ్యాలని జగన్‌కి లేదని బడ్జెట్ సమావేశాలలో బాధ్యత రాహిత్యంగా వ్యవహరించటం శోచనీయమన్నారు. మాట మడమ తిప్పే నాయకుడు ఎవరన్నా ఉన్నారంటే జగన్ ఒక్కడేనని విమర్శించారు. ఎంపీలు పార్లమెంట్‌లో నిరసన తెలపాలి కానీ రోడ్ల మీద కాదని ఎద్దేవాచేశారు. సుజనాచౌదరి రాజ్యసభలో నిధులు గురించి మాట్లాడితే విజయసాయిరెడ్డి అడ్డుకోవడం దేనికి సంకేతమనుకోవాలని ప్రశ్నించారు. మోడీకి మోకరిల్లి తన అధినాయకుడైన జగన్ పై కేసులు మాఫీ కోసం ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుని విమర్శించటానికి ప్రత్యేక రైలు వేసుకుని మరి ఢిల్లీ పోవాలా అంటూ హేళన చేశారు. విదేశీ పెట్టుబడులు రావటం రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవడానికి కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబుని కొనియాడారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాడతామని వెల్లడించారు.



ఏపీ సచివాలయం వద్ద న్యాయవాదుల ఆందోళన

విశాలాంధ్ర అమరావతి: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనీ 46 రోజులుగా వివిధరూపాలలో ఆందోళనలు చేస్తున్న న్యాయ వాదులు అసెంబ్లీ సమావేశాల సమయంలో సచివాలయం వద్ద అందోళనకు దిగడం కలకలం సృష్టించింది.కర్నూలు ,అనంతపురం ,జిల్లాలకు సంబందించిన సుమారు వంద మంది న్యాయ వాదులు ప్లకార్డులతో అసెంబ్లీ వైపు వచ్చేందుకు ప్రయతించగా పోలీసులు అడ్డుకున్నారు.అనంతరం సచివాలయం ఎదుట ధర్నా కు దిగారు.సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న రాయలసీమ న్యాయవాదులతో మంత్రి కాల్వ శ్రీనివాసులు చర్చలు జరిపారు. ఎల్లుండి న్యాయవాదులతో చంద్రబాబు సమావేశం అవుతారని మంత్రి అన్నారు. ఆందోళన విరమించాలని న్యాయవాదులను మంత్రి కాల్వ శ్రీనివాసులు కోరారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు అంశం రాష్ట్ర పరిధిలో లేదని మంత్రి స్పష్టం చేశారు. దీనిపై ఏం చేయాలనేది ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి కాల్వ వెల్లడించారు

ఐటీడీఏలకు ఫీడర్ అంబులెన్స్‌లు ..

విశాలాంధ్ర అమరావతి : గిరిజన ప్రాంతవాసుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ద్విచక్ర వాహనాలతో కూడిన 122 ఫీడర్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి ద్వారా రోడ్డు సౌకర్యంలేని, 108 వాహనాలు చేరుకోలేని ప్రాంతాలకు వెళ్లి, రోగులను సమీప ఆసుపత్రులకు తీసుకెళ్లడానికి అవకాశం కలుగుతుంది. సచివాలయంలోని ఒకటో నెంబర్ బ్లాక్ లో ఫీడర్ అంబులెన్స్ లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫీడర్ అంబులెన్స్ ల పనితీరును సీఎం చంద్రబాబునాయుడుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వివరించారు. అనంతరం మంత్రి కామినేని శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ, దేశంలోనే మొట్టమొదటిసారిగా మన్య ప్రాంతవాసుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం ఫీడర్ అంబులెన్స్ లను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రయోగాత్మకంగా పీపీపీ పద్ధతిలో 122 ఫీడర్ అంబులెన్స్ సేవలను వినియోగిస్తున్నామన్నారు. ఒక్కో వాహనం వినియోగానికి రాష్ట్ర ప్రభుత్వం రోజుకు రూ.2,100 వినియోగించనుందని మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు.



రోగి పడుకునే విధంగా ఏర్పాట్లు...

ప్రతి ఐటీడీఏ పరిధిలో ఉన్న రెండు మూడు 108 అంబులెన్స్ లకు ఒక్కో ఫీడర్ అంబులెన్స్ వాహనం అందుబాటులో ఉంచుతామని మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఈ వాహన సేవలు అందుబాటులోకి రావడం ద్వారా మన్య ప్రాంతంలో ఉన్న గర్భిణులకు, పలు ప్రాణాంతక వ్యాధుల భారినపడిన రోగులకు, ప్రమాదాలకు గురైన వారికి ఎంతో లబ్ధి కలుగుతుందన్నారు. రోగిని వాహనంలో పడుకునే విధంగా బెడ్ సౌకర్యం కల్పించడంతో పాటు ఆక్సిజన్ సిలిండర్ ను కూడా అందులో అమర్చామన్నారు. 12 రకాల వైద్య పరికరాలు, అత్యవసర మందులు కూడా వాటిలో ఏర్పాటు చేశామన్నారు. ఫీడర్ అంబులెన్స్ సేవలు విజయవంతమైతే. మిగిలిన అన్ని ప్రాంతల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఏజెన్సీలో మారుమూల ప్రాంతాలు, రోడ్డు సౌకర్యంలేని గ్రామాలకు ఫీడర్ అంబులెన్స్ లు సులభంగా చేరుకోగలవన్నారు. 108 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫోన్ చేసిన 60 నిమిషాల్లో సంఘటనా స్థలానికి ఫీడర్ అంబులెన్స్ చేరుకుంటుందని మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఈ అంబులెన్స్ సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఉన్న ఏడు ఐటీడీలకు 122 పీడర్ అంబులెన్స్ లు కేటాయించామని మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. సీతంపేట ఐటీడీఏకు 15, పార్వతీపురం ఐటీడీఏకు 24, పాడేరు ఐటీడీఏకు 42, రంపచోడవరం 21, చింటూరు 6, కె.ఆర్.పురం 8, శ్రీశైలం ఐటీడీఏకు 6 ఫీడర్ అంబులెన్స్ లు కేటాయించామన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, వైద్య, ఆరోగ్య శాఖ సలహాదారు జితేంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

శనగలు కొనుగోలు చేయండి : పోతుల రామారావు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ప్రకాశం జిల్లా రైతుల వద్ద ఉన్న లక్ష టన్నుల శనగలు కొనుగోలుకు ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలని కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు కోరారు. అసెంబ్లీ జీరో అవర్‌లో రామారావు మాట్లాడుతూ, ఒక్క ప్రకాశం జిల్లాలోనే సుమారు లక్ష టన్నుల శనగలు ఉన్నాయని, గతేడాది పంట కోల్డ్ స్టోరేజీలో ఉందన్నారు. గతేడాది సరైన ధర లభించక పోవటంతో రైతులు వాటిని కోల్డ్ స్టోరేజీలో ఉంచారన్నారు. ప్రస్తుతం కేజీ శనగల ధర రూ.45 మాత్రమే ఉందని, దానిని రూ.60కి పెంచి కొనుగోలు చేయాలన్నారు. లేకుంటే రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. జాతీయ వ్యవసాయ సహకార సమాఖ్య (నాఫెడ్) ద్వారా శనగలు కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి మృణాళిని మాట్లాడుతూ, మైదాన ప్రాంతంలో ఉన్న గిరిజనులకు కూడా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందేలా చూడాలన్నారు. తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ, 400 మంది విద్యార్థులు ఉన్న అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరిందని, దాని అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు మాట్లాడుతూ, వెలుగొండ ప్రాజెక్టుకు యుద్ధ ప్రాతిపదికన బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. దీంతో ప్రకాశం జిల్లాలోని మెట్ట ప్రాంతానికి సాగునీటి సమస్య ఉండదన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ, జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు.

ఐదుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ

పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులకు స్థాన చలనం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో ఐదుగురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముందుగా ఊహించినట్లుగానే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా ఉన్న 1995 బ్యాచ్ ఐఏఎస్ అధికారి బీ రామాంజనేయులకు స్థాన చలనం కలిగింది. ఆయన్ని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం కార్యదర్శిగా నియమించారు. ఇటీవలే పదోన్నతి పొంది, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న రంజిత్ భాషాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్‌గా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి జేఎస్‌వీ ప్రసాద్‌ను కార్మిక, ఉపాధి, శిక్షణ, పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ దినేష్‌కుమార్‌ను ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ లిమిటెడ్ సీఈఓగా, తిరుపతి సబ్ కలెక్టర్ నిషాంత్ కుమార్‌ను రంపచోడవరం ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

'గాలి'కి మండలి ఘన నివాళి



విశాలాంధ్ర-అమరావతి : మాజీ మంత్రి, శాసనమండలి సభ్యులు ముద్దు కృష్ణమనాయుడుకు శాసనమండలి మంగళవారం ఘన నివాళులు అర్పించింది. మండలిలో ఆయన సంతాప తీర్మానాన్ని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ గాలి ముద్దు కృష్ణమనాయుడు రాజకీయాల్లో ఎదగాలనుకొనే రాబోయే తరాలవారికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. రాజకీయ విభేదాలు ఉన్నవారితోకూడా స్నేహ సంబంధాలు కొనసాగించే లక్షణం ఉన్న గౌరవనీయుడు ఆయనే అన్నారు. ఆయన మరణం తనకు ఎంతో బాధకు గురిచేసిందని, చిత్తూరు జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఎన్టీఆర్ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చిన ముద్దు 6 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. ఉపాధ్యాయుడుగా పనిచేసిన ఆయన అదే శాఖకు మంత్రిగా వ్యవహరించారని, విద్యాశాఖ, అటవీశాఖ మంత్రిగా తనదైన ముద్రవేశారని చెప్పారు. ముద్దుతో కలసి ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రులుగా పనిచేశామని, తమ రెండు కుటుంబాల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ముద్దు కృష్ణమనాయుడు మరణాన్ని జీర్ణించుకోలేకపోయాయనని మండలి ఛైర్మన్ ఎన్ఎండీ.ఫరూక్ చెప్పారు. మంత్రులు కామినేని శ్రీనివాస్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాధరెడ్డి, కళా వెంకట్రావులు ముద్దు కృష్ణమనాయుడు సేవలను కొనియాడారు. చిత్తూరు జిల్లా పేదల పెన్నిధిగా ముద్దు క్రిష్ణమ పేరు తెచ్చుకున్నారని మంత్రి అమర్‌నాధరెడ్డి చెప్పారు. ఉపాధ్యాయుడుగా పనిచేసి విద్యామంత్రిగా ఎదిగి, చిత్తూరు జిల్లాలో పలు విద్యాసంస్థల స్థాపనకు కారకుడైన ముద్దు కృష్ణమనాయుడు పేరును ఏదో ఒక ప్రభుత్వ సంస్థకు పెట్టాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కోరారు. ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, సత్యనారాయణరాజు, చిక్కాల రామచంద్రరావు, ఎంవీఎస్.మూర్తి, దొరబాబు, పలువురు సభ్యులు ముద్దు కృష్ణమనాయుడు మరణంపై ఆవేదనవ్యక్తం చేశారు. ఆయన మృతికి నివాళి అర్పిస్తూ వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలియజేస్తూ శాసనమండలి ఏకగ్రీవంగా తీర్మానించింది.

హౌసింగ్ నిర్మాణాలపై సమీక్షించిన సీఆర్డీఏ కమిషనర్..

విశాలాంధ్ర అమరావతి : అమరావతి రాజధానిలో చేపట్టిన హౌసింగ్ ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలని రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం శ్రీధర్ కాంట్రాక్టు సంస్థలతో, అధికార్లతో సమీక్ష నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ ప్యాకేజి 1 లో నిర్మితమవుతున్న ఎమ్మెల్యేల, ఆలిండియా సర్వీస్ అధికారుల నివాసాలు ఎన్ సి పి .ప్యాకేజి 2 లో ఎన్జీవోల నివాసాలను ఎల్ అండ్ టి , ప్యాకేజి 3 లో గెజిటెడ్ అధికార్లు ,క్లాస్ 4 నివాసలను షాపుర్జి పల్లంజి నిర్మిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికార్లు నిరంతర పర్యవేక్షణ కనబరచాలని చెప్పారు. మెటీరియల్ శాంపిల్స్ , నాణ్యత ప్రమాణాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అధికారులు అనుమతి పొందిన తరువాత నిర్మాణాల మెటీరియల్స్ విషయంలో ముందుకెళ్లాలని అన్నారు. కాంట్రాక్టర్లు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు వివరించారు. ఈ సమీక్షలో సి ఈ జక్రయ ,దనుంజయ్య , ప్రాజెక్ట్ మేనేజర్ దొరబాబు పాల్గొన్నారు.

కేంద్రం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్ర విభజనలో చట్టంలో ఉన్న అంశాలన్నీ కేంద్రం అమలు చేయాలని శాసన సభ్యులు ఐతా బత్తుల ఆనందరావు డిమాండ్ చేశారు.అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ని విడదీయరాదని మొత్తుకున్నా ఆనాడు కాంగ్రెస్ పార్టీ విడదీసిందనిఅన్నారు. 2016 లో ప్రత్యేక ప్యాకేజి ని ఇస్తానన్న కేంద్ర ప్రభుత్వం పై రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కేంద్రం ఇచ్చిన హామీలలో కనీసం 30% కూడా అమలు చేయకపోవడం అన్యాయమని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చిన మోడీ సర్కార్ మాట నిలబెట్టుకొని ప్రజా కోర్టులో మన్ననలు పొందాలని సూచించారు.

బీజేపీది భిన్న వైఖరి

- ప్రజలు హోదాను కోరుకుంటున్నారు
- కొత్తగా ఏమీ ఇవ్వొద్దు.. దయచేసి సహకరించండి

మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : 'రాష్ట్రం లోని ఐదు కోట్ల మంది ప్రజల వైఖరి ఒకేవిధంగా ఉంటే, బీజేపీ నేతలది మాత్రం అందుకు భిన్నంగా ఉంది. 2014లో రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రత్యేక హోదాపై చేసిన ప్రకటనను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నాం. దయచేసి అర్థం చేసుకుని సహకరించండి' అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంపై శాసనసభలో మంగళవారం పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. అచ్చెన్నాయుడుతోపాటు అనేకమంది టీడీపీ ఎమ్మెల్యేలు బీజేపీని టార్గెట్ చేశారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, బీజేపీ నాయకులు ప్రజల మనోభావాలను పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలనుకుంటున్నారని, ఈ విషయంలో బీజేపీ నాయకులు సహకరించాలని కోరారు. ప్రత్యేక హోదాపై మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ప్రకటన చేసినప్పుడు ప్రస్తుత ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఉన్నారని తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం జరిగింది కాబట్టే విభజన హామీలు అమలు చేయాలని డిమాండు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలకు హోదా పేరుతో అందిస్తున్న ప్రతిఫలాలనే రాష్ట్రానికి అందించాలన్నారు. విజయవాడ, విశాఖలో బీజేపీకి వ్యతిరేకంగా పోస్టర్లు వేయటం కాకతాళీయంగానే జరిగిందన్నారు. తక్షణమే పోస్టర్లు తొలగించాలని చంద్రబాబు ఆదేశించారని తెలిపారు.

నవ్యాంధ్రను నట్టేట ముంచారు : నిమ్మల రామానాయుడు

కేంద్ర ప్రభుత్వం నవ్యాంధ్రను నట్టేట ముంచి, ప్రతిష్ఠను మంటగలిపిందని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదనటంలో వాస్తవంలేదన్నారు. పింఛన్లకు రూ.5,400 కోట్లను ఖర్చు చేస్తుండగా అందులో కేంద్రం రూ.230 కోట్లే ఇస్తోందని చెప్పారు. నదుల అనుసంధానానికి సీఎం చంద్ర బాబు శ్రీకారం చుట్టారన్నారు. విభజన వల్ల గాయపడిన ప్రజల మనోభావాలను కేంద్రం గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ మాదిరిగానే వ్యవహరిస్తే, బీజేపీకి అదే గతి పడుతుందని హెచ్చరించారు. హోదాను మించిన సాయం చేస్తామన్న కేంద్రం నేటికీ ఎలాంటి సహాయాన్ని చేయలేదన్నారు. నాలుగేళ్లగా రాజధాని నిర్మాణానికి కేవలం రూ.1,500 కోట్లే ఇచ్చిన కేంద్రం, ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్రలకు వరాల జల్లు కురిపించటం శోచనీయమన్నారు. మరోవైపు హోదా పేరుతో వైసీపీ రాజకీయ చేస్తోందన్నారు.

రాష్ట్రాన్ని ఎందుకు గుర్తించటంలేదు : ప్రభాకర్ చౌదరి : విభజన చట్టంలోని హామీలను అమలు చేసే విషయంలో కేంద్రం రాష్ట్రాన్ని ఎందుకు గుర్తించటంలేదని అనంతపురం ఎమ్మెల్యే వై ప్రభాకర్ చౌదరి ప్రశ్నించారు. గత ఎన్నికలలో టీడీపీ, బీజేపీ మిత్రపక్షంగా పోటీ చేసి అధికారంలోకి వచ్చాయని, ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ప్రాంతీ యతత్వాన్ని రెచ్చగట్టేలా బీజేపీ వ్యవహరించటం సరికాదన్నారు. రాష్ట్రంలో రెండో రాజధాని పేరుతో బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించటంపై తీవ్రంగా స్పందించారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దన్నారు. ప్రజలంతా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుకుంటున్నట్లు చెప్పారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విధ్వంసకర శక్తిగా మారారని విమర్శించారు. కదిరి ఎమ్మెల్యే అత్తర్ చాంద్‌బాషా మాట్లాడుతూ, రాయలసీమ డిక్లరేషన్ పేరుతో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టవద్దని కోరారు. సత్యవేడు ఎమ్మెల్యే తలారి ఆదిత్య మాట్లాడుతూ, సీఎం చంద్రబాబును చూసే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక హోదా ఇస్తే మరిన్ని పెట్టుబడులు, కంపెనీలు రావటంతోపాటు యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

సంపాదకీయం

ఈ వేసవి ప్రచండమే..!

ఈ వేసవి ప్రచండమేనని భారత వాతావరణ విభాగం హెచ్చరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వచ్చిన పెనుమార్పుల కారణంగా వర్షాలు, చలి, ఎండలు ఆయా సీజన్లలో తగ్గడం లేదా పెరగడమో జరుగుతోంది. వివిధ కారణాల వల్ల అడవులు, పచ్చనిచెట్లు ఉండే ప్రాంతాలు గణనీయంగా తరగిపోవడంతో వాతావరణం స్థితిగతులలో అనూహ్య మార్పులు చోటుచేసు కుంటున్నాయి. దేశంలో 33శాతానికిపైగా ఉండవలసిన అడవుల విస్తీర్ణం దాదాపు 22శాతానికి తగ్గినట్లు తాజా అంచనాలు. అడవులు, చెట్లు ఉన్న ప్రాంతం కూడా దాదాపు 24.39 శాతం మాత్రమే. ఈ మార్చి-మే నెలల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువ ప్రాంతాలలో సాధారణంకంటే అధికంగా, మరికొన్ని ప్రాంతాలలో సాధారణంకంటే తక్కువగా ఉండవచ్చునని భారత వాతావరణశాఖ తెలియజేస్తూ ఈ వేసవి లావాను తట్టుకునేందుకు కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్చరించింది. ముంబై, దాని పరిసరాల్లోని మహారాష్ట్ర జిల్లాలకు వడగాడ్పుల హెచ్చరికను ఇప్పటికే విడుదలచేసింది. ముంబైలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38డిగ్రీలకు చేరింది. పగటి ఉష్ణోగ్రత మామూలు కంటే ఐదు డిగ్రీలు అధికంగా ఉన్నట్లు వార్తలు వెలువడు తున్నాయి. వేసవి తొలి అడుగులే ఇలా ఉంటే ముందుముందు పరిస్థితి దుర్భరంగా మారే ప్రమాదం ఉంది. వేసవి తీవ్రత పెరిగేకొద్దీ అనేక అనారోగ్య సమస్యలు చుట్టు ముడతాయి. వేడి గాలుల వల్ల ఈ సమస్యలు మరింతగా పెరుగుతాయి. ప్రత్యేకించి వృద్ధులు, చిన్నపిల్లలు, వివిధ రకాల అనారోగ్యాలతో బాధపడేవారు, మానసిక, శారీరక వైకల్యం కలిగిన వారు మండుటెండల నుంచి తమనుతాము కాపాడుకునేందుకు ముందుగానే ఏర్పాటుచేసు కోవలసిన అవసరం ఉంది. ఎండలు మిక్కుటంగా ఉండే ప్రాంతాలను,తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ఆయా గ్రూపుల ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వాలు ముందుగానే మేల్కొనాలి. ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకించి వేసవిలో నీటి కొరతలేకుండా తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇప్పటికే భూగర్భ, ఉపరితల జలమట్టాలు అడుగంటిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి మొదలైంది. తాగు, సాగునీటి సమస్యలు తెలుగు రాష్ట్రాలకే కాదు, దేశమంతటా విస్తరించి ఉన్న చిరకాల సమస్యే. దేశజనాభాలో 85 శాతం ప్రజల తాగునీటికి, 65 శాతం వ్యవసాయదారుల సేద్య అవసరాలకు భూగర్భజలాలే దిక్కు . పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి వినియోగం ఒక వైపు ఎక్కువవుతుంటే, మరోవంక జలవనరులు తరిగిపోతున్నాయి. కేంద్ర భూగర్భజల మండలి తాజా నివేదిక ప్రకారం, దేశంలో ప్రస్తుత పరిస్థితి సంక్షోభస్థాయికి చేరింది. దాదాపు 60శాతం జిల్లాల్లో జనాభాకు తాగునీటి అవసరాలు తీరడంలేదు. పలు ప్రాంతాల్లో భూగర్భజలాల లభ్యత ఏకరూపంగా లేకపోవడం, అదేపనిగా నీటిని తోడేయడం, తీరప్రాంతాల్లోని నీటిలో లవణీయత అధికంగా ఉండడం పరిస్థితిని దయనీయంగా మారుస్తోంది. దేశంలో తలసరి వార్షిక నీటి లభ్యత సైతం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. 1951లో 5177 ఘనపు మీటర్లుగా ఉన్న లభ్యత 2011నాటికి 1545 ఘ.మీటర్లకు కుంగిపోయింది. 2050 నాటికి ఇది 1140 ఘ.మీటర్లకు చేరుతుందని అంచనా. ప్రకృతి వైపరీత్యాలు, మానవ కారక చర్యల వల్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయనేది వాస్తవం. పట్టణాలు, నగరాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారిపోవడం వల్ల ఎండల తీవ్రత ఆయా ప్రాంతాల్లో మరింత ఎక్కువగా ఉంటుంది. అలాగే నగర శివార్లు, మురికివాడల్లో పారిశుద్ధ్య లేమితోపాటు వేసవికాలపు నీటికొరత చాలా కాలంగా ఉన్నది. ఈసారి ఎండల పెరుగుదలవల్ల ఇది తీవ్రమయ్యే అవకాశంఉంది. కొన్ని రాష్ట్రాలు, అలాగే అనేక ప్రాంతాల్లో నీటికొరత దారుణంగాఉంది. మంచినీటికోసం సైతం మైళ్ల దూరం నడిచివెళ్లి తెచ్చుకోవలసిఉంటుంది. ఈసారి ఎండల ప్రభావం రాజస్థాన్, జమ్ము-కాశ్మీర్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల ప్రదేశ్, మధ్యప్రదేశ్ ఇతర ఉత్తర, మధ్య, తూర్పు రాష్ట్రాలలోనూ ఎక్కువగా ఉండవచ్చునని, 1.6 డిగ్రీల సెల్సియస్ నుండి 5డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగుదల నమోదుచేయవచ్చునని వాతావరణశాఖ హెచ్చరించింది. మార్చి ప్రారంభంలోనే తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే కనీస ఉష్ణోగ్రతలు పెరిగాయి. కొన్నిచోట్ల 36 నుండి 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాలులకు తట్టుకోలేక వయసుమళ్లిన పెద్దలు ప్రత్యేకించి పలురకాల అనారోగ్యాలతో ఉన్నవారు మరణించే అవకాశంకూడా ఉంటుంది. ఒక అంచనాప్రకారం వడగాలుల వలన 2010లో 1300 మంది మరణించగా, 2015లో 2,500 మంది మరణించారు. దేశంలో అధిక ఉష్ణోగ్రతలు గతంలోనూ నమోదైన సందర్భాలు ఉన్నాయి. అయితే పర్యావరణంలో వచ్చిన మార్పుల కారణంగా అరశాతం డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరగడం వలన ఈసారి అత్యంత తీవ్రమైన వడగాలులు ఉండవచ్చుననీ, ఫలితంగా మరణాల సంఖ్య పెరగవచ్చునని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. తీవ్రంగా అలసిపోవడం, కదలలేని పరిస్థితి ఏర్పడటం, సొమ్మసిల్లిపోవడం, తదితర సమస్యలు అధిక ఎండలకు గురయ్యేవారికి సంభవిస్తోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యభద్రతావ్యవస్థ, ఇతర అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. అలాగే అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల వల్ల కలిగే ఇబ్బందులను ఎదుర్కోబోయే ఆరోగ్య సమస్యలను ఆయా ప్రభుత్వాలు ఎక్కడికక్కడ చర్యలు తీసుకోవాలని, ఇందులోభాగంగా ప్రతిరోజూ ప్రజలకు హెచ్చరికలు విడుదలచేయాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ సిఫారసు చేయడం కూడా ఎంతైనా ఆహ్వానించదగిన అంశం. ఈసారి నైరుతి రుతుపవనాలు మెరుగ్గా ఉండవచ్చునని లానినా ప్రభావం ఒక మాదిరిగా ఉంటుందని వాతావరణశాఖ అంచనావేసింది. వాతావరణంలో వస్తున్న పెనుమార్పులను ఎదుర్కొనేందుకు కర్బనపు వాయువుల విడుదలను గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రణాళికను అమలుచేయవలసి ఉంటుంది. కనీస ఉష్ణోగ్రతల పెరుగుదలకు, వాతావరణ మార్పులకు అవినావభావ సంబంధం ఉంది. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా ఎండల తీవ్రతను సైతం తగ్గించుకునే అవకాశం ఉంటుంది. ఇందుకు ప్రభుత్వాలు, ప్రజలు తగిన చర్యలు తీసుకోవాలి.

చురక

ప్రత్యేక హోదా పోరు
పార్లమెంటు లోన జోరు
ఏపార్టీకి ఆపార్టీయే
ఎగిరితేలా యమున తీరు

ఆర్థిక ప్యాకేజీ పేర
ఆంధ్ర ప్రజల నోట్లో దుబ్బ
అభివృద్ధికి నిధులందక
ఐతే ఏలా మట్టి దిబ్బ

- వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

మహాశక్తిమంతమైన రష్యన్ అస్త్రం



బుడ్డిగ జమిందార్

2017 సంవత్సరానికిగాను ప్రపంచ అణ్వాయుధాలపై అధ్యయనం చేసిన 'అణ్వస్త్రాల స్థితిగతులపై సమీక్ష' పేరిట జనవరి 27, 2018నాడు ట్రంప్ ప్రభుత్వం ఒక నివేదకను విడుదల చేసింది. నూరుపేజీల ఈ సమీక్ష ఆధారంగా 'భద్రతతో కూడిన సమర్థవంతమైన అణ్వాయుధాలను రూపొందించుకొని శత్రుదేశాల అణ్వాయుధాల్ని నిరోధించగల శక్తితో అణ్వాయుధాల్ని తయారుచేసి, నవీకరణ చేస్తామని' ప్రకటించింది. అణ్వస్త్రాల స్థితిగతుల సమీక్ష 'ట్రైయాడ్' అను నేల, గాలి, సముద్రజలాలు- మూడు భాగాల అణ్వస్త్రాల సమీక్షకు సంబంధించిన అమెరికా భవిష్యత్తు ప్రణాళిక ఇది. ఈ ప్రణాళిక ద్వారా రష్యా చైనాలను సరికొత్త ఆయుధపోటీలోకి దింపటానికి చేసిన ప్రయత్నమిది. ఎఫ్-35 యుద్ధ విమానాల ద్వారా, భూమిపై (గాదెవంటివి) సైలోలతోను, నౌకల ద్వారా న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను (అణుశీర్షాలను) ముమ్మరంగా ప్రయోగించే ఉద్దేశ్యంగల 'ట్రైయాడ్' నిర్ణయమిది. దీనిపై అమెరికాలోని రష్యా రాయబారి అనతోలీ ఆంథోనోవ్ స్పందిస్తూ 'రష్యన్లను భయపెట్టి బెదిరించటానికి మమ్మల్ని బూచీగా చూపించి మిలిటరీ ఖర్చులు పెంచుతూ అణ్వాయుధాల్ని గుట్టలు గుట్టలుగా పోగుచేసుకొంటున్నారని అంటూ, ఇందుకుగాను లక్షలకోట్ల డాలర్లను కుమ్మరిస్తున్నారని' అన్నారు.

ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన నివేదిక విడుదలై రెండునెలలు గడిచాయి. మార్చి 1 గురువారంనాడు పుతిన్ క్రెమ్లిన్‌లో వందలాది మంది రాజకీయ ఆర్థిక న్యాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, పార్లమెంటు సభ్యులు, మీడియాముందు యావత్తు రష్యా, ప్రపంచ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ తన స్లైడ్స్ డ్రమానిస్ట్రేషన్ ద్వారా రష్యా మిలిటరీ, అణ్వస్త్రాల గురించి తెలియజేస్తూ ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా ప్రయోగించటానికి రష్యా నూతన సూపర్‌సోనిక్ అణ్వాయుధ క్షిపణుల్ని తయారుచేసిందని, ఇది శత్రుదేశాల రక్షణకవచాలకు చిక్కకుండా పనిచేస్తుందని ఆర్ఎస్-28 సార్మాట్ క్షిపణి ప్రయోగాన్ని వీడియోద్వారా చూపించి సభికుల హర్షామోదాల్ని పొంది, అమెరికా పశ్చిమదేశాధినేతల గుండెల్లో అణ్వస్త్ర క్షిపణుల్ని ఎగురవేసాడు. ఈ క్షిపణి 6800 మైళ్ల దూరానికి 15 అణ్వస్త్రశీర్షాలతో పయనించగలదు. రష్యా పనిచేయు ఒక లేజర్ ఆయుధాన్ని హైపర్‌సోనిక్ క్షిపణిని, క్రూస్ క్షిపణి అణ్వాయుధాలతో లెక్కలేనంత దూరం పయనించగల శక్తిగల బాంబును తయారుచేశామని తమ అంబులపొదిలో ఈ శక్తివంతమైన బాంబు ఉందని రష్యా శక్తి సామర్థ్యాలను బయటి ప్రపంచానికి మరొక్కసారి పుతిన్ తెలియజేశాడు. తన డ్రమాన్‌స్ట్రేషన్ల ద్వారా శత్రువాయు రక్షణ వలయానికి అందకుండా దక్షిణ అమెరికాలోని కాలిఫోర్నియా సముద్ర తీర ప్రాంతమైన అట్లాంటిక్ మహాసముద్రంలో ప్రయోగించబడిన క్షిపణిని కూడా చూపించాడు.

పుతిన్ ప్రవేశపెట్టిన వీడియోల తర్వాత అమెరికా, పశ్చిమదేశాలు రష్యా కోల్డ్‌వార్‌కు సిద్ధమైందని ఇది సరికొత్త 2.0 కోల్డ్‌వార్ (ప్రచ్ఛన్న యుద్ధం) అని విరుచుకుపడ్డాయి. దీనికి సమాధానంగా స్పుత్నిక్ న్యూస్ ఒక వివరణాత్మకమైన విశ్లేషణను రాసింది. దీనిలోగల ముఖ్యాంశాలు గురించి చర్చిద్దాం.

అమెరికా గ్లోబల్ డిఫెన్స్ సిస్టమ్స్‌కు వ్యతిరేకంగా 2004 సంవత్సరంలోనే నూతన తరానికి చెందిన వ్యూహాత్మక క్షిపణుల్ని తయారుచేస్తామని అప్పుడే చెప్పామని గుర్తుచేశారు. మా ఆయుధాల తయారీ రహస్యమైనవి కాదు. మేము చేసేవన్నీ చెప్పి మరీ చేస్తున్నాము. మాదేశ రక్షణ భద్రతలకు గానీ మా మిత్రులకుగానీ అడ్డువస్తే పూరుకోమని ఆనాడే చెప్పామని, పుతిన్ అంటూ 'మమ్మల్ని ఎవరూ ఎప్పుడూ వినదలచుకోలేదు, కనుక ఇప్పుడైనా వినండి' అంటూ పుతిన్ నూతన లేజర్ పానాసోనిక్ ఆయుధాల వివరాలు అందించాడు. మాస్కో ఎప్పటినుండో చాలారకాల సూచనలు చేస్తూ వచ్చింది. ముఖ్యంగా వాషింగ్టన్‌తో కలిసి రక్షణ వ్యవస్థను నెలకొల్పడానికి సంబంధించిన అంశాన్ని అమెరికా తోసిపుచ్చింది. మా భద్రతకు సంబంధించిన అంశాలను పరిగణనకు



రష్యన్ ఖండాంతర అణ్వస్త్ర క్షిపణి

తీసుకోవటంమాని ఏకధృవ ప్రపంచానికి అమెరికా ప్రయత్నించింది అని పుతిన్ అన్నాడు.

2002 సంవత్సరంలో (బాలిస్టిక్ ఖండాంతర) క్షిపణుల ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఇరాన్‌తో ముప్పు పొంచివుందని చెబుతూ మా వ్యూహాత్మక వ్యతిరేక పశ్చిమదేశాల్లో రక్షణ కవచాల్ని ఏర్పరిచింది మాస్కోకాదు. అది వాషింగ్టన్, నాటో కూటమి మాత్రమేనని స్పుత్నిక్ తెలియజేసింది. 2015 ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని కుదుర్చుకొని కూడా 2016లో తూర్పు యూరపులోని పోలెండ్, రొమేనియా దేశాల్లో అమెరికా రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఆయుధపోటీకి మాస్కో దిగదని, ఆర్థికభారం పడకుండానే రష్యా భద్రతను కాపాడుకోటానికి ధీటైన సమాధానం చెబుతామని ఆనాడే పుతిన్ అన్నారని తెలియజేసింది.

రష్యా సరిహద్దుల్లో అమెరికా-నాటో కూటములు మాత్రమే మిలిటరీ స్థావరాల్ని ఏర్పర్చుకొన్నాయి. రష్యా మిలిటరీ స్థావరాల్ని ఏర్పాటు చేసుకోలేదని గుర్తు చేసింది. 1990లో అప్పటి సోవియట్ యూనియన్‌కు అమెరికా ఒక ప్రధానమైన వాగ్దానం చేసింది. నాటోను తూర్పుయూరపుకు రష్యా సరిహద్దులకు విస్తరించమనే అంశమది. కాని ఆచరణలో 2000, 2004, 2009, 2017 సంవత్సరాల్లో నాటో కూటమిని విస్తరించుకొంటూ వచ్చింది. ఇంకా విస్తరించటానికి జార్జియా, ఫిన్లాండు, స్వీడన్‌లతో కూడా సంప్రదింపులు జరుపుతోంది. 2014 ఒకప్పటి సోవియట్ యూనియన్ రిపబ్లిక్ ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో మైదన్ తిరుగుబాటు చేయించి రష్యా వాకిటముంగిట అమెరికా-నాటో స్థావరాల్ని దించటానికి ప్రయత్నించి, రష్యా భద్రతకు ముప్పువాటిల్లేలా చేసింది.

రెండు నెలలక్రితమే ఆయుధ సమీక్ష పేరుతో నూతన ఆయుధ పోటీ ముగ్గులోకి దింపింది అమెరికాయే గాని రష్యాకానేకాదని స్పుత్నిక్ తెలిపింది. మా రష్యా మిలిటరీ న్యూక్లియర్ డాక్ట్రిన్ ప్రకారం ముందుగా రష్యా అణ్వస్త్రాలను ప్రయోగించదని, కానీ మా దేశంపై ఎవరైనా అణ్వాయుధాల్ని ప్రయోగిస్తే ధీటైన సమాధానం చెప్పటానికి రష్యా వ్యవస్థ, రష్యన్ ప్రజలు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నారని స్పుత్నిక్ తెలిపింది.

అమెరికా ఏకధృవ ప్రపంచ శకం ముగిసింది. మిలిటరీపరంగా రష్యాతోపాటు చైనా కూడా బలపడుతున్నది. ప్రపంచ వాణిజ్యాలలో అమెరికా, ఈయూ దేశాలు చైనాల మధ్య పోటీ తీవ్రతరమైనది. ట్రైయాడ్ ఆధునీకరణకు రానున్న సంవత్సరాల్లో అమెరికా లక్షాఇరవైవేల కోట్లు ఖర్చు చేయనుంది. రష్యా ఎంత ఖర్చు చేస్తుందో తెలియపర్చలేదు. 2018 సంవత్సరానికి చైనా తన మిలిటరీ ఖర్చులను 8 శాతానికి పెంచి 17,500 కోట్ల డాలర్లు ఖర్చు చేసి మిలిటరీని ఆధునీకరించనుంది. రష్యా ఇప్పటికే తన జీడీపీలో 5 శాతం పైగా మిలిటరీ రంగానికి వెచ్చిస్తూ భారాన్ని పెంచుకొంటున్నది. ఇక అమెరికా 2019 సంవత్సరానికి 68,600 కోట్ల డాలర్లు కేటాయించింది.

సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా ముడిసరుకులపై అజమాయిషీ కోసం యుద్ధ వాతావరణాన్ని ప్రేరేపిస్తున్నది. తప్పని పరిస్థితుల్లో రష్యా, చైనాలు అమెరికాకు ధీటుగా నిలబడాల్సి వస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా మిలిటరీ ఖర్చుల భారం ఒక మనిషిపై సంవత్సరానికి రెండున్నర వేల డాలర్లు అవుతుంది. పేరుకుపోతున్న మారణాయుధాల నివారణ నేటి తక్షణ కర్తవ్యం. ఈ సందర్భంలో అమెరికా, రష్యా, చైనాలు శాంతి చర్చల ద్వారా మిలిటరీ రంగ ఖర్చులను తగ్గించి ఆపే దిశగా ప్రయత్నించాలి. అంతవరకు తమ దేశ రక్షణకు, ప్రపంచ శాంతికి కూడా రష్యా అణ్వాయుధాల ఉత్పత్తి అవసరమవుతాయి. రష్యా ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా 70 సంవత్సరాల ప్రపంచ యుద్ధ విరామానికి అంతరాయం కలిగే పెను ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ దిశగా రష్యా ప్రకటించిన శక్తిమంతమైన లేజర్ సూపర్‌సోనిక్ అణ్వాయుధ తయారీ సమంజసమే.

- వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు.
సెల్ : **9849491969**

మహిళా దినోత్సవాల దారి ఎటు?

డా. సి.యన్. క్షేత్రపాల్‌రెడ్డి

సమాజంలో సగభాగమైన ప్రజా సమూహపు ఆశయాల్ని, ఆలోచనల్ని, స్మృతుల్ని సమాజంలోకి తీసుకుపోవడానికి ప్రత్యేకమైన రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రపంచ వ్యాపితంగా ఒక ఉత్సాహపూరిత వాతావరణం నెలకొని కేవలం 12 గంటల మాత్రమే కొనసాగి మళ్ళీ వచ్చే సంవత్సరపు మార్చి 8వ తేదీ కోసం ఎదురుచూస్తూనే ఉంటుంది. (మెజారిటీ మహిళా సమూహం). ఇలా గత వందేళ్ళకుపైగానే జరిగింది. భవిష్యత్తులోనూ జరుగుతుంది. ఇదంతా సంప్రదాయంగా జరుగుతూనే ఉంటుంది. కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. కానీ ప్రగతిరథ చక్రం మాత్రం నడక ఆపేసింది. వచ్చిన సమస్య అంతా ఈ నడక ఆగిపోవడంపట్ల మాత్రమే. వాస్తవానికి మార్చి 8 అనేది శ్రామిక మహిళల పోరాటానికి చిహ్నం. ఇది మహిళా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళడానికి ప్రేరణను, చోదకశక్తిని అందించే ఒక మజిలీ. వందల సంవత్సరాల క్రితం అధిక పనిగంటలు తగ్గించుకోవడానికి తాము అనుభవిస్తున్న దుర్భర పరిస్థితుల్ని తాము మార్చుకోవడానికి తమ జీవన ప్రమాణాల్ని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పెంపొందించుకోవడానికి మహిళా కార్మికవర్గం వీధుల్లోకి వచ్చి కదం తొక్కిన రోజుది ఇవి నేడు కూడా కొన్ని ప్రజాతంత్ర, అభ్యుదయ సంఘాలు తప్ప మిగతా సమూహాల్ని దశ, దిశ తెలియకుండానే వీధులవెంట నడవడాన్ని మనం గమనించవచ్చు. అంటే ఆనాడు గమ్యం తెలిసి, నేడు గమ్యం గురించి ఆలోచన లేకుండానే మెజారిటీ మహిళా సమాజం ఈ దినోత్సవాన్ని జరుపుకొని ఆనందపడి ఇది మహిళా చైతన్యం అని ఆగిపోతున్నామేమో అనిపిస్తున్నది. వాస్తవానికి లెనిన్ మహాశయుడు స్త్రీల గురించి చెబుతూ "స్త్రీలను సామాజిక కార్యకలాపాల్లోకి, రాజకీయ జీవితంలోకి తీసుకుని రాలేకపోతే స్త్రీలను వంటగది అనే నిర్జీవ వాతావరణం నుండి బైటకి తేలేకపోతే నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, సమానత్వాలు సాధ్యం కావు అని" అన్నాడు. ప్రతి వంటగత్తె ఒక రాజకీయవేత్త కావాలి అని లెనిన్ అన్నమాట చాలా లోతైన అంశాలతో నిండివుంది. రాజకీయవేత్త అనగానే పదవులు పొందడంకాదు. పదవులకోసం, ఉద్యమాలు నిర్వహించడమూ కాదు. సరైన రాజకీయ, ఆర్థిక, తాత్విక దృక్పథాలను అలవర్చుకోవాలి. ప్రతినిత్యం తమ



నిజజీవితంలో ఎదురవుతున్న సమస్యలపై అవగాహన, ఆ సమస్యలకు మూలకారణాల్ని అన్వేషించగల శక్తి సామర్థ్యాలను పొందడం, లింగ వివక్ష, అసమానత్వం, అణచివేత మూలాలను ప్రాపంచిక దృక్పథం ద్వారా పరిష్కరించుకోవడమే లెనిన్ అన్న మాటకు అర్థంగా భావించాలి.

ఆరు దశాబ్దాల క్రితం మనం రాసుకున్న భారత రాజ్యాంగంలో స్త్రీ పురుషులు, భార్యాభర్తలు తండ్రీబిడ్డలు ఇలా ఎవ్వరైనా సరే అందరూ సమానులే. అందరికీ అన్ని హక్కులు సమానమే అని, కులపరంగా, లింగపరంగా ఎలాంటి వివక్షలు వుండకూడదు అని పేర్కొనబడింది. ఇది సమాజానికి వర్తించడం లేదు. కేవలం రాజ్యాంగం పుటలకే పరిమితమైన సందర్భంలో మన వ్యవస్థలు నడుస్తున్నాయి. రాజ్యాంగాన్ని అమలు చేయవలసినది ఎవరు? రాజ్యాంగాన్ని అమలుపరచలేని ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థలు, రాజకీయ వ్యవస్థలు, రక్షణ వ్యవస్థలు అనుసరిస్తున్న వైఖరులవల్ల ఎవరు శిక్ష అనుభవిస్తున్నారు అన్నది మనం మహిళా సమాజంలోకి తీసుకొని వెళ్ళవలసిన రోజు మహిళా దినోత్సవం. కానీ ఇది గత కొన్ని దశాబ్దాలుగా భిన్నంగా నడుస్తున్నది. ప్రభుత్వాలు తమ అసలురంగు బయటపడకుండా ఈ దినోత్సవాన్ని తమ ప్రచార ఆర్భాటదినోత్సవంగా మార్చుకోవడాన్ని అహా అబలా! అంటూ కీర్తిస్తూ మహిళలందరూ లక్షాధికారులుగా కావాలని అటువైపుగా మా ప్రయత్నాలు సాగుతున్నాయని చెబుతూ వంటింటి సామాన్లు అందిస్తూ మళ్ళీ వంటింటికే పరిమితం చేయడాన్ని మనం చూస్తేనే ఉన్నాం. ఈనేపథ్యంలో మహిళలు అంటే వంటగత్తెలుగానే ప్రభుత్వాలు పరిగణించడాన్ని రాజ్యాంగబద్ధమో, రాజ్యాంగ విరుద్ధమో విజ్ఞతకల్గిన సమాజం ఆలోచించాల్సి ఉంది. ఈ క్రమంలోనే మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాలోకం నడవాల్సిన నూతన దారుల అన్వేషణ జరగాల్సివుంది. ఈనాడు మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అతిపెద్ద ఓటు బ్యాంకు మహిళా సమాజం. ఈ బ్యాంకు చుట్టూనే రాబోవు రోజుల్లో రాజకీయ సమీకరణలు, హామీలు నడుస్తాయి. ఒకరు పావలా వడ్డీ రుణాలు అని, మరొకరు వడ్డీలేని రుణాలనీ, సిలెండర్లు అనీ, ఉచిత రేషను అంటూ రకరకాలుగా మన ముందుకు రావడానికి సిద్ధపడుతున్నారు.

నిజానికి ఏ మహిళ కూడా ఇలాంటి హామీలు కావాలని ఎక్కడా అడిగిందీ లేదు. మనది గ్రామీణ భారతం. వ్యవసాయరంగంలో మహిళ పాత్రలేనిదే మన నోటికాడికి ముద్దరాదు అన్నది వాస్తవం. ముద్ద బంగారం నుండో, ప్రభుత్వాలు ఇస్తామన్న పావలా వడ్డీలోనుంచో పుట్టదు. పుట్టాల్సింది భూమిలోనుండి. ఆ భూమిని పంచుతాం అని ఇప్పటిదాకా ఏ ప్రభుత్వం హామీ ఇవ్వడంలేదు.. ఎందుకని మహిళ ప్రశ్నించాల్సివుంది. వాస్తవానికి మహిళా ఉద్యమం నేడు మనం ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా మధ్యతరగతి దగ్గరకు కూడా రాలేదు. కింది తరగతులకు ఎప్పటికి చేరుతుందో అవలోకనం చేసుకోవాల్సివుంది. మహిళా ఉద్యమం నుండి చదువుకున్న చాలామంది స్త్రీవాదం పేరుపైన ఎంతో కృషి చేస్తున్నారు. పురుషాధిక్య సమాజంపై తిరుగుబాటు రూపాన్ని తీసుకున్నారు. ఇది అవసరమే. అయితే వీరిలో చాలామంది స్త్రీ పురుష వైరుధ్యమే ప్రధాన సమస్య అన్న కోణంలోనే పయనించడం మంచిది కాదు. సమాజంలో పురుషాధిక్యత అనే మాట మెజారిటీ పురుషులకు తెలియదు. ఈ వ్యాసం రాస్తున్న నేను పురుషుడిని అని వెనకేసుకురావాలి అన్న ఉద్దేశ్యంతో ఈమాట చెప్పడం లేదు. తరతరాలుగా ఇలాగే ఉంది అనుకుంటూ పురుష సమాజం తమకు తెలియకుండానే ఆధిక్యతను కొనసాగిస్తున్నారు అన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ ఆధిక్యత విషయం వెనక పురుషుడికన్నా బలమైన పాత్ర 'రాజ్యం' వహిస్తున్నది. ఈ రాజ్యం పోకడ మారితే తప్ప పురుషుడి పోకడ మారదు. అనుకుంటే పొరపాటు. ఈ క్రమంలోనే స్త్రీ సమానత్వాన్ని, స్వేచ్ఛను కోరుకునే ఏ సమూహమైనా ముందుగా పోరాటం చేయాల్సింది రాజ్యంపైన. ప్రస్తుతం స్త్రీవాదుల అంశాల్లో రాజ్యం ప్రస్తావన తగ్గిపోయి పురుషాధిక్యత అన్నమాట బలపడింది అని అనిపిస్తున్నది. ప్రస్తుతం నడుస్తున్న సమాజంలో పురుషాధిక్యత మరింత పెరిగిపోతున్న అంశాన్ని గమనించాలి. దీనివెనుక కారణం రాజ్యం 'మనుధర్మాన్ని' రాజ్యాంగంగా మార్చాలి అనే ప్రయత్నాల్ని ముమ్మరం చేయడమే. స్త్రీ, పురుషుడ్ని, పురుషుడు స్త్రీని నిందిస్తూ ఘర్షణ పడుతూ ఉండటం అనేది నేటి రాజ్యానికి చాలా అవసరం. అది అలాగేవుంటే తప్ప వారి మనుగడ సాగదు అని వారికి బాగా తెలుసు. దీన్ని తెలుసుకోవడంలో మనమే వెనకబడ్డామేమో!

- వ్యాసరచయిత : అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు బి.టి. కళాశాల, మదనపల్లి

(రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)

వి-మెయిల్

నీటి కొరతను నివారించాలి

ఉభయ తెలుగురాష్ట్రాల్లో ఎండలు దంచి కొడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రత్తలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఎండల తీవ్రతకు ప్రజలు బయటికి రాని పరిస్థితి వుంది. మార్చి మొదటివారంలోనే ఎండలు తీవ్రంగా వుంటే ఏప్రిల్ మేనెలలో ఎండలు ఎలా దారెత్తిస్తాయో అని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గ్రామాలలో, పట్టణాలలో చెరువులు, బావులలో నీటి మట్టం తగ్గి ఎండిపోతున్నాయి. పశువులకు నీరు దొరకక అల్లాడిపోతున్నాయి. మహిళలు నీటికోసం బిందెలు పట్టుకుని కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్ళు తెచ్చుకొనే పరిస్థితి దాపురించింది. గ్రామాలలో బోరింగు పంపులలో నీళ్ళు పాతాళానికి చేరాయి. గ్రామాలు, పట్టణాలలో నల్లానీరు రాని పరిస్థితి వుంది. ప్రజలు దాహార్తిని తీర్చుకోవడానికి మంచినీటిని కొని తాగుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాలు, పట్టణాలలో నీటి కొరతను నివారించే చర్యలపై దృష్టిపెట్టాలి. గ్రామాలు, పట్టణాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి. గ్రామాలలో పశువులకు నీటితొట్టెలు ఏర్పాటుచేసి వాటి దాహార్తిని తీర్చాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, జడలపేట, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా

విశాలాంధ్ర
బతుకు
The Life
బుధవారం
07 మార్చి 2018


తిండి కలిగితే కండ కలదోయ్! కండ కలవాడేను మనిషోయ్! ఈసురోమని మనుషులుంటే! దేశమేగతి బాగుపడునోయ్!! అన్నారు మహాకవి గురజాడ అప్పారావు గారు. అందరి సంగతి అటు ఉంచితే ప్రస్తుతం పరీక్షలు రాసే విద్యార్థులకు మాత్రం ఇది బాగా వర్తిస్తుంది. పదో తరగతి పరీక్షలు అంటే విద్యార్థుల జీవితంలో ఓ కీలక మలుపు. భవిష్యత్తు జీవితానికి దారి దీపం. కరియర్‌కు తొలి అడుగు. ఇన్ని ప్రాధాన్యతలు ఉన్న పదో తరగతి పరీక్షలకు ప్రిపేరవడం అంటే పిల్లలకు ఓ యజ్ఞమే. ఈ పరీక్షలకు సన్నద్ధం కావడమంటే అన్నిరకాలుగా అనువైన వాతావరణం ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా మంచి తిండి ఉండాలి. అప్పడే పిల్లలకు చదువుకోవడమూ, పరీక్షలు రాయడమూ సునాయాసం అవుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వ పాఠశాలలు మాత్రం గుర్తించడం లేదు. గుర్తించినా అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికీ తేవడం లేదు. దీంతో అర్ధాకలితోనే పిల్లలు అభ్యాసం చేస్తున్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో మార్కులు, ర్యాంకులు, గ్రేడ్‌లు ఎలా ప్రశ్నిస్తున్నారు విద్యార్థులు. తిండి పెట్టి చదువు చెప్పండి అని అడుగుతున్నారు . మరో వారం రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాన్నాయి. ఇకనైనా, ఈ వారం రోజులైనా పదో తరగతి పిల్లలకు పోషకాహారం ఇవ్వాలి. ఇందుకు సత్వర చర్యలు తీసుకోవాలి.

అర్ధాకలితో పది పరీక్షలు ఎలా!

అల్పాహారం లేక అవస్థలు

ఆకలితో అలమటిస్తూ ఏ పనైనా చేయగలమా? మరి పిల్లలు మాత్రం ఎలా చదవగలరు! ఈ మాత్రం కనీస ఆలోచన లేదా? ప్రభుత్వాలకు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు, నాయకులకు. ప్రస్తుత పరిస్థితి చూస్తే అలాగే ఉంది, ప్రత్యేకించి విశాఖ జిల్లాలో పరిస్థితి ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా ఉంది. మార్కులు, ర్యాంకులు, గ్రేడ్‌ల గురించే ఆలోచిస్తున్నారు గానీ పిల్లల పొట్ట పూర్తిగా నింపాలనే ఆలోచన మాత్రం చేయడం లేదు ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలు. అదేమంటే ప్రభుత్వం బడ్జెట్ కేటాయించలేదని చెబుతున్నారు. దాతలు ఎవరైనా సాయం చేస్తారని ఎదురు చూస్తున్నారు.

ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులంతా దృష్టి సారించారు. మంచి ఫలితాల సాధనకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విశాఖ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 56,853 మంది





విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాధారణ తరగతులకు అదనంగా ఉదయం, సాయంత్రం గంట చొప్పున క్లాసులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తే పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇదంతా బానే ఉంది కానీ ఇంతసమయం ఉండేందుకు పిల్లలకే ఓపిక సరిపక్షవడం లేదు. కారణం ఉదయం ఎనిమిది గంటలకు పాఠశాలకు వస్తే తిరిగి రాత్రికే ఇంటికి వెళ్ళేది. ఈ మధ్యలో మధ్యాహ్నం భోజనం మినహా ఇంకేమీ ఈ పిల్లలకు పెట్టడం లేదు. ఉదయం 11 గంటల వేళ, సాయంత్రం ఐదు గంటలకు ఇవ్వాల్సిన అల్పాహారం ఇవ్వడం లేదు. దీంతో పిల్లలు అర్ధాకలితో అల్లాడుతున్నారు.

గతంలో ప్రభుత్వం బడి పిల్లలకు అల్పాహారం కోసం ప్రత్యేకంగా కొంత బడ్జెట్ కేటాయించేది. దీంతో విద్యార్థుల ఆకలి కొంతవరకైనా తీరేది. ఈ ఏడాది మాత్రం ప్రభుత్వం ఇలాంటి చర్యలు ఏమీ తీసుకోలేదు. ఇప్పటివరకూ అసలు ఆ ఊసే ఎత్తలేదు. దీంతో స్థానికంగా ఉండే దాతలు అయినా స్పందించి సహాయం చేస్తే విద్యార్థుల ఆకలి బాధలు తీరి చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడానికి అవకాశం ఏర్పడుతుంది.

పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాలుగా సిద్ధం చేసేందుకు జిల్లా విద్యాశాఖ చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో ఇప్పటికే సగానికి పైగా రోజులు గడిచిపోయాయి. పరీక్షల ప్రారంభానికి ఇంకా వారం రోజులే గడువు ఉంది. కీలకమైన ఈ వారం రోజులు అయినా విద్యార్థులకు అల్పాహారంతో పాటు అదనపు పోషకాహారాన్నీ ఇవ్వాలి. రోజంతా చదువుకునేందుకు వెచ్చించే పిల్లల పొట్టను పూర్తి స్థాయిలో నింపేందుకు ప్రభుత్వ పాఠశాలలు చర్యలు తీసుకోవాలి.

రోజుకు ఒక్కో విద్యార్థికి కనీసం రూ. 5లు కేటాయించినా వారి ఆకలి కొంతవరకైనా తీరుతుంది. ఒక్కో పాఠశాలలో దాదాపుగా 50 నుంచి 150 లోపు విద్యార్థినీవిద్యార్థులు ఉన్నారు. అంటే రూ. 250లు నుంచి రూ.750లు ఖర్చు అవుతుంది. దాతలైనా ముందుకు వచ్చి ఈ సహాయం అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వాలు, దాతలే కాదు కనీసం ఆ పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులూ ఈ పని చేయవచ్చు. పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లంతా కలిసికట్టుగానైనా ఈ పనిచేయవచ్చు. అదే జరిగితే ఆ పిల్లలు మిమ్మల్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటారనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఒక మంచి పని కోసం ఎవరో ఒకరు ముందడుగు వేయాలి కదా!

రెడ్డిపల్లి. రాము, రాంబిల్లి, విశాఖజిల్లా

నీరసించిపోతున్నాం



మంచి గ్రేడ్ పాయింట్లు సాధించడం కోసం కష్టపడుతున్నా, అందుకు ఎక్కువ సమయం చదువుతున్నా, అయితే అల్పాహారం అందక సాయంత్రానికి అలసటతో నీరసించిపోతున్నాం. అల్పాహారం అందిస్తే మరింత కష్టపడగలుగుతాం.

- రెడ్డిపల్లి లహరి, విద్యార్థిని

ఏకాగ్రత కుదరదు



పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుదు.సరైనా పోషకాహారం తీసుకోకపోతే ఏకాగ్రత కుదరదు.విద్యార్థులు కడుపునిండా భోజనం చేయాలి.అర్ధాకలితో చదివితే సరిగ్గా గుర్తు ఉండదు.సమయానికి తినకపోతే ఆరోగ్యం సరిగ్గా ఉండదు.పరీక్షల సమయంలో ఆరోగ్యం చాలా ముఖ్యం.

- వెంకటరావు, ప్రభుత్వ వైద్యులు

దాతలు సహకరించాలి



ఎక్కువ సమయం పాఠశాలలో ఉండి విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆకలితో కొంత ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. దాతలు ముందుకు వచ్చి ఆల్పాహారం అందించాలి.

- మాధవి హెచ్ఎం

మీ పళ్ళను తెల్లగా ఉంచండిలా..

చాలా కారణాల వలన మీ పళ్ళు డల్‌గా మారి, మెరుపును కోల్పోతాయి. కొన్నిసార్లు కొన్ని ఆహారపదార్థాల మరకలు పింగాణీ ఎనామిల్ (పళ్ళపై ఉండే బయటపొర)పై పడిపోతాయి. ఇంకా, కొన్నిసార్లు పళ్లకి గారపట్టడం వలన అవి పసుపుపచ్చ రంగులో కన్పిస్తాయి. కానీ రకమైన రంగు మారిపోయే, కోల్పోయే సమస్యను సులభంగా ఇంటిలోనే సహజ చిట్కాలతో పరిష్కరించుకోవచ్చు. అలాంటి ఒక ఐదు చిట్కాలను చదివి తెలుసుకోండి.



కొబ్బరినూనె

కొబ్బరినూనె మీ పళ్ళను శుభ్రపర్చగలదు. ఒక చెంచాడు కొబ్బరినూనెను మీ నోట్లోకి వేసుకుని ఐదు నిమిషాల పాటు పుక్కిలిపట్టండి. మీరు టూత్ బ్రష్ పై కూడా కొన్ని చుక్కల కొబ్బరినూనెను వేసుకుని దానితో పళ్ళను ఐదు నిమిషాల పాటు బ్రష్ చేయవచ్చు. తర్వాత మీ నోటిని కడుక్కుని మెల్లగా ఫలితాలను మీరే చూడండి.

యాపిల్ సిడర్ వెనిగర్

యాపిల్ సిడర్ వెనిగర్‌లో ఎసిటిక్ యాసిడ్, పొటాషియం ఇంకా మెగ్నీషియం వంటివి ఉండి చెడ్డ బ్యాక్టీరియాను చంపేసి, గారపట్టిన పళ్ళను బాగుచేస్తాయి. ఇంకా, యాపిల్ సిడర్ వెనిగర్‌కి ఉండే పిహెచ్ వలన పళ్ళపై మరకలు తొలగిపోతాయి. మీరు చేయాల్సిందల్లా కొంచెం యాపిల్ సిడర్ వెనిగర్‌ను పళ్ళపై రెండు నిమిషాలపాటు రుద్ది, నీళ్ళతో తర్వాత నోరు కడుక్కోండి.

నిమ్మ తొక్క

నిమ్మలో సహజ బ్లీచింగ్ ఏజెంట్లు ఉంటాయి, ఇంకా నిమ్మ తొక్క నిజానికి మీ పళ్ళను శుభ్రపర్చగలదు కూడా. నిమ్మతొక్కను నేరుగా మీ పళ్ళపై రుద్దుకుని తర్వాత నోటిని నీరుతో కడుక్కోండి.

స్ట్రాబెర్రీ

మీకు స్ట్రాబెర్రీలు తినటం ఇష్టం అయితే, మీకో మంచివార్త. స్ట్రాబెర్రీలను తినడం లేదా పళ్ళపై రుద్దుకోవడం మీ పళ్ళను సహజంగా తెల్లగా మారేలా చేస్తుంది. అందులో ఉండే యాంటీఆక్సిడెంట్ల మహత్యం!

వంటసోడా

ప్రతిఒక్కరికీ వంటసోడా శుభ్రపరిచే గుణాలు తెలుసు, అది మీ పళ్ళపై కూడా పనిచేయగలదు. కొంచెం వంటసోడాను నీళ్ళతో కలపండి. ఈ పేస్టును బ్రష్ పై వేసుకుని ఒక నిమిషం పళ్ళను తోముకోండి. తర్వాత నీళ్ళతో నోటిని కడుక్కోండి

చుండ్రు చిక్కులా!

తలంతా దురద పెడుతుందా! దీంతో పాటు తలపై నుండి పొట్టు రాలుతోందా! అయితే అది కచ్చితంగా చుండ్రే. చుండ్రు అనేది సాధారణంగా ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమయంలో వస్తుంది. ఈ బిజిబిజి జీవితంలో దేని మీద శ్రద్ధ పెట్టే సమయం లేదు. ముఖ్యంగా తలపై అస్సలు శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. తలస్నానం చేయకపోవడం, అధికంగా తలస్నానం చేయడం, తలకు నూనె రాయకపోవడం వల్ల తలపై చర్మం పొడి బారడం వల్ల వచ్చే సమస్యే చుండ్రు. దీని వల్ల ముఖంపై మొటిమలూ వస్తాయి. చుండ్రును నివారించడానికి చాలా రకాల షాంపులు వాడి విసిగిపోయారా! అయితే ఇంటి వద్దే ఉపయోగించుకునే సహజ సిద్ధమైన చిట్కాలు చూద్దామా!

బంతి-కొబ్బరి నూనె

50 గ్రాముల బంతి ఆకులు, 250 మిల్లి గ్రాముల కొబ్బరి నూనెను తీసుకోండి. ఈ రెండిటిని కలిపి ఉడికించాలి. ఉడికే సమయంలో చిటికెడు కర్పూరం వేయండి. 15నిముషాల పాటు ఉడికించండి. తర్వాత ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకోండి. ఈ మిశ్రమాన్ని రోజూ తలపై మర్ధన చేయండి. ఇలా చేస్తే చుండ్రును నివారించవచ్చు. కర్పూరంలోని ఔషధ గుణాలు ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ రాకుండా కాపాడుతాయి.



మెంతులు

మెంతులు చుండ్రు సమస్యకు దివ్యౌషధంలా పనిచేస్తాయి. మెంతుల్ని రాత్రంతా నానబెట్టండి. ఉదయాన్నే వాటిని మిక్సీ పట్టండి. ఈ మిశ్రమానికి కొంచెం నిమ్మరసం, కొద్దిగా వెనిగర్ కలిపి పట్టించండి. ఇలా చేస్తే చుండ్రు సమస్య తగ్గుతుంది.

పెసరపప్పు-ఆలివ్ ఆయిల్

2 టేబుల్ స్పూన్స్ పెసరపప్పు, 2టేబుల్ స్పూన్స్ పెరుగు, 1టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్‌ని తీసుకోండి. పెరుగులో పెసరపప్పును గంట పాటు నానబెట్టండి. తర్వాత మిక్సీ పట్టుకోండి. ఈ మిశ్రమంలో ఆలివ్ ఆయిల్‌ని కలిపి తలకు పట్టించండి. తరచు ఇంట్లో ఉండే ఈ పదార్థాలను ఉపయోగిచడం వల్ల తలపై పొట్టు రాలడం తగ్గి దురదలు తగ్గుతాయి.

బేకింగ్ సోడా-నీరు

2టేబుల్ స్పూన్స్ బేకింగ్ సోడాకి 2టేబుల్ స్పూన్‌ల వాటర్‌ని కలపండి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టిస్తే తలపై వున్న పొట్టు అట్టలట్టలుగా ఊడిపోతుంది. అలా అని ఒకటి లేదా రెండు సార్లు చేయడం వల్ల ఫలితం వుండదు. తరచూ చేస్తూ వుంటేనే చుండ్రు రాకుండా నియంత్రించవచ్చు.

నిమ్మకాయ

సాధారణంగా నిమ్మకాయ అన్ని రకాల సమస్యలకు మంచి ఔషధంలా పని చేస్తుంది. అంతేకాకుండా నిమ్మకాయ యాంటిసెప్టిక్ కూడా. అందుకని దురద ఎక్కువగా వుంటే 3టేబుల్ స్పూన్స్ నిమ్మరసంలో 1టేబుల్ స్పూన్ ముల్తానీ మట్టిని కలపి తలకు పట్టించండి. తర్వాత గోరు వెచ్చని నీటితో తలస్నానం చేయండి. ఈ విధంగా వారినికోకసారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

తులసి ఆకులు

తులసి ఆకులు అన్ని విధాల శ్రేష్టమైనవి. ప్రతి ఇంటా వుండే ఈ చెట్టులో ఔషధ గుణాలు చాలా వున్నాయి. దీనిలో యాంటి బ్యాక్టీరియా, యాంటి ఫంగల్ తత్వాలు ఎక్కువగానే వున్నాయి. అలాంటి ఈ ఆకుల్ని తీసుకొని మిక్సీ పట్టండి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించండి. అరగంట తర్వాత తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే చుండ్రు రాదు. అంతేకాక వెంట్రుకలు ఒత్తుగా వస్తాయి, త్వరగా తెల్లబడవు.

రామాఫలంతో కేన్సర్‌కి చెక్

సీతాఫలాన్ని పోలిన ఈ ఫలం తియ్యటి రుచితో మధురమైన సువాసను కలిగి ఉంటుంది. ఈ ఫలం మార్చి నెలలో అధికంగా లభిస్తుంది. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల అలసట దూరమవుతుంది. అంతేకాక ఇది శరీరాన్ని ఉత్తేజపరుస్తుంది. మిగిలిన పండ్లతో పోలిస్తే దీనిలో విటమిన్స్, యాంటి ఆక్సిడెంట్స్ ఎక్కువగా వున్నాయి. ఈ యాంటి ఆక్సిడెంట్స్ శరీరంలో మలేరియా, కాన్సర్ వ్యాధులకు కారణమైన కణాలను నియంత్రిస్తాయి. ఈ ఫలాన్ని రోజు తీసుకుంటే 10వేల సార్లు కిమో పెట్టించుకున్నంత ఫలితం వస్తుంది.

రామాఫలంలోని విటమిన్-సి, బి కాంప్లెక్స్‌లోని పైరడాక్సిన్ మెదడు కణాలకు అవసరమైన రసాయనాలను స్థిరంగా వుంచేందుకు దోహదపడుతుంది. నరాల వ్యాధులు, తలనొప్పి రాకుండా నివారిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. వీటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అనవసరపు కొవ్వును కరిగిస్తుంది. అప్పుడే ప్రసవించిన తల్లుల్లో పాలుత్పత్తికి సహకరిస్తుంది. రక్తహీనతతో బాధపడే వారు ఇవి తింటే మంచిది. రామా ఫలాన్ని తరచూ తీసుకోవడం వల్ల చర్మ సంబంధిత వ్యాధుల్ని నియంత్రించవచ్చు. రామాఫలం



గుజ్జుకు పాలు కలిపి ఫ్రిజ్‌లో ఒక గంట పాటు వుంచి తర్వాత తీసుకుంటే గుండె సంబంధిత వ్యాధుల్ని నివారించవచ్చు.



జరిగిన కథ

పనిచేస్తే అమెరికన్లతో కలిసి పని చెయ్యాలండీ! ఎందుకండీ మన చదువులన్నీ - 'కదసి తామరందు కప్ప కూర్చున్నట్లు' అని వేమన అన్నట్లు - మన ఇంజినీర్లు చదువుకున్నారు చదువులు" అన్నాడు.

"సీతారాంగారూ! మీరు మహా చమత్కారంగా మాట్లాడు తారండీ. ఆరంబాకం కబుర్లు చెప్పండి" అన్నాను. "ఏం చెప్ప మన్నారు? అక్కడ చిత్రమైన మనిషి వొకాయన వున్నాడు" అన్నారు. "ఎవరండోయ్?" అన్నాను. "నక్క పుట్టి నాలుగు వారాలు కాలేదు - ఇంత గాలివాన యెప్పుడూ చూడలేదందిట. అలాగ్గా అతను చెన్నపట్నం వదిలి వెళ్లలేదు జన్మలో. అన్నీ అతనికి తెలుసునంటాడు. మహాయాతన పెట్టేస్తున్నాడండీ మమ్మలిని!" అన్నాడు విసుక్కుంటూ. "ఏం? లంచాలు తెమ్మంటాడా?" అన్నాను చకితనై.

(నిన్నటి సంచిక తరువాయి)

తెమ్మన్నా బాగుండునండీ 'పెట్టి పొయ్యలేని నరులు భూమి, పుట్టనేమి వారు గిట్టనేమి, పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా?' అన్నాడు వేమన. ఆ మహానుభావుడు, 'ముక్కుకు సూటిగా పోతాను, తలవెంట్రుక వాసి తప్ప వాటం కా'దంటాడు" అన్నాడు. లోపలమండిపోతూ, పైకినవ్వుతూ, "ఎవడండీ అతను?" అని అడిగేను. "పేరుచెబితే మాత్రం మీకేం తెలుస్తుంది లెండి" అయినా అతణ్ణి అని ఏం ప్రయోజనం లెండి! జన్మ అలాంటిది. హుందాతనం, ఉదారస్వభావం పుట్టుకతో రావాలి. తల్లి నీళ్ళబిందెలు మోసి చదువు చెప్పించిందట. భారీతనం దర్జా రమ్మనమంటే యెక్కడ నుంచి వస్తాయి? ఉద్యోగం అంటే వచ్చిందిగాని. తన సొమ్ము అయినట్టు దమ్మిడీ దగ్గరనుంచి లెక్కపెడతాడండి గవర్నమెంటుడబ్బు. వుత్త దరిద్రుడు దొరికాడండీ మాకు. 'ఎవ్వరిగుణములు యేమన్నమాసవు. చక్కచేయరాదు కుక్కతోక" అన్నాడు మా గురువు."

"మీరూ ఇంజనీర్లేకదా! డిజైను మార్చండి అని నచ్చచెబితే వినడా." అన్నాను.

"ఇన్ని దేశాలు తిరిగొచ్చారుగాని మీకు ప్రపంచం తెలియదండీ సుభగారూ! వేమన అన్నాడు: 'లోభివాని జంప లోకంబులోపల మందు వలదు వేరె మతముగలదు; పైక మడుగగ భుగ్గుసపడిచచ్చు. అన్నట్టు ఆ మాట యెత్తితేచాలు పంచప్రాణాలు పై కెగిరిపోతాయి ఆయనకి. దేశ దేశాలూ తగలబడి పోతూంటే, అక్కడికి డిజైనంటే శిలాక్షరంలాగు. అవతల జపానువాడు అజాతశత్రువులాగు మీదపడి పోతున్నాడు. ఇవతల 'ఇంటిలోని పోరు ఇంతింత గాదయా' అని అమెరికావాడు వేధించేస్తున్నాడు. మధ్య మేము నలిగిపోతున్నాం అంటే నమ్మండి" అన్నాడు సీతారాం. "ఇంతకీ ఆయన పేరు చెప్పారు కారు" అన్నాను. "ఆయన నామధేయం జనార్ధనరావు గారు. మీకు తెలియనట్టు నటిస్తూ. "మీరు వింటే వినుండవచ్చు. నలుగురిలో తిరిగే మనిషికాడు. అసలు మన జట్టువాడు కాదులెండి. వాళ్ళింట్లోనూ వీళ్ళింటిలోను తల్లి నీళ్ళబిందెలు మొయ్యడం, వంట లక్కపని చెయ్యడం, ఇతను ఇందాండ అందాండ వారాలు చేసుకొని చదువుకోవడం. అతడు నలుగురి లోనూ చిన్నతనం పడతాడు మరి. కడుపున పుట్టిన "మదర్" గురించి అలా తలవంపులు పడ్డం వుండే మనిషిలో చేవ లేదన్నమాట" అన్నాడు గట్టిగా. "అతని పుట్టు పూర్వోత్తరా లన్నీ బాగా కూపీ తీశారే" అన్నాను నవ్వుతూను.

"నాకు అతనితో యీ పదిహేను రోజులైయే పరిచయం. కాని మా కంపెనీ డైరెక్టరు సేట్జీ యీ సంగతులన్నీ చెప్పాడు. సేట్జీది మహాఘట్టిబుర్రలెండి. గొప్ప హోదాలో వున్న ఉద్యోగులందరి గురించీ అతను ప్రత్యేకంగా మనుష్యుల్ని పెట్టి భోగట్టా అంతా సంపాదించి నాడీ గ్రంథం లాంటివి తయారు చేస్తుంటాడు" అన్నాడు. సేట్జీని మెచ్చుకుంటూ. "సి.ఐ.డి. రిపోర్టు అందురూ' అన్నాను. 'పెద్దమాటే' విసిరారు. ఎవరి కీలకం ఎక్కడుంటుందో. ఎవరిని యెరవేసి యే గేలంతో లాగాలో మరి తెలుసుకోకపోతే వ్యాపారం ఎలా చేస్తానండీ "అంటాడు సేట్జీ" అన్నాడు."

"తన వాళ్ళ గురించి చేస్తే తనకేం ఉపయోగం?



ఏమోలెండి! మా 'పాథర్' అంటే నేను బుర్ర వొంచుకోవలసిన అగత్యం లేదుకదా? నేను ఇంగ్లండులో వున్న ఆరు సంవత్సరాల్లోనూ నలభైవేలు పంపించాడు. ఇప్పటికీ అలాగే సమండీ" అన్నాడు.

"మీ తండ్రిగారిది యే వ్యాపారం సీతారాంగారూ? మీ సేట్జీ నేనూ భోగట్టా తీయడం మొదలుపెడుతున్నాను సుమండీ. అన్నా నవ్వుతూ. "నా చిన్నతనంలోనే మా 'ఫాదర్' బర్మా వెళ్ళిపోయాడు. ఆ తరవాత నేను వెళ్ళిపోయాను సీమ. అందుచేత నాకు బాగా తెలియదు కాని సరుకుల ఎగుమతి అనుకుంటాను. ఇప్పుడేం వ్యాపారం లెండి! కృష్ణా, రామా



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

అనుకుంటూ అక్కడ దానం ధర్మం చేసుకుంటూ కూచున్నాడు. మరి నేను వెళ్ళివొద్దునా సుభగారూ! మళ్ళీ యెప్పుడు కలుసుకోవడం? నా టెలిఫోను నెంబరు ఇదుగో" అంటూ వెళ్ళిపోయాడు.

ఇప్పుడు తెలిసింది, జనార్ధనరావు మా యింటికి రమ్మనమని నేను యెన్నిసార్లు పిలిచినా ఎందుకు రావడం లేదో! పాపం, వాళ్ళమ్మ ఎంత కష్టపడి చదువు చెప్పించిందో కదా. అంచేత అతను చిన్నతనం పడుతూ నలుగురిలోనూ తిరగడానికి జంకుతున్నాడని నే ననుకోను. అమ్మ, నాన్న వొచ్చాక మళ్ళీ మరొకసారి పిలిచి రమ్మనమని బలవంతం చెయ్యాలి. ఈరోజుల్లో డబ్బుకి కక్కుర్తిపడకుండా ముక్కుకు సూటిగా వెళ్ళడం గొప్పమాట! అలాంటివాళ్ళని వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు.

అయితే సీతారాం జనార్ధనరావు గురించి నా దగ్గిర యీ మాట లెందుకు జారేశాడు? అబ్బే, ఎందుకేమిటిగాని భలేవాడు సీతారాం. వేమన అంటే చెవి కోసుకుంటాడు. 'ఫాదర్', 'ఫాదర్' అంటాడు. నాన్న అనకూడదూ? ఇంగ్లీషుముక్కలు పాడలవాటు కాకపోతే మరేమిటి? మొత్తం మీద గమ్మత్తు మనిషి. అప్పటికీ ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆ విగ్రహం ఆ హాస్యమున్నూ... జనార్ధనరావుకి టెలిఫోను చేదునా? రాత్రి సినిమాకి వెళదాం అని? ఈవాళ వద్దు. రేపు చేస్తా.

10 అతడు

ఈ కొత్తరైలు మార్గం ప్రారంభించడం కాదుకాని, నెల్లాళ్లై వూపిరి సలపకుండావుంది. పని. అలా చేతినిండా పని వుంటేనే నాకు సరదా. కాని ఇక్ష్వాకుల నాటి యీ వంతెనల శిల్పం చూస్తే నాకు తలనొప్పి వస్తుంది. ఇదే ప్రీస్ట్రెస్టు కాంక్రీటుతో కట్టితే ఎంత బాగుండును! ఈ మాటు కాస్త తీరుబడివున్న తరువాత డ్రాయింగులు దీసి లెక్కలుకట్టి చూడాలి. అప్పటికికాని నాకు తనవితీరదు. 'ప్రీస్ట్రెస్టు అవుతే ఈ కాంట్రాక్టర్లమీద ఇప్పుడున్నంత అజమాయిషీ అవసరం వుండదు. అమధ్యని నేను స్వయంగా చూడబట్టి కాని లేకపోతే ఏమైవుండునో? వంతెన పునాదులకి నేను అంగుళం ఖడ్డీలని వెయ్యాలని చెపితిని. సరే అన్నారు వాళ్ళు తీరా చూద్దునుగదా - అరుమూళ్ళవి వేసి పని మొదలుపెట్టేస్తున్నారు. పెద్ద ఇంజనీరుని పిలిపించి చూపించితే, తన కిందివాళ్ళని నా యెదుటే చడామడా తిట్టి క్షమాపణ వేడుకుని చేసిన పనినంతా తిరగతోడించి మళ్ళా చేయించాడు. పాపం, ఇతనెవడో చాలా మంచివాడులాగున్నాడు. తెలుగువాడే. సీతారాం అతనిపేరు. నేను నా కింది ఇంజనీర్లతో "మీరందరూ ఎలా చూస్తూవూరు కున్నారయ్యా" అని కొంచెం కోపంగా అడిగేసరికి సీతారామే కలుగజేసుకుని "మీవాళ్ళదేం తప్పు లేదండీ. తప్పు అంతా మా వాళ్ళదేనండి. అందుకు నాదే జవాబుదారీ' అంటూ సర్దేశాడు. సాంకేతిక విద్యలో ఆరితేరినవాడు. ఉత్సాహవంతుడూ, నాలాగే యువకుడూ, అంచేత అతనంటే నాకు సరదా వేస్తుంది. అతన్ని పరిచయం చేసుకుందాం అని రెండు మూడుసార్లు అనుకున్నాను. గాని, యీ సంగతి గులాబుచందు సేటుకి తేలుస్తే నన్ను మళ్ళీ ముట్టడించడం మొదలులెడతారు. ఎందుకొచ్చిన చికాకు అని మానేశాను.

సుభ నాలుగు రోజులకిందట టెలిఫోను చేసింది. "ఏమండీ జనార్ధనరావుగారూ? బొత్తిగా మొహం చూపించడం మానేశారు? మమ్మలినందరినీ వెలివేశారా యేమిటి? నేను విశాఖపట్నం వెళ్ళొచ్చాక వొక్కసారి కాంసు కలుసుకున్నాం బీచిదగ్గర. పుష్కరంనాటి మాట. మళ్ళీ పుష్కరానికేనా యేమిటీ మిమ్మల్ని చూడడం?" అంది ఆమె. ఆవిడె సాధింపుమాటలని వింటూంటే ఇంకా వినాలనేవుంది. ఏమి గొంతుక! మాటల్లో ఏం చమత్కారం! ఆ గొంతుకలో ఎంతో అప్యాయం, లాలన అంతర్లీనం అయి ప్రశాంతంగా ప్రవహిస్తూన్నట్టున్నాయి. సినిమాకీ వెళ్ళినప్పుడు చూస్తూంటానుకదూ - కొంతమంది ఆడవాళ్ళూ సముద్రపు హోరులాగే, హడావుడీ, గడబిడ. కొంతమంది వడగళ్ళ వాన - తుఫానే. రాయి వేసినా చప్పుడూ అలలూ లేకుండా చలనంలేని చెరువుల్లాంటివాళ్ళు కొంతమంది ఏనుగు కుంభ స్థలాలు కూలిపోయాయి. పారే గోదావరి పారడం మానివేసింది. సభవారికి చాప అంటుకుపోయిందని అమ్మ కథ చెపుతూండేది. అలాగ్గా నెల్లాళ్ళయి కుర్చీకి నేను అతుక్కుపడి పోయాను. ఈ ఆదివారం ఎలాగేనా గుండె ధైర్యం చేసుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళి ఆమెను చూసి ఆమె తల్లిదండ్రులు పరిచయం చేసుకోవాలి. లేకుంటే ఆమె ఏమేనా అనుకుంటే నేను బతకడం ఎలా! ఆమెకి నా మీద కోపంవస్తే నేను భరించగలనా? నా కెవరున్నారు ఈ ప్రపంచంమీద? 'ఏం జనార్ధనా, నిన్నుచూసి చాలారోజులైందోయ్' అన్నవాళ్ళె వరున్నారు?

....సాయంకాలం నేను నా సెలూను బండికి ముందుగా వచ్చేశాను. స్నానంచేసి ఫలహారం చేస్తుండగా సీతారాం వచ్చాడు. ఎంతేనా తెలుగువాడు. తోడీ ఇంజనీరు, మొహంమీద తలుపు వేసేయలేనుకదా? "దయచెయ్యండి" అన్నా. "మావాళ్ళ తప్పుకి మీ ఎదుట బుర్రెత్తుకుని తిరిగ లేకుండా వున్నానంటే నమ్మండి జనార్ధనరావుగారూ! నేను వాళ్ళపైన చీఫ్ ఇంజనీరునైనా 'ఓటికుండ నీరుపోసిన చందాన విశ్వదాభిరామ వినురవేమ' అని నేను ఎన్ని చెప్పినా వినిపించుకోరు గదా! ఉద్యోగం మానుకుందాం అని వుంది" అని అన్నాడు అతను విచారంగా.

- ఇంకా వుంది.

పేరెన్నికగన్న ఉద్యమాలు- సంస్థలు - ప్రారంభించిన వ్యక్తులు



ఉద్యమాలు/ సంస్థలు/ పార్టీలు	స్థాపకులు
భారత్‌లో....	
ఆత్మీయ సభ (1815)	- రాజా రామ్మోహన్‌రాయ్
బ్రహ్మసమాజం (1829)	- రాజా రామ్మోహన్‌రాయ్
తత్వబోధిని సభ (1839)	- దేవేంద్రనాథ్ ఠాగూర్
యంగ్ బెంగాల్ ఉద్యమం (1830)	- హెన్రీ వివియన్ డిరాజియో
ఆర్యసమాజం (1875)	- దయానంద సరస్వతి
శుద్ధి ఉద్యమం	- దయానంద సరస్వతి
బెతూన్ స్కూల్ (1849)	- ఈశ్వరచంద్ర విద్యాసాగర్
ప్రార్థనా సమాజం (1867)	- ఆత్మారాం పాండురంగ
దివ్యజ్ఞాన సమాజం (1875)	- మేడమ్ బ్లావట్‌స్కీ, కల్నల్ ఓల్కాట్
రామకృష్ణ మిషన్ (1897)	- స్వామి వివేకానంద
లోక్‌సేవా మండల్	- లాలా లజపతిరాయ్
హిందూమహాసభ	- మదన్‌మోహన్ మాలవ్య లాలా లజపతిరాయ్
సత్యశోధక్ సమాజ్ (1884)	- జ్యోతిబాపూలే
దీనబంధు సార్వజనిక్ సభ (1884)	- జ్యోతిబాపూలే
సాధారణ బ్రహ్మసమాజం (1878)	- ఆనంద్ మోహన్ బోస్
ఇండియన్ లీగ్ (1875)	- శిశిర్ కుమార్ ఘోష్
స్వరాజ్ పార్టీ	- మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్.దాస్
ఈస్ట్ ఇండియా అసోసియేషన్ (1866)	- దాదాబాయ్ నౌరోజీ
ఇండియన్ నేషనల్ సోషియల్ కాన్ఫరెన్స్	- ఎం.జి.రణడే
భారతీయ బ్రహ్మ సమాజం	- కేశవ చంద్రసేన్
ముస్లింలీగ్ (1906)	- ఆగాఖాన్, సలీముల్లా
అనుశీలన్ సమితి (1907)	- బరీంద్ర ఘోష్, భూపేంద్ర దత్తా
అభినవ భారతి (1906)	- వినాయక్ సావర్కర్ (లండన్)
విశ్వభారతి (1912)	- రవీంద్రనాథ్ ఠాగూర్
గదర్ పార్టీ (1913)	- లాలాహరదయాల్ (శాన్‌ఫ్రాన్సిస్కో), సోహన్‌సింగ్ బక్నా
ఖిలాఫత్ ఉద్యమం (1919)	- అలీ బ్రదర్స్, మౌలానా ఆజాద్, హకీం అజ్మల్‌ఖాన్, హస్రత్‌మోహనీ
ఇండిపెండెంట్ లేబర్ పార్టీ	- బి.ఆర్.అంబేద్కర్
బహిష్కృతకారిణి సభ (1924)	- బి.ఆర్.అంబేద్కర్
సర్వోదయ సమాజ్	- ఆచార్య వినోబాభావే
భూదానోద్యమం	- ఆచార్య వినోబాభావే
రాష్ట్రీయ స్వయం సేవక్ (1925)	- హెడ్గెవార్
ఆజాద్ హింద్ ఫౌజ్ (1939)	- సుభాష్ చంద్రబోస్
వితంతు పునర్వివాహ సంస్థ	- విష్ణుశాస్త్రి పండిట్
రాధాస్వామి సత్సంగ్	- తులసీరామ్
ఆత్మగౌరవ ఉద్యమం	- పెరియార్ రామస్వామి నాయకర్
శారదా సదన్ (1884)	- పండిత రమాబాయి
భారత ధర్మ మహామండలి	- పండిత మదన్‌మోహన్ మాలవ్య
అహ్మదీయ ఉద్యమం	- గులాం అహ్మద్
జస్టిస్ ఉద్యమం	- టి.ఎం.నాయర్
ధర్మసభ	- రాధాకాంత్ దేబ్
ధర్మ పరిపాలనా యాగం (1902- 1903)	- శ్రీనారాయణ గురు
అలీఘర్ ఉద్యమం	- సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్
వహాబీ ఉద్యమం	- సయ్యద్ అహ్మద్ బరేలి, షా అబ్దుల్ అజీజ్
సేవా సమితి	- హెచ్.ఎన్.కుంజ్రు
దేవ్ సమాజం	- ఎస్.అగ్నిహోత్రి
సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ (1965)	- గోపాలకృష్ణ గోఖలే
పూనా సేవా సదన్	- రమాబాయి రణడే
దేవానంద్ ఉద్యమం	- మహ్మద్ కాశీం వహాబీ
హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్	- చంద్రశేఖర ఆజాద్
ఇండియన్ అసోసియేషన్	- ఆనంద్ మోహన్ బోస్, సురేంద్రనాథ్ బెనర్జీ
సోషల్ సర్వీస్ లీగ్	- ఎన్.ఎం.జోషి
ఖుదాయి - ఖిద్మద్‌గార్ (రెడ్‌షర్ట్స్)	- ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్
దక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ	- జి.జి. అగార్కర్
హితకారిణి ధర్మకర్తృత్వ సంస్థ (1874)	- కందుకూరి వీరేశలింగం
చిప్కో ఉద్యమం	- సుందర్‌లాల్ బహుగుణ
హిందూస్థానీ సేవాదళ్	- ఎన్.జి.హర్డేకర్
సింగ్ సభ (1874)	- సిక్కు నాయకులు
చీరాల పేరాల ఉద్యమం	- దుగ్గిరాల గోపాలకృష్ణ
నర్మదా బచావో ఆందోళన్	- మేధా పాట్కర్
పెదనందిపాడు పన్నుల సహాయ నిరాకరణోద్యమం	- పర్వతనేని వీరయ్య చౌదరి
సహాయ నిరాకరణోద్యమం (1920-22)	- మహాత్మాగాంధీ
శాసనోల్లంఘనోద్యమం (1930-34)	- మహాత్మాగాంధీ
క్విట్ ఇండియా ఉద్యమం (1942)	- మహాత్మాగాంధీ
ఆసియాటిక్ సొసైటీ	- విలియం జోన్స్
అభినవ భారత్ (1967)	- గణేశ్ సావర్కర్
మిత్రమేళా (1899)	- సావర్కర్ సోదరులు
హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్	- సచిన్ సన్యాల్, జోగిష్‌చంద్ర చటర్జీ
ఇండియన్ ఇండిపెండెంట్ లీగ్ (1942)	- రాస్ బిహారీ బోస్
ప్రపంచంలో...	
వైఎంసీఏ	- సర్ జార్జి విలియమ్స్
సాల్వేషన్ ఆర్మీ	- విలియం బ్రూత్
బాయ్స్ స్కౌట్ ఉద్యమం (1908)	- లార్డ్ బేడిన్ పావెల్
రెడ్‌క్రాస్ (1858)	- హెన్రీ డ్యునాంట్

అకాడమీలు - సంస్థలు



సంస్థ	ప్రదేశం
కేంద్ర సాహిత్య అకాడమీ	న్యూఢిల్లీ
లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్	ముస్సోరి (ఉత్తరప్రదేశ్)
ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్స్	న్యూఢిల్లీ
సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్	మైసూరు
సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్	హైదరాబాద్
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్	న్యూఢిల్లీ
ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్	లఖ్‌నవూ
వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా	చంద్రవాని (ఉత్తర ప్రదేశ్)
నేషనల్ ఇండస్ట్రియల్ అకాడమీ	హైదరాబాద్
నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్	పాటియాలా (పంజాబ్)
లక్ష్మీబాయి నేషనల్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్	గ్వాలియర్ (మధ్యప్రదేశ్)
ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా	పుణె
సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ	హైదరాబాద్
ఇండియన్ ఇనిస్టిట్యూడ్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్	డెహ్రాడూన్
ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్టూనిస్ట్స్	బెంగళూరు
సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్స్‌టైల్ మేనేజ్‌మెంట్	కోయంబత్తూరు
రామన్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్	బెంగళూరు
సంజయ్ గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్	లఖ్‌నవూ
సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్	కోల్‌కతా
ఇండియన్ డైమండ్ ఇనిస్టిట్యూట్	సూరత్
సెంట్రల్ మెషిన్ టూల్స్ ఇనిస్టిట్యూట్	బెంగళూరు
ఇండియన్ డైమండ్ ఇనిస్టిట్యూట్	జైపూర్
నేషనల్ లేబర్ ఇనిస్టిట్యూట్	ఘజియాబాద్ (యు.పి.)
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్	న్యూఢిల్లీ
సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ టెక్నాలజీ	అమీంగన్ (అసోం)
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్	న్యూఢిల్లీ
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్	కర్నాల్
ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్	భోపాల్
కేంద్రీయ సంస్కృత సంస్థ	కోల్‌కత
వల్లభాయ్ పటేల్ చెస్ట్ ఇనిస్టిట్యూట్	న్యూఢిల్లీ
సెంట్రల్ సైంటిఫిక్ ఇన్‌వెస్ట్‌మెంట్ ఆర్గనైజేషన్	ఢిల్లీ
బీర్బల్ సహని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పేలియోబోటనీ	లఖ్‌నవూ
షుగర్ కేన్ బ్రీడింగ్ ఇనిస్టిట్యూట్	కోయంబత్తూరు

కనిష్కుని నాణేలు ఎక్కడ లభించాయి?

చరిత్ర

1. హర్షుని వెండి నాణేల మీద వున్న బిరుదు ఏది?
2. హర్షుని గొప్పతనాన్ని సూచించే బిరుదులు ఏవి?
3. హర్షుని కాలంలో విదేశాంగమంత్రిని ఏమని పిలిచేవారు?
4. హర్షుని కాలంలో ఆర్థికమంత్రి?
5. హర్షుని వ్యక్తిగత కార్యదర్శిని ఏమని వ్యవహరించేవారు?
6. హర్షుని వద్ద లక్షమంది అశ్వికులు, 60వేల గజదళం వున్నట్లు ఎవరి రచనలు తెలుపుతున్నాయి?
7. హర్షుని సామ్రాజ్యంలో 'అధిష్టాన' అంటే?
8. హర్షునికాలంలో అడవుల రక్షణకు నియమించిన అధికారి?
9. హర్షునికాలంలో గొప్ప శైవక్షేత్రాలు ఏవి?
10. హర్షునిలో ఉదాత్తలక్షణంగా చెప్పబడినదేది?
11. కుషానుల కాలంలో పసిపిల్లలను పెంచేందుకు ప్రత్యేక నర్సులు వుండేవారని తెలిపే బౌద్ధ గ్రంథం?
12. కుషానులకాలంలో 'కన్యాశుల్కం' వున్నట్లు తెలిపే గ్రంథం?
13. కుషానుల కాలంలో వేశ్యలు జీవించే వీధిని ఏమని పిలిచేవారు?
14. కనిష్కునికాలంలో ఏ ఏ దేశాలతో వర్తక వ్యాపారాలు సాగాయి?
15. కనిష్కుని నాణేలు ఎక్కడ లభించాయి?
16. కనిష్కుని ఓడించిన చైనా సేనాని?
17. ఒక ప్రాంతంలో స్థిరంగా వుండి దుకాణాలు నడిపేవారు?
18. వివిధ ప్రాంతాలకు వెళ్ళి ముడిసరుకులు అమ్మే వ్యాపారులు?
19. సముద్రంపై వ్యాపారం చేసేవారు?



20. కుషానుల కాలంలో బంగారం వ్యాపారం చేసే వారిని ఏమని పిలిచేవారు?


సమాధానాలు

1. హర్షదేవ, 2.పరమభట్టారక, 3.మహారాజాధిరాజ, 4. మహా సంధి విగ్రహాధికృత, 4. మహాక్షపతలాదికృత, 5. రహసిని యుక్త, 6.హుయాన్‌త్సాంగ్, 7.పురపాలక సంఘం, 8.వన పాల, 9. వారణాసి, 10. పరమత సహనం, 11. దివ్య వదన, 12. అశ్వఘోషుని బుద్ధచరిత్ర, 13. గణికవీథి, 14. రోమ్, చైనా,15. గోరక్‌పూర్, గజపూర్,16.పాన్ చాయో,17.వణికులు, 18.సార్థవాహకులు, 19. సార్థవాహ మహాసముద్ర, 20. హిరణ్యికులు

విత్తనాలు లేని ఫలాలను ఏమని పిలుస్తారు?

జీవశాస్త్రం

1. జీవశాస్త్ర పితామహుడు ఎవరు?
2. జంతు,వృక్ష లక్షణాలు గల జీవరాశులు చేర్చిన వర్గం ఏది?
3. ప్రకృతివరణ సిద్ధాంతం ప్రతిపాదించిన ఆంగ్ల జీవశాస్త్రవేత్త ఎవరు?
4. ఆచార్య బీర్‌బల్‌సహానితో సంబంధంగల వృక్షశాస్త్రశాఖ ఏది?
5. రక్తవర్గాలను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
6. విత్తనాలు లేని ఫలాలను ఏమని పిలుస్తారు?
7. మలేరియా నివారణలో ఉపయోగించు క్వినైన్ ఏ మొక్క నుండి లభ్యమవు తుంది?
8. జీవరాసులలో ఎక్కువ పరిమాణంలోఉండు మూలకం ఏది?
9. క్రిమిరహితజీవులను గురించి చర్చించు శాస్త్రం ఏది?
10. సూక్ష్మదర్శిని రిసాల్వింగ్ శక్తి అనగానేమి?
11. కాంతి తీవ్రతను కొలుచుటకు ఉపయోగించు పరికరం పేరేమిటి?



12. నాడీ ప్రచోదనాలను గుర్తించుటకు ఉపయోగించు పరికరం ఏది?
13. ఆక్సిన్‌లను గుర్తించుటకు చేయు పరీక్షలనేమంటారు?
14. రక్తంలో ఆక్సిజన్‌ను గ్రహించు పదార్థం ఏది?
15. అయోడిన్ ఎక్కువగా గల హార్మోన్ ఏది?
16. జీవపదార్థం (ప్రోటోప్లాజం) అను పదాన్ని మొదట ప్రతిపాదించిన దెవరు?
17. ఆకర్షణ పత్రాలలో ఉండు ప్లాస్టిడులను ఏమని పిలుస్తారు.
18. బఠాణి మొక్కలో ఉండు క్రోమో జోముల సంఖ్య ఎంత?
19. థైలకాయిడులను కలిగి ఉండే కణాంగాలు ఏవి?
20. పెరాక్సిడేజ్ ఏంజైములు ఉండు కణాంగాలు ఏవి?

సమాధానాలు

1. అరిస్టాటిల్, 2. ప్రోటిస్టా, 3. చార్లెస్ డార్విన్, 4. పురాజీవ శాస్త్రం, 5. కార్ల్‌లాండ్ స్టెయినర్, 6. అనిషేకఫలాలు, 7. సింకోనా అఫిసినాలిస్, 8. కార్బన్, 9. నోటో బయో టిక్స్, 10. అతి సమీప బిందువులను వేరు వేరుగా చూపకలిగే శక్తి, 11. లక్స్‌ఫోటో మీటర్, 12. అసిల్లోస్కోప్, 13. అవీనా వక్రత పరీక్ష, 14. హీమోగ్లోబిన్, 15. థైరా క్సిన్, 16. పుర్కింజె, 17. క్రోమోప్లాస్టులు, 18. 14, 19. క్లోరోప్లాస్టులు, 20. పెరాక్సీ సోములు.

విశాలాంధ్ర బిజినెస్

-429.58 ▼	-109.60 ▼	-150 ▼	బంగారం (విశాఖపట్నం) 29,090	◀◀	వెండి (విశాఖపట్నం) 41,700	డాలరు Vs
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	ప్రొద్దుటూరు	వెండి (విజయవాడ)	ప్రొద్దుటూరు	రూపాయి
33,317.20	10,249.25	29,150	29,090	39,700	41,564	64.96
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,707.10	1.21
టాటాస్టీల్	660.50	0.79
హీరో మోటార్‌కార్ప్	3,569.90	0.35
కోల్ ఇండియా	309.10	0.31

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
సన్‌ఫార్మా	531.70	-2.95
ఎస్‌బీఐ	256.50	-2.77
ఐసీఐసీఐ బ్యాంక్	295.10	-2.64
ఎం&ఎం	742.00	-2.52
బీహెచ్‌ఇఎల్	91.70	-2.27

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.11	64.96
యూరో	80.04	80.59
పౌండ్	89.92	90.33
ఆస్ట్రేలియా డాలర్	50.39	50.85
సింగపూర్ డాలర్	49.34	49.38

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,090	31,112
చెన్నై	29,090	31,112
బెంగళూరు	28,650	30,641
ముంబై	30,000	32,085
విజయవాడ	29,150	31,500
విశాఖపట్నం	29,090	31,120
ప్రొద్దుటూరు	29,090	30,540
ముడి చమురు		65.54



వరుసగా ఐదవ సెషన్‌లో...

430 పాయింట్లు మునిగిన సెన్సెక్స్

10,500 దిగువన ముగిసిన నిఫ్టీ

ముంబై: దేశీయ మార్కెట్లు వరుసగా ఐదవ సెషన్‌లో తీవ్ర నష్టాల్లో ముగిసాయి. ట్రంప్ ఉక్కు దిగుమతులపై సుంకాన్ని పెంచేనిర్ణయం, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ ఎఫ్ఐఓ) అధికారులు ప్రైవేటు రంగ బ్యాంకులైన ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్ సీఈవోలకు నోటీసులు జారీ చేయడంతో మార్కెట్ తీవ్ర ఊగిసలాటల్లో మునిగింది. దీనికి తోడు అమెరికా పన్ను విధించనుండటంతో ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. ఆ ఫలితం దేశీయ స్టాక్ మార్కెట్లపై పడింది. నేటి ఉదయం లాభాలతో మొదలైన ట్రేడింగ్ రాన్రానూ నష్టాల్లోకి జారిపోయింది. చివరి గంటలో పెట్టుబడిదారులు భారీగా విక్రయాలకు పాల్పడ్డారు. దీంతో సెన్సెక్స్ 430 పాయింట్లు నష్టపోయి 33,317కు, నిఫ్టీ 109 పాయింట్ల నష్టంతో 10249 కంటే దిగువకు జారిపోయింది. ఫలితంగా దాదాపు రూ.2లక్షలకోట్ల మేరకుమదుపరుల సంపద ఆవిరైపోయింది.



త్వరలోనే జూరిస్ట్‌ని నియమిస్తాం..

'లోక్‌పాల్'పై సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వ వివరణ

న్యూఢిల్లీ: లోక్‌పాల్ సెలక్టింగ్ కమిటీ ఈనెల 1న సమావేశమై ముందుగా ప్యానల్‌లో ఖాళీగా ఉన్న ప్రఖ్యాత న్యాయనిపుణుడి స్థానాన్ని భర్తీ చేయాలని నిర్ణయించినట్టు కేంద్రప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. న్యాయనిపుణుడ్ని సాధ్యమైనంత త్వరలో నియమించనున్నట్టు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్ భానుమతితో కూడిన ద్విసభ్య ధర్మాసనానికి అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వివరించారు. ప్యానల్‌లో ఎమినెంట్ జూరిస్ట్‌గా వ్యవహరించిన సీనియర్ అడ్వకేట్ పీపీ రావు మరణానంతరం ఈ స్థానం ఖాళీ అయింది. ఈ వ్యవహారంలో తదుపరి విచారణను ఏప్రిల్ 17కు వాయిదా పడింది. యాంటీగ్రాఫ్ట్ ఓంబుడ్స్‌మెన్ లోక్‌పాల్ నియామకానికి సంబంధించి కార్యాచరణ కొనసాగుతోందని ఫిబ్రవరి 23న సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్రం తెలిపింది. ఈ క్రమంలో తీసుకుంటున్న చర్యలు, ప్రతిపాదనలపై అఫిడవిట్‌ను దాఖలు చేయాలని డీఓపీటీ శాఖ కార్యదర్శిని న్యాయస్థానం ఆదేశించింది. గతేడాది ఏప్రిల్ 27న సుప్రీంకోర్టు ఉత్తర్వుల వెలువరించినప్పటికీ లోక్‌పాల్ నియామకం ఇప్పటివరకు జరగలేదంటూ ఎన్జీవో కామన్ కాజ్ దాఖలు చేసిన ధిక్కరణ పిటిషన్‌ను న్యాయస్థానం విచారించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 17కు వాయిదా వేస్తున్నట్టు పేర్కొంది.

గంటలో 2లక్షల కోట్లు ఉఫ్



ముంబై: సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) అధికారులు ప్రైవేటు రంగ దిగ్గజ బ్యాంకులైన ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్ సీఈవోలకు నోటీసులు జారీ చేయడంతో మార్కెట్ కంగారుపడింది. దీనికి తోడు స్టీల్ ఉత్పత్తుల దిగుమతిపై అమెరికా పన్ను విధించనుండటంతో ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. ఆ ఫలితం దేశీయ స్టాక్ మార్కెట్లపై పడింది. నేటి ఉదయం లాభాలతో మొదలైన ట్రేడింగ్ రాన్రానూ నష్టాల్లోకి జారిపోయింది. చివరి గంటలో పెట్టుబడిదారులు భారీగా విక్రయాలకు పాల్పడ్డారు. దీంతో సెన్సెక్స్ 430 పాయింట్లు నష్టపోయి 33,317కు, నిఫ్టీ 109 పాయింట్ల నష్టంతో 10249 కంటే దిగువకు జారిపోయింది. ఫలితంగా దాదాపు రూ. 2లక్షల కోట్ల మేరకు మదుపరుల సంపద ఆవిరైపోయింది. పీఎన్‌బీ స్కాంలో కీలక నిందుతుడైన మెహిల్ చౌక్సీకి చెందిన గీతాంజలి జమ్స్‌కు రూ.5,000 కోట్ల రుణం పొడిగింపుపై ఎస్ఎఫ్ఐఓ ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో చందా కొచ్చర్‌కు, యాక్సిస్ బ్యాంక్ సీఈవో శిఖా శర్మకు నోటీసీలు జారీ చేయాలని నిర్ణయించింది. దీంతో ప్రైవేటు బ్యాంక్ షేర్లను భారీగా విక్రయించారు. ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ 1.31శాతం పడిపోయింది. మరో పక్క ఎస్‌బీఐ షేర్ కూడా 3శాతం పడిపోవడంతో ఇండెక్స్ కూడా కుంగింది.

ఇంకా తగ్గని అధిక విలువలు..

స్టాక్ మార్కెట్లలో చాలా షేర్లు ఫండమెంటల్స్‌తో పోల్చుకుంటే అధిక విలువతో ట్రేడవుతున్నాయి. దీంతో అవి వాటి ఫండమెంటల్స్‌ను చేరుకునే క్రమంలో కొంత విలువను కోల్పోతున్నాయి. జీడీపీ వృద్ధిరేటు పెరిగితే ఫండమెంటల్స్‌కూడా అభివృద్ధి చెంది అధిక విలువను పొందే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ద్రవ్యలోటుపై హెచ్చరికలు..

భారత్ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉందని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ సంస్థ పేర్కొంది. క్రమంగా కుంగుతున్న ఆర్థిక వ్యవస్థ దేశానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించింది. ఇప్పటికే ప్రపంచంలో రెండో అతిపెద్ద ద్రవ్యలోటు భారత్‌దే అని పేర్కొంది. ఈ నివేదిక భారత స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది.

అమెరికా యూరోప్ మధ్య వాణిజ్య సమరం..

స్టీల్ దిగుమతులపై పన్ను విధిస్తానని ట్రంప్ పేర్కొనడంతో వాణిజ్య యుద్ధానికి తెరలేచింది. దీనికి యూరోపియన్ యూనియన్ దీటుగా స్పందించింది. తాము కూడా అమెరికా వస్తువులపై భారీగా పన్నులు విధిస్తామని.. అది యూఎస్‌ను తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని పేర్కొంది. ఈ విషయాన్ని ఈయూ పార్లమెంట్స్ ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిటీ అధ్యక్షుడు పేర్కొన్నారు. దీంతో అమెరికా నుంచి దిగుమతి అయ్యే 3.5 బిలియన్ డాలర్ల వస్తువులపై 25శాతం పన్ను విధించే అవకాశం ఉంది.

ప్రైవేటు బ్యాంకర్లకూ ఉచ్చు

ఐసీఐసీఐ బ్యాంకు ఎండీ, యాక్సిస్ బ్యాంకు ఎండీలకు సీబీఐ సమన్లు



ముంబై: పీఎన్‌బీ కుంభకోణం కేసులో? ప్రైవేట్ బ్యాంకులకూ ఉచ్చు బిగుస్తోంది. ఐసీఐసీఐ బ్యాంకు ఎండీ, సీఈవో చందా కొచ్చర్‌కు, యాక్సిస్ బ్యాంకు ఎండీ శిఖా శర్మకు సీబీఐ సమన్లు జారీచేసింది. పీఎన్‌బీలో వేల కోట్లు ఎగవేసిన నీరవ్ మోడీ, మెహుల్ చౌక్సీలకు ఏ నిబంధనల ప్రకారం రుణాలు ఇచ్చారో తెలపాలని వీరికి నోటీసులు అందినట్టు తెలిసింది. నీరవ్‌మోడీతో తమకేమీ సంబంధం లేదని, గీతాంజలి గ్రూప్‌కు మాత్రమే తాము రుణం అందించినట్టు ఐసీఐసీఐ బ్యాంకు తెలిపింది. అయితే ఎంత రుణం ఇచ్చామో ఐసీఐసీఐ బ్యాంకు వెల్లడించలేదు. యాక్సిస్ బ్యాంకు కూడా గీతాంజలి గ్రూప్‌కు భారీగా రుణం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఐదు మేజర్ బ్యాంకులకు చెందిన ఎండీలకు ఈ నోటీసులు జారీచేసినట్టు తెలిసింది. మరోవైపు గీతాంజలి గ్రూప్ బ్యాంకింగ్ ఆపరేషన్స్ వైస్-ప్రెసిడెంట్ విపుల్ చిటిలియాను సీబీఐ అధికారులు ముంబై ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకుంది. పీఎన్‌బీ స్కాంపై ఆయన్ను సీబీఐ ప్రశ్నిస్తోంది. సీబీఐ ఇప్పటి వరకు ఈ కేసులో 16 మందిని అరెస్ట్ చేసింది. చౌక్సీతో లావాదేవీలు నిర్వహించిన 73 కంపెనీలపై సీబీఐ, ఈడీ, ఎస్ఎఫ్ఐఓ దృష్టి సారించాయి. లోతుగా విచారణ జరుపుతున్నాయి.

ఏ బ్యాంకును వదల్లే?!

గీతాంజలి గ్రూప్ ప్రమోటర్ మెహుల్ చౌక్సీ జాతీయ, అంతర్జాతీయ, ప్రైవేటు బ్యాంకులనే తేడా లేకుండా? దాదాపు 31 బ్యాంకులకు టోకరా వేశాడు. సాధారణంగా ఒక బ్యాంకులో రుణం తీసుకుని చెల్లించక పోతే మరో బ్యాంకులో పరపతి పుట్టదు. కానీ చౌక్సీ మాత్రం 2010 నవంబర్ నుంచి 2014 ఏప్రిల్ వరకూ చౌక్సీ 31 బ్యాంకుల నుంచి రూ.5,280 కోట్ల మేరకు రుణం తీసుకున్నాడు. కేవలం రూ.100 కోట్ల టర్నోవరు చూపించిన చౌక్సీకి అన్ని బ్యాంకులు కళ్లుమూసుకుని మరీ వేల కోట్ల రుణం ఇచ్చాయి. సీబీఐ విచారణ ప్రకారం, అలహాబాద్ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంకు, ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనేర్ అండ్ జైపూర్, సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్, విజయబ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మారిషస్, కథోలిక్ సిరియన్ బ్యాంక్, లక్ష్మీ విలాస్ బ్యాంక్, జమ్మూ అండ్ కాశ్మీర్ బ్యాంక్, ది ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ నుంచి ఏకంగా రూ.5,280 కోట్ల మేరకు మెహుల్ చౌక్సీ రుణ దోపిడీ చేస్తుంటే? బ్యాంకులన్నీ కళ్లప్పగించాయంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు.

రుణం రూ.50కోట్లు దాటితే

పాస్‌పోర్టు వివరాలివ్వాల్సిందే

ఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణం వెలుగుచూసిన నేపథ్యంలో.. మోసగాళ్లు బ్యాంకులకు వేలకోట్ల రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోకుండా నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రూ.50 కోట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకునేవారి పాస్‌పోర్టు వివరాలను తీసుకోవాలని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశించనుంది. భారీ మొత్తంలో రుణాలు తీసుకొని మోసగాళ్లు విదేశాలకు పారిపోకుండా నిలువరించేందుకు ఇలాంటి చర్యలు ఉపయోగపడతాయని ఆ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాల్లోనే తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఈ బిల్లు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం.'బ్యాంకులు, నిఘా సంస్థలు, ఇతర ప్రభుత్వ విభాగాల మధ్య మరింత సమన్వయం తీసుకువచ్చేందుకు మేం ప్రయత్నిస్తున్నాం. ఏదైనా ఖాతాలో మోసపూరిత లావాదేవీలు ఉన్నాయని బ్యాంకు భావిస్తే ముందుగానే సంబంధిత ఏజెన్సీలకు తెలియజేయవచ్చు' అని ఆ అధికారి తెలిపారు. వివిధ విభాగాలు సమాచారం పంచుకోవడం ద్వారా మోసగాళ్లు ముందుగా దేశం విడిచి పారిపోకుండా చూడొచ్చని ఆయన తెలిపారు. ప్రముఖ వజ్రాల వ్యాపారవేత్త నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.12 వేల కోట్లకుపైగా మోసగించి.. దేశం విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే.

రెనో డస్టర్ మై 18తో రూ.లక్ష ఆదా..!



విజయవాడ : యూరోపియన్ నెంబర్ వన్ ఆటోమోటివ్ బ్రాండ్ రెనో భారత్‌లో స్థానీకరణ కారణంగా ధరలు పెరిగినందున మై డస్ట్ 18 శ్రేణి మీద సరికొత్త ఆకర్షణీయ ధరను ప్రకటించింది. దీంతో భారత్‌లో తమ వ్యాపారాన్ని మరింత మెరుగు పర్చుకునేందుకు రెనో వ్యూహాత్మక అడుగులు వేస్తోంది.

ప్రస్తుతం డస్టర్ పెట్రోలు శ్రేణి ధర రూ.7.95 లక్షలు, డీజెలు శ్రేణి ధర రూ.8.95 లక్షలతో ప్రారంభమవుతోంది. మార్చి 1 నుంచి మైడస్ట్ 18 పునర్నవీకరణతో రూ.లక్ష వరకూ ఆదా చేసుకునే అవకాశం ఉంది. రెనో ఇండియా ఆపరేషన్స్ కంట్రీ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ సుమీత్ సాహ్ని ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెనో ప్రారంభం సమయంలో 98 శాతం కేడ బ్యాఐడీపై స్థానీకరణ జరిగిందని, ఇప్పుడు తాము కొత్త డస్టర్ వినియోగదారులకు ఈ ప్రయోజనాలను అందిస్తూ, తమ డస్టర్ మీద ఆక్రామక స్థానీకరణను అమలు చేస్తున్నామన్నారు. ఈ శ్రేణులలో దీన్ని మరింత ఆకర్షణీయంగా మార్చుతామన్నారు.

సేవల రంగం ఫిబ్రవరిలో డీలా

ఆరు నెలల కనిష్టానికి బిజినెస్ సూచీ

న్యూఢిల్లీ: సేవల రంగం ఫిబ్రవరిలో మందగించింది. వృద్ధి ఆరు నెలల కనిష్టానికి నమోదైంది. నికాయ్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ జనవరిలో 51.7 ఉండగా ఫిబ్రవరిలో 47.8కి తగ్గింది. గతేడాది ఆగస్ట్ తర్వాత చూస్తే ఇంత తక్కువ స్థాయిలో వృద్ధి నమోదుకావడం ఇదే. కీలకమైన 50 మార్కును దిగిరావడం మూడు నెలల్లో ఇదే తొలిసారి. డిమాండ్ బలహీనంగా ఉండటంతో కొత్త ఆర్డర్లు రావటం తగ్గిపోయినట్టు ఈ సూచీని నిర్వహించే ఐహెచ్ఎస్ మార్కిట్ సంస్థ తెలిపింది. అయితే, రానున్న 12 నెలల కాలానికి సంస్థలు ఆశాభావంతో ఉండటం సానుకూలం. "వృద్ధి క్షీణత తాత్కాలికమేనని సంస్థలు భావిస్తున్నాయి. వృద్ధి అంచనాలకు అనుగుణంగా 2011 జూన్ నుంచి చూస్తే ఉద్యోగుల నియామకం ఎంతో వేగంగా ఉంది" అని ఐహెచ్ఎస్ మార్కిట్ ఎకనామిస్ట్ ఆష్నా దోధియా పేర్కొన్నారు. ఇక సేవలు, తయారీ రంగాలకు సంబంధించిన నికాయ్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ సైతం ఫిబ్రవరిలో 49.7కి క్షీణించింది. జనవరిలో ఇది 52.5గా ఉంది. సేవల రంగం తిరోగమనమే దీనికి ప్రధాన కారణంగా ఉంది. ముడి సరుకుల ద్రవ్యోల్బ ణం కూడా గతేడాది నవంబర్ తర్వాత పెరిగినట్టు ఈ సంస్థ తెలిపింది.

పెళ్లింట భీతావహం..!

కాల్వలో ట్రక్కు పడి 26 మంది మృతి



అహ్మదాబాద్: పెళ్లివేడుకతో కళకళలాడాల్సి ఇల్లు, దుర్ఘటనతో భీతావహంగా మారింది. గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఘోర రోడ్డుప్రమాదం జరిగి, రహ దారిపై పెళ్లి బృందంతో ట్రక్కు అదుపుతప్పి కాల్వలో బోల్తా పడింది. ఈదుర్ఘటనలో అక్కడికక్కడే 26 మంది దుర్మరణం చెందారు. పెద్ద సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు.. స్థానికుల సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ట్రక్కు లో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీస్తు న్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్నారు. చెల్లాచెదురుగా పడివున్న మృత దేహాలతో ఆ ప్రాంతమంతా ఒళ్లు గగుర్పాటుకు గురి చేస్తోంది. ట్రక్కులో దాదాపు 60 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మరికొన్ని మృతదేహాలు కాలువలో పడిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని పోలీసులు వెల్లడించారు.



ఐఓబీకి ఆర్బీఐ జరిమానా

ముంబై: 'మీ వినియోగదారును తెలుసుకోండి' (నో యువర్ కస్టమర్) నిబంధనలను పాటించకుండా తమ ఆదేశాలను ఉల్లంఘించిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుపై భారతీయ రిజర్వు బ్యాంకు కొరడా ఝుళిపించింది. రూ.2 కోట్ల జరి మానా విధించింది. సంబంధిత బ్యాంకు తమ ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం, అమలు చేయ డంలో విఫలమైన నేపథ్యంలో బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949, సెక్షన్ 47ఏ(1)(సీ) ప్రకారం జరిమానా విధించినట్టు ఓ ప్రకటనలో ఆర్బీఐ వెల్లడించింది. 2018, ఫిబ్రవరి 27నే జరిమానా విధించినట్టు తెలిసింది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు చెందిన ఓ శాఖలో ఘటన చోటు చేసుకుంది. పత్రాలు, బ్యాంకు అంతర్గత తనిఖీ నివేదికలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కేవీఐసీ నిబంధనలు అమలు చేయడంలో బ్యాంకు విఫలమైందని ఆర్బీఐ నిర్ధారించింది. చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలంటూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రాత పూర్వకంగా, మౌఖికంగా బదులివ్వడంలో విఫలమైన బ్యాంకుపై చివరికి ఆర్బీఐ జరిమానా విధించింది. కాగా సంబంధిత మోసం స్వభావం ఏమిటో ఆర్బీఐ పూర్తిగా వివరించలేదు.

విజ్ఞానం

ఆటిజం జన్యువు గుర్తింపు



ఆటిజంకు కారణమైన జన్యువును గుర్తించడం జరిగింది. భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్త న్యూరోడెవలప్‌మెంటల్ డిజార్డర్లకు కారణమైన ఆటిజం వ్యాధికి కారణమైన జన్యువును గుర్తించారు. ఈ వ్యాధిలో వీరి పరిశోధనల ప్రకారం ఒక అమైనో యాసిడ్ కైనేజ్ 2 అనే TAOK2 జన్యువు ఆటిజం డిజార్డర్‌కు కారణమని గుర్తించారు. ఆటిజం స్పెక్ట్రమ్‌లో ఉండే TAOK2 జన్యువు స్కిజోఫ్రీనియాకు సంబంధించిన ఇతర రుగ్మతలకు కారణమని తెలుస్తోంది. న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్స్ అనేవి ప్రధానంగా 'మైక్రోడిలీషన్' వలన జరుగుతుంది.ఈ మైక్రోడిలీషన్‌ను గుర్తించడంతో వైద్యులకు ఆటిజం చికిత్సకు మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది. కెనడాలోని మెక్‌మాస్టర్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న కరున్ సింగ్ మాట్లాడుతూ, వీరుచేపట్టిన అధ్యయనంలో ఎలుకలపై వీరు చేపట్టిన ప్రయోగంలో భాగంగా డిజార్డర్స్‌కు కారణమైన TAOK2 జీన్ లోపాల్ని గుర్తించారు.



బ్రేక్‌ఫాస్ట్ ఎందుకు స్కిప్ చేయకూడదంటే...

ఉదయాన్నే తీసుకునే బ్రేక్‌ఫాస్ట్ ఫస్ట్ మీల్ వంటిది. ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్‌తో శరీరంలో గ్లూకోజ్ లెవెల్స్ పెరగడంతో శక్తి సమకూరుతుంది. కనీసం 9-10 గంటల బ్రేక్ తీసుకున్న అనంతరం తినే ఆహారంలో పోషకవిలువలు కలిగిన సిరియల్స్,పాలు, నట్స్, పోహా, ఇడ్లీ, దాలియా, ఉప్మా, గుడ్లు ఇతర ప్రోటీన్ల ఆహారం శక్తికలిగిస్తాయి.

బ్రేక్‌ఫాస్ట్ చేయకపోవడంతో...

టైప్2 డయాబెటిస్ రిస్క్‌తో శరీరం బరువుపెరిగే అవకాశంఉందని తెలుస్తోంది. బ్రేక్‌ఫాస్ట్ మానివేయడంతో మరింత ఎక్కువతినే అవకాశం ఉంది.. గుండె వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. హైపర్‌టెన్షన్,బ్లడ్ షుగర్ లెవెల్స్ మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగ్నిటివ్ పనితీరు బ్రేక్‌ఫాస్ట్‌తో ముడిపడిఉంది. బ్రేక్‌ఫాస్ట్ మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తితోపాటు లాజికల్ థింకింగ్ వృద్ధి చెందుతుందని తెలుస్తోంది.




సిటీ కాలేజీలకు ఈ-వీక్ పురస్కారాలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఔత్సాహిక వ్యాపారవేత్తలను, ఐడియాలను ప్రోత్సహించేందుకు నిర్వహించే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఈవెంట్ ఈ-వీక్‌లో సిటీ కాలేజీలకు పురస్కారాలు లభించాయి. విభిన్న కేటగిరీల్లో అందించిన పురస్కారాల్లో నగరానికి చెందిన వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు ఎన్ఇఎన్ఈ-వీక్ స్టార్ అవార్డ్, ముఫఖంజా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి ఎన్ఇఎన్ ఈ-వీక్ ది లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు లభించాయి. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన మెగా ఫైనల్ ఈవెంట్‌లో పురస్కారాలు అందించినట్టు నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. మొత్తం 45 నగరాలకు చెందిన 8 వేల మంది పాల్గొన్నారు.

కాక్స్ అండ్ కింగ్స్ 260వ వార్షికోత్సవం

విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: ప్రపంచంలో అత్యంత పురాతన చరిత్ర కలిగిన ట్రావెల్ కంపెనీగా పేరొందిన కాక్స్ అండ్ కింగ్స్ 260 వార్షికోత్సవ సంబరాలను జరుపుకుంటోంది. ఈ సంస్థ హాస్పిటాలిటీ, వివిధ వ్యాపార సంస్థలను కూడా నిర్వహిస్తోంది. ఈ వార్షికోత్సవ కార్యక్రమాన్ని కేంద్ర పర్యాటక సహాయ మంత్రి కేజే అల్ఫాన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత ఘన చరిత్ర కలిగిన సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పర్యాటకరంగంలో కాక్స్ సంస్థ విశేషమైన సేవలు అందిస్తోందన్నారు.

శాంసంగ్ గెలాక్సీ ఎస్9, ఎస్9+ విడుదల



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ తమ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్స్ గెలాక్సీ ఎస్9, ఎస్9+ను మార్కెట్లోకి విడుదల చేసింది. అత్యు త్తమ కెమెరా కలిగిన ఈ ఫోన్లలో డ్యూయల్ అపె ర్చర్ లెన్స్, సూపర్ స్లో-మోషన్ సామర్థ్యం, ఎఆర్ ఎమోజీలు, స్టీరియో స్పీకర్లను డాల్బీ అట్మాస్‌తో కూడిన ఎకెజి, ఇతర విప్లవాత్మక ఫీచర్లు ఈ ఫోన్ లో ఉన్నాయి. ఈ ఫోన్‌లో మేక్ ఫర్ ఇండియా ఫీచర్లు ఎన్నో ఉన్నాయని శాంసంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్, సీఈవో హెచ్‌సీ.హాంగ్ తెలిపారు. కారియర్ అగ్రిగేషన్‌తో ఎస్9, ఎస్9+లు 2.5 రెట్లు వేగంగా డాటాను స్ట్రీమ్ చేస్తాయన్నారు. కమ్యూనికేషన్, ఎక్స్‌ప్రెషన్ అనేవి ఎక్కువగా చిత్రాలు, వీడి యోలు, ఎమోజీల ద్వారానే జరుగుతున్నాయన్నారు.

గెలాక్సీ ఎస్9 64 జీబీ ధర రూ.57,900, 256 జీబీ ధర రూ.65,900, గెలాక్సీ ఎస్9+ 64 జీబీ ధర రూ.64,900, 256 జీబీ ధర రూ.72,900. ఎయిర్‌టెల్ ఇన్ఫినిటీ పోస్ట్‌పెయిడ్ ప్లాన్‌పై డబుల్ డాటా ఆఫర్‌నూ పొందవచ్చు. ఈ ఫోన్లకు ఇప్పటికే ప్రీ ఆర్డర్లు మొదలయ్యాయి.





రబీలో సస్యరక్షణ చర్యలు కీలకం



ప్రస్తుతం వరిపైరు పిలకలు వేసే దశ నుంచి అంకురం ఏర్పడే దశ వరకు ఉంది. ఈ సమయంలో పైరును కాండం తొలుచు పురుగు, కంకినల్లి ఆశించే అవకాశం ఉంది. సకాలంలో పురుగులను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. పురుగుల వల్ల ఆర్థిక నష్ట పరిమితులు దాటినప్పుడు మాత్రమే పురుగుమందులతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మధ్య ఈనె మీద ఊదారంగు చారలు (లేదా) ఆకు తొడిమ మీద ఊదారంగు మచ్చలను కంకినల్లి ఆశించిన ప్రారంభ చిహ్నాలుగా గుర్తించి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

వరిలో కాండం తొలుచు పురుగు : నారుమడి నుంచి ఈనిన దశ వరకు వరిపైరును కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. పిలక దశలో మొవ్వ చనిపోతుంది. ఈనిన దశలో తెల్ల కంకులు వస్తాయి. నారుమడిలో చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గుడ్ల సముదాయం లేదా పిలక దశలో 5 శాతం చచ్చిన మొవ్వులు గమనించినట్లయితే నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేక ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా అక్టాన్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు క్లోరాంత్రనిలిప్రోల్ 20 ఎస్‌సీ 0.4 మిల్లీలీటర్లు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ ఎకరాకు 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కిలోలు వాడాలి.





కంకినల్లి : ఇవి కంటికి కనబడని సూక్ష్మ సాలీడు వర్గానికి చెందిన పురుగులు. ఇవి ఆశించిన ఆకులపై పసుపు వర్ణపు చారలు ఏర్పడి క్రమేపీ ఆకుతొడిమల లోపల, ఆకు ఈనెల్లో వృద్ధి చెందుతాయి. ఆకు అడుగు భాగాన ఈనెలపై, ఆకు తొడిమలపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. గింజలపై నల్లటి మచ్చలు ఏర్పడి పాలు పోసుకోక తాలుగా మారతాయి. పురుగు నష్ట లక్షణాలను గుర్తించిన గుర్తించిన వెంటనే 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ప్రొఫినోఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా డైకోఫాల్ 5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆముదం

- రబీ ఆముదంలో ఫిబ్రవరి నుంచి పెరిగే ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని 8-10 రోజుల వ్యవధిలో నీరు ఇవ్వాలి. బోదెలు, కాలువల ద్వారా నీరు ఇవ్వడం వల్ల వృథా కాకుండా ఉంటుంది. డ్రిప్పు ద్వారా మూడురోజులకోసారి నీటిని ఇవ్వాల్సి ఉంటుంది. సూక్ష్మనీటి సేద్య పద్ధతుల ద్వారా డ్రిప్పు, స్ప్రింకర్లద్వారా ఇస్తే 15-20 నుంచి 40 శాతం దిగుబడి పెరుగుతుంది. మొక్కలు పుష్పించే దశ, కాయ పూరే దశల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలి.
- **కొమ్మ, కాయతొలిచే పురుగు :** ఈ పురుగు ఉధ్రుతి పంట పుష్పించే దశ నుంచి మొదలై పంట పూర్తికాలం వరకు ఉంటుంది. తొలిదశలో పురుగు కొమ్మలు, కాయలపై ఉన్న పత్రహరితాన్ని గీకి తింటుంది. పుష్పించే దశలో కొమ్మలోకి పోవడం వల్ల కొమ్మ ఎండిపోతుంది. తర్వాత దశలో కాయలోకి చొచ్చుకుపోయి వాటిని నష్టపరుస్తుంది. దీని నివారణకు పూతదశలో ఒకసారి, 20 రోజులకు మరోసారి మోనోక్రోటోఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇండాక్సికార్బ్ మిల్లీలీటరు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **పంట కోత - నిల్వ :** ఆముదం పంట అంతా ఒకేసారి కోతకు రాదు. 3-4 సార్లు కోయవలసి వస్తుంది. విత్తిన 90-95 రోజులకు మొదటిగెల కోతకు వస్తుంది. గెలలో 80 శాతం వరకు కాయలు ముదిరి, ఆకుపచ్చ రంగు నుండి లేద పసుపు రంగు మారినప్పుడు ఆ గెలను కోసుకోవాలి. కాయలను ఎండబెట్టి వేరుశనగ నూర్పు యంత్రంతోనే జల్లెడ మార్చుకొని వాడుకోవచ్చు. గింజల్లో 9-10 శాతం తేమ ఉండేటట్లు బాగా ఎండబెట్టి గోనె సంచుల్లో నిలువ ఉంచుకోవాలి.
- **విత్తనోత్పత్తి :** పూత దశలో గెల కింది భాగంలో ఒకటి లేదా రెండు గుత్తుల మగ పుష్పాలు మాత్రమే ఉన్న మొక్క లను ఉంచి, ఎక్కువగా మగ పూత వచ్చిన మొక్కలను తీసివేయాలి. పూత దశ తరువాత కాయల లక్షణాలు ఆధారంగా భిన్నంగా ఉన్న మొక్కలను పీకివేయాలి. ఆడ, మొగ మొక్కల ద్వారా వచ్చే గెలలను వేరువేరుగా కోయాలి. ఆడ మొక్కల నుంచి వచ్చే విత్తనాలను హైబ్రిడ్ విత్తనంగా వాడుకోవాలి. మేలైన యాజమాన్యంతో ఎకరానికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల హైబ్రిడ్ విత్తనం తయారుచేసుకోవచ్చు.

మొక్కజొన్న

- కాండం కుళ్లు తెగులు పూత దశ నుంచి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- కాండంపై గోధుమరంగు చారలు ఊర్పడి పంట కోతకు రాకముందే కాండం భాగం విరిగి నేలనై పడిపోతుంది.
- పూత దశ నుంచి నీటి ఎద్దడి లేకుండా చూడాలి. ఆకుమాడు/ ఆకుఎండు తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేయాలి. పొడ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే ప్రొపికొనజోల్ మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించుకోవచ్చు.

భూసార పరిరక్షణకు

సేంద్రియ, జీవన ఎరువులే వాడాలి

- రసాయనిక ఎరువులతో క్షీణిస్తున్న భూసారం
- పెరుగుతున్న చౌడు లక్షణాలు



మొక్కలు తమకు కావాల్సిన పోషకాలను భూమినుంచి గ్రహిస్తాయని తెలియని వారు ఉండరు. అయితే భూమిలో పోషకాల లోపం నివారించేందుకు రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. సన్న, చిన్నకారు రైతులు పంటలు పండించేటప్పుడు కొన్ని పోషకాలను అధికంగా ఇవ్వడం, మరికొన్ని పోషకాలను తక్కువగా ఇవ్వడం వల్ల భూమిలో పోషక లభ్యతలో సమతుల్యత లేక పంటల ఉత్పాదకత తగ్గిపోతోంది. అలాగే పోషకాలను రసాయన ఎరువుల రూపంలో అవసరానికి మించి వాడటంతో భూభౌతిక లక్షణాలు మారిపోయి సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో భూములను ఎక్కువ కాలం సాగుకు పనికి వచ్చేలా ఉండాలంటే రైతులు రసాయన ఎరువులను తగ్గించి, సేంద్రియ, జీవన ఎరువులను వాడాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. సేంద్రియ, జీవన ఎరువుల వల్ల ఉపయోగాల గురించి వారు తెలిపిన సమాచారం ఈ విధంగా ఉంది.

కంపోస్టు ఎరువు

వ్యవసాయ వ్యర్థాలు, ఆకులు తదితర వాటిని కొంతకాలంపాటు కుళ్లించిన తరువాత ఎరువుగా వాడతారు. వానపాముల విజర్జనాలను ఎరువులుగా వాడతారు. వానపాముల విసర్జనాలను వీటి వాడకం వల్ల కూడా భూసారం పెరుగుతుంది. వానపాముల నుంచి వచ్చిన విసర్జనాలకు కంపోస్టు ఎరువులు అంటారు. దీనిని ఎకరాకు ఒకటి నుంచి ఒకటిన్నర టన్ను వరకు ఉపయోగించవచ్చు. వరిపంటకు నాటిన తరువాత, మిగతా పంటలలో దుక్కిలే వేసి కలియదున్నాలి. అలాగే పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, మేకల ఎరువు, గొర్రెల ఎరువులు వాడుకోవాలి.

రసాయన ఎరువులతో నష్టాలు

- రసాయన ఎరువులను విచక్షణారహితంగా వాడటం వల్ల - నేలలో కాలుష్యం పెరిగి సహజత్వం దెబ్బతింటుంది. నేలలోని పోషకాల సమతుల్యత దెబ్బతినడమే కాకుండా నేల ఉత్పాదక శక్తిని కోల్పోతుంది.
- చౌడు సమస్యలు ఏర్పడటంతోపాటు సూక్ష్మ పోషక లోపాలు నెలకొంటాయి.
- ఫలితంగా చీడపీడలు పంటలను ఎక్కువగా ఆశిస్తాయి. చివరకు మొక్కలు బలహీనంగా పెరిగి దిగుబడి తగ్గిపోతుంది.

సేంద్రియ ఎరువులలో పచ్చిరొట్ట ఎరువులు :

పచ్చిరొట్ల విత్తనాలను పొలంలో చల్లుకుని పంట పూత దశలలో భూమిలోనే కలియదున్నాలి. ఇలా చేయడం వల్ల 30 నుంచి 35 శాతం వరకు నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ఖరీఫ్ పంటకు ముందు వర్షాకాలంలో పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసుకోవాలి. జీలుగ, జనుము, అలసంద, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట ఎరువులు బాగా ఉపయోగపడతాయి.

సేంద్రియ ఎరువులతో ప్రయోజనాలు

- నేలలో నీటిని పట్టిఉంచే గుణం పెరుగుతుంది.
- భూసారం పెరగడంతోపాటు వివిధ పోషకాల మార్పిడి చెందే శక్తి నేలలో పెరుగుతుంది.
- మొక్కలకు చీడపీడలను తట్టుకునేశక్తి పెరుగుతుంది.
- నేలలో సూక్ష్మజీవులు వృద్ధిచెంది, సుస్థిర దిగుబడులు సాధించడానికి ఉపయోగపడతాయి.
- దిగుబడులు కూడా బాగా పెరుగుతాయి.
- నేలలో కాలుష్యం తగ్గుతుంది.

జీవన ఎరువుల్లో నత్రజనిని స్థిరీకరించేవి..

ప్రకృతిలో గల సూక్ష్మజీవులు స్వతంత్రంగాను మొక్కలతోను కలిసి జీవించేటప్పుడు జరిగే ప్రక్రియలో పంటలకు కావాల్సిన పోషకాలను వాతావరణం నుంచి గ్రహించి మొక్కలకు అందిస్తాయి. అందుకే వీటిని జీవన ఎరువులుగా గుర్తించడం జరిగింది. రైజోబియం, నీలి ఆకుపచ్చ నాచు, అజొల్లా, అజటోబాక్టర్ తదితర జీవన ఎరువులు ఉన్నాయి. ఇవి నత్రజనిని స్థిరీకరిస్తాయి.

భాస్వర జీవన ఎరువులు

సూక్ష్మజీవులు, శిలీంద్రాలు భూమిలో ఉన్న భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందుబాటులోకి తీసుకువస్తాయి. ఫాస్ఫోబాక్టీరియా, మైకోరైజా, బాసిల్లస్, సూచోమోనాస్ తదితర సూక్ష్మజీవులు, ఆస్పర్జిల్లస్, పెన్సీలియం వంటి శిలీంద్రాలు ఉన్నాయి. వీటిని ఎకరాకు ఒకటి నుంచి రెండు కిలోలను 20 కిలోల పశువుల ఎరువులో కలిపి చల్లుకోవాలి. మైకోరైజా అయితే ఎకరానికి 5 కిలోల నుంచి 6 కిలోల వరకు వాడుకోవాలి.

జీవన ఎరువుల వల్ల లాభాలు

- ఇవి మొక్కలకు ఎరువులను, పోషకాలను, వివిధ హార్మోనులను, విటమిన్‌లను, ఎంజైములను చేరుస్తాయి.
- నేలద్వారా సంక్రమించే తెగుళ్లను, చీడలను అరికడతాయి.
- 25 శాతం వరకు నత్రజని, భాస్వరం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తాయి.
- మిత్ర పురుగులకు ఎలాంటి హాని జరగదు. నేల కాలుష్యం తగ్గడంతోపాటు భూసారం పెరుగుతుంది.
- అంతేకాకుండా 20 శాతం వరకు దిగుబడులు పెరుగుతాయి.

ఏ మంత్రం వేసావెతో విజయ్ దేవరకొండ

అంచనాలను అందుకుంటాడు!



పెళ్లిచూపులు అర్జున్‌రెడ్డి చిత్రాలతో విజయ్ దేవరకొండ ప్రేక్షకుల్లో తనకంటూ ఓ ప్రత్యేక క్రేజ్‌ను సంపాదించుకున్నాడు. అతి తక్కువ వ్యవధిలోనే యూత్ ఐకాన్‌గా మారాడు .ఇక విజయ్ నటించిన తాజా చిత్రం ఏ మంత్రం వేసావెలో ఆయన పాత్ర చిత్రణ చాలా వైవిధ్యంగా వుంటుంది. కథాంశంలోని కొత్తదనం ప్రతి ఒక్కరిని మెప్పిస్తుంది అంటున్నారు నిర్మాత మల్కాపురం శివకుమార్. భద్రాద్రి సూర్య వర్సెస్ సూర్య శౌర్య, సింగం-3 వంటి చిత్రాలతో అభిరుచి గల నిర్మాతగా తెలుగు చిత్రసీమలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మల్కాపురం శివకుమార్ సమర్పిస్తున్న చిత్రం ఏ మంత్రం వేసావె. విజయ్‌దేవరకొండ కథానాయకుడు. శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందించారు. ఈ నెల 9న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

థ్రిల్లర్ అంశాల కలబోత

ఈతరం మనోభావాల్ని ప్రతిబింబించే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. థ్రిల్లర్ అంశాల కలబోతగా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతి యువకుడికి ఏదో ఒక బలహీనత ఉంటుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కంప్యూటర్ గేమ్స్ అంటే చాలా ఇష్టం. అవే సర్వస్వంగా గడుపుతుంటాడు. ఒక అమ్మాయి పరిచయం అతడి జీవిత గమనాన్ని ఎలా మార్చివేసింది? అతడు ఎలా ప్రయోజకుడయ్యాడు? అన్నదే చిత్ర ఇతివృత్తం.

విజయ్ పాత్ర చిత్రణ నవ్య పంథాలో వుంటుంది.

పెళ్లిచూపులు అర్జున్‌రెడ్డి చిత్రాలతో విజయ్ దేవరకొండ తనకంటూ ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్నారు. అనతికాలంలోనే అసంఖ్యాకమైన అభిమానుల్ని సంపాదించుకున్నాడు. ఏ మంత్రం వేసావెలో విజయ్ పాత్ర చిత్రణ నవ్య పంథాలో వుంటుంది. నేటి యువత అందరూ అతని పాత్రతో కనెక్ట్ అవుతారు. కథాంశంలోని కొత్తదనం ప్రతి ఒక్కరిని మెప్పిస్తుంది. చిత్ర ట్రైలర్స్, పాటలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. పరిశ్రమలోని ప్రముఖులు చాలా మంది సినిమా చూసి బాగుందని ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1000థియేటర్లలో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నాం.

అర్జున్‌రెడ్డితో పోల్చుకోవద్దు...

ఓ సంచలన విజయం తర్వాత వస్తున్న సినిమా కాబట్టి ప్రేక్షకుల్లో అంచనాలు వుండటం సహజం. బాహుబలి తర్వాత ప్రభాస్‌ను తిరిగి అదే స్థాయి పాత్రలో ఊహించుకోవడం సాధ్యం కాదు కదా.అర్జున్‌రెడ్డితో విజయ్ దేవరకొండ యువతలో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్నాడు. ఆ సినిమా స్థాయిలో అంచనాలు పెట్టుకోవడం భావ్యం కాదనుకుంటున్నాను.

ఏకకాలంలో మూడుచిత్రాలు..

ఇతర వ్యాపారాలతో బిజీగా వుండటం వల్ల సినిమాలకు కొంత బ్రేక్ నిచ్చాను. ప్రస్తుతం మా సంస్థలో మూడు చిత్రాలు పూర్వ నిర్మాణదశలో ఉన్నాయి. స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది. ఏప్రిల్ నుంచి షూటింగ్ మొదలుపెడతాం. ద్రోణ చిత్రాన్ని రూపొందించిన కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాను. రవిచంద్ర దర్శకత్వంలో ఓ వినూత్న కథా చిత్రాన్ని తెరకెక్కించే సన్నాహాల్లో వున్నాం. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతున్నది. వీటితో పాటు తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఓ కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాన్ని తీయబోతున్నాం. కథ సిద్ధమైంది. దీనికి కన్నడంలో మంచిపేరున్న రఘురాజ్ దర్శకత్వం వహిస్తారు. ఏకకాలంలో ఈ మూడు చిత్రాల నిర్మాణాల్ని చేపడుతాం. ఈ చిత్రాలకు హీరోలు కూడా దాదాపు ఖరారయ్యారు. వారి పేర్లు త్వరలో వెల్లడిస్తాం. ఈ సంవత్సరాంతంలో అగ్ర హీరోలతో కూడా సినిమాలు తెరకెక్కించే ప్రయత్రాలు చేస్తున్నాం. ఇక నా కెరీర్‌లో సూర్య వర్సెస్ సూర్య వ్యక్తిగతంగా నాకెంతో సంతృప్తినిచ్చింది. సృజనాత్మకత మేళవించిన ఇతివృత్తమది. ఈ సినిమాను హిందీలో అగ్ర హీరోతో రీమేక్ చేసే సన్నాహాల్లో వున్నాను. బాలీవుడ్‌లో చాలా మంది హీరోలకు ఆ సినిమా నచ్చింది. ఇతర వ్యాపారాలు ఎన్ని వున్నా సినిమారంగాన్ని నేను అమితంగా ప్రేమిస్తాను. ప్రతిభాంతులైన ఔత్సాహికుల్ని ప్రోత్సహిస్తూ సృజనాత్మక కథాంశాల్ని ప్రేక్షకులకు అందివ్వాలన్నేదే నా లక్ష్యం

విశాలాంధ్ర సినిమా

బాలీవుడ్‌లో రాఘవేంద్రుడి తనయుడు



హీరోగా సక్సెస్ కాకపోవడంతో తండ్రి బాటలోకి అడుగుపెట్టాడు.. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు తనయుడు కె.ఎస్.ప్రకాష్. తెలుగులో ప్రకాష్ చేసిన అనగనగా ఒక ధీరుడు, సైజ్ జీరో చిత్రాలు ఆశించిన మేర సక్సెస్ కాకపోవడంతో ఇప్పుడు బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నాడు. కంగనా రనౌత్, రాజ్‌కుమార్ రావులతో మెంటల్ హై క్యా అనే రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని చేస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను కూడా విడుదల చేశారు. ఈ సినిమాకు కె.ఎస్.ప్రకాష్ సతీమణి కణిక కథను అందించడం విశేషం. ఒక మహిళ మనసులోని సున్నితమైన భావోద్వేగాలకు సంబంధించిన కథే ఈ చిత్రమని నటి కంగనా తెలిపారు. ఈ చిత్రాన్ని శోభా కపూర్, ఏక్తా కపూర్, శైలేష్ సింగ్ నిర్మిస్తున్నారు.

మరో సినిమాకి ఓకే చెప్పిన వరుణ్ తేజ్



ఫిదా, తొలిప్రేమ సినిమాలతో సక్సెస్ అందుకున్న మెగా క్యాంప్ హీరో వరుణ్ తేజ్ ఇప్పుడు ఘాజీ ఫేమ్ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు. ఇది సైంటిఫిక్ థ్రిల్లర్ స్పేస్ మూవీ. ఇది కాకుండా వరుణ్ తేజ్ మరో యువ దర్శకుడితో కలిసి పనిచేయబోతున్నాడు. అతనెవరో కాదు సాగర్ చంద్ర. ఈ దర్శకుడు ఇంతకు ముందు అయ్యారే, అప్పట్లో ఒకడుండేవాడు సినిమాలను డైరెక్ట్ చేశాడు. ఈ సినిమాను 14 రీల్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ ఓకే అయ్యింది. త్వరలోనే ప్రీ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ కానుంది.

క్రిష్‌తో మరోసారి అల్లు అర్జున్



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ జాగర్ల మూడి క్రిష్ కాంబినేషన్‌లో ఇంతకు ముందే వచ్చిన వేదం సినిమా చాలా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి విదితమే. ఇప్పుడు మళ్లీ ఈ కాంబినేషన్‌లో సినిమా రానుందట. ప్రస్తుతం బన్ని వక్కంతం వంశీ దర్శకత్వంలో నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా సినిమా చేస్తున్నసంగతి తెలిసిందే. అలాగే క్రిష్ బాలీవుడ్ మూవీ మణికర్ణికతో బిజీగా ఉన్నాడు. వీరిద్దరి కమిట్‌మెంట్స్ పూర్తి కాగానే ఇద్దరూ కలిసి సినిమా చేస్తారట. ఆల్ రెడి క్రిష్ అహం బ్రహ్మాసి అనే టైటిల్‌ను రిజిస్టర్ చేయించాడు. ఈ టైటిల్ బన్ని కోసమేనని వార్తలు వస్తున్నాయి.

ఎన్టీఆర్ పాత్రలో యంగ్ హీరో

నందమూరి బాలక్రిష్ణ, తేజల కలయికలో ఎన్టీఆర్ జీవితం ఆధారంగా బయోపిక్ ను ప్లాన్ చేసిన సంగతి తెల్సిందే. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనుల్ని దాదాపు ముగించుకున్న ఈ చిత్రం మార్చి 9న అధికారికంగా లాంచ్ కానుంది. బాలక్రిష్ణ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం గురించి తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్లో చక్కర్లు కొడుతోంది. అదేమిటంటే యంగ్ హీరో శర్వానంద్ యుక్త వయసులో ఉన్న ఎన్టీఆర్ పాత్రను పోషించనున్నాడట.

అయితే ఈ వార్తపై ఇంకా చిత్ర టీమ్ నుండి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. వచ్చే ఏడాది జనవరికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం.



ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యి 'కణం' సినిమా చేశాను

ప్రీ రిలీజ్ వేడుకలో సాయిపల్లవి

'ఛలో'తో సూపర్‌హిట్ కొట్టిన నాగశౌర్య, 'ఫిదా', 'ఎంసిఎ' వంటి సూపర్‌హిట్స్ ఇచ్చిన సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కణం'. శ్యాం సి.ఎస్. సంగీత సారధ్యం వహించారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమం మార్చి 5న హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాతలు బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్, జెమిని కిరణ్, శానం నాగ అశోక్‌కుమార్, హీరోయిన్ సాయిపల్లవి, చిత్ర దర్శకుడు విజయ్, కెమెరామెన్ నిరవ్‌షా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్. ప్రేమ్, బేబి విరోనికా, పాటల రచయిత క్ృష్ణ మాదినేని, మాటల రచయిత సత్య, ప్రత్యూష తదితరులు పాల్గొనగా ఎన్.వి.ఆర్. సినిమా అధినేత ఎన్.వి. ప్రసాద్ ఫ్లవర్ బొకేలను అందించారు.

ప్రముఖ నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ 'కణం' ఆడియో సీడిలను రిలీజ్ చేసి తొలి సీడిని హీరోయిన్ సాయిపల్లవికి అందించారు. ఎన్.వి.ఆర్. సినిమా అధినేత ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ - ''కణం' సినిమాను తెలుగులో మా ఎన్.వి.ఆర్. సినిమా బ్యానర్‌పై విడుదల చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. నాగశౌర్య, సాయిపల్లవి ఇద్దరూ హ్యాట్రిక్ సక్సెస్‌లను ఈ సినిమాతో సాధించాలని కోరుకుంటున్నాను. సినిమాలో వెరోనికా అనే చిన్న పాప అద్భుతమైన పాత్రలో నటించింది. డైరెక్టర్ విజయ్‌గారు ఓ మంచి ఉద్దేశంతో ఈ సినిమాను తీశారు. ఆ ఉద్దేశం నేరవేరాలని కోరుకుంటున్నాను. సినిమాను ఇంత గ్రాండియర్‌గా 37 రోజుల్లో పూర్తి చేయడమంటే చిన్న విషయం కాదు. సినిమాలో కాస్త యాక్షన్ పార్ట్ ఉన్నప్పటికీ పక్కా ప్రణాళికతో సినిమాను 37 రోజుల్లో పూర్తి చేశారు. సినిమా నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరూ కలిసి గొప్ప సినిమాను తెరకెక్కించారు. ఇంత మంచి సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశం ఇచ్చిన లైకా సంస్థ ప్రతినిధులు సుభాష్ కరణ్, కరుణా కరణ్, రాజ మహాలింగంలకు థాంక్స్" అన్నారు. జెమిని కిరణ్ మాట్లాడుతూ - "నాగశౌర్య, సాయిపల్లవి, వెరోనికా, డైరెక్టర్ విజయ్ సహా ఎంటైర్ టీంకు ఆల్ ది బెస్ట్" అన్నారు.

బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ - "సినిమాను తెలుగులో విడుదల చేస్తున్న నా మిత్రుడు ఎన్.వి.ప్రసాద్‌కు, సినిమాలో నటించిన అందరికీ అభినందనలు" అన్నారు.

శానం నాగ అశోక్‌కుమార్ మాట్లాడుతూ - "నాగశౌర్య, సాయిపల్లవిలు మంచి సక్సెస్‌లో ఉన్నారు. వారికి ఈ సినిమా మరో పెద్ద సక్సెస్‌ను తెచ్చి పెట్టాలని కోరుకుంటున్నాను" అన్నారు.

కెమెరామెన్ నిరవ్ షా మాట్లాడుతూ - "తెలుగులో నా మూడో సినిమా ఇది. ఈ సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉంది" అన్నారు.

చిత్ర దర్శకుడు విజయ్ మాట్లాడుతూ - "మంచి సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉంటారు. కరు సినిమానే తెలుగులో కణంగా విడుదల చేస్తున్నాం. తెలుగు, తమిళంలో సినిమాను తెరకెక్కించాం. ఎన్.వి.ప్రసాద్‌గారు ఎంతో ప్యాషనేట్‌గా సినిమాను విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. 2013లో ఈ సినిమా పాయింట్ నాకు ఆలోచనలోకి వచ్చింది. మంచి టైమ్ కోసం వెయిట్ చేసి తెరకెక్కించాను. సాయిపల్లవి, వెరోనికా, నాగశౌర్యలు అద్భుతంగా నటించారు" అన్నారు. హీరోయిన్ సాయిపల్లవి మాట్లాడుతూ - ''తల్లికి, బిడ్డకు మధ్య ఉన్న అనుబంధం, తపనే ఈ సినిమా కథ. సినిమాకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయి చేశాను. సినిమాలో నటించడం వల్ల వెరోనికాతో మంచి అనుబంధం ఏర్పడింది. సినిమాను చూసిన ప్రేక్షకులకు ఆనందంగా, మంచి ఫీలింగ్‌తో ఇంటికి వెళ్లానలే ఆలోచనతో విజయ్‌గారు సినిమాను చక్కగా తెరకెక్కించారు. నాగశౌర్య బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చారు. ఫిదా, ఎంసిఎ సినిమాలను ప్రేక్షకులు ఎలాగైతే ఆదరించారో ఈ సినిమాను కూడా అలాగే ఆదరిస్తారనే నమ్మకముంది. ఇలాంటి కథను నమ్మి సినిమాను నిర్మించిన లైకా ప్రొడక్షన్స్‌కు థాంక్స్" అన్నారు. ఈ చిత్రానికి నిరవ్‌షా, శ్యామ్ సి.ఎస్., ఎల్.జయశ్రీ, స్టంట్ సిల్వ, ఆంటోని, విజయ్, సత్య, పట్టణం రషీద్, ఎం.ఆర్.రాజక ృష్ణన్, కె.మణివర్మ, రామ సుబ్బు, సప్న షా, వినయదేవ్, మోడేపల్లి రమణ, కె.భార్గవి, ప్రత్యూష, ఎస్.ఎం.రాజ్‌కుమార్, ఎస్.శివ శరవణన్, షియామ్ పనిచేస్తున్న సాంకేతికవర్గం. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎన్.ప్రేమ్, సమర్పణ: ఎన్.వి.ఆర్. సినిమా, నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, దర్శకత్వం: విజయ్.



ప్రసిద్ధ బాలీవుడ్ నటి షమ్మీ మృతి

ముంబై : షమ్మీ ఆంటీగా సుపరిచితమైన ప్రసిద్ధ బాలీవుడ్ నటి షమ్మీ (89) దీర్ఘకాల అస్వస్థతతో మంగళవారం మృతి చెందారు. ఆమె 200 పైగా సినిమాలు, టీవీ సీరియళ్లలో కామెడీ పాత్రలు నటించి మెప్పించారు. పార్సి కుటుంబంలో జన్మించిన ఆమె 'ఉస్తాద్ పెడ్రో', 'బాయీ– బెహెన్', 'దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయి', 'హాఫ్ టికెట్', 'జబ్‌జబ్ ఫూల్ ఖిలే', 'ఇతిఫఖ్', వంటి విజయవంతమైన సినిమాల్లో ఆమె నటించారు. 'దేఖ్ బాయ్ దేఖ్', 'జబామ్ సంభాల్‌కే', 'శ్రీమాన్ శ్రీమతి' వంటి హిట్ సీరియల్స్‌లో నటించారు. సినీ నిర్మాత, దర్శకుడు సుల్తాన్ అహ్మద్‌ను పెళ్లి చేసుకున్న షమ్మీ ఏడేళ్ల తర్వాత అతనికి విడాకులు ఇచ్చారు. ఎళ్లతరబడి సినీపరిశ్రమకే అంకితమైన షమ్మీ ఆంటీ మృతిపై కలత చెందుతున్నానని, అమితాబచ్చన్ ట్వీట్ చేశారు. సునీల్‌దత్, నర్గీస్‌ల కుమార్తె, కాంగ్రెస్ మాజీ ఎంపీ ప్రియాదత్ కూడా ఆమె మృతికి సంతాపం తెలుపుతూ, షమ్మీ ఆంటీ మా అమ్మకు మంచి స్నేహితురాలు, ఆమెను మేమెంతగానో ప్రేమించాము, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి ఆమె నవ్వులు స్వర్గాన్ని తాకాలి అని ఆమె ట్వీట్ చేశారు.

స్తంభించిన పార్లమెంట్

- కుదిపిన బ్యాంకింగ్‌రంగ అక్రమాలు
- ప్రధాని నోరువిప్పాలని ప్రతిపక్షాల డిమాండు
- ఉభయ సభలు నేటికి వాయిదా
- కావేరి జలనిర్వహణ బోర్డుకు ఏఐఏడీఎంకే డిమాండు
- రిజర్వేషన్లలో తెలంగాణ కోటా పెంచాలని టీఆర్ఎస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : బ్యాంకింగ్ కుంభకోణాలు పార్లమెంట్ ఉభయ సభలను మంగళవారం కూడా కుదిపివేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కావేరి జలనిర్వహణ బోర్డును తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తూ ప్రతిపక్ష సభ్యులు సభలో గందరగోళం సృష్టించడంతో ఉభయ సభలు పలుమార్లు వాయిదాపడ్డాయి. ఎన్డీయే మిత్రపక్షం శివసేన సభ్యులు లోక్‌సభలో ప్రతిపక్షాలతో పాటు వెల్ వద్దకు దూసుకువచ్చి ఆందోళనలో పాల్గొన్నారు.

ఉదయం రెండు వాయిదాల అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు రాజ్యసభ సమావేశమైన తరువాత కూడా పరిస్థితిలో ఎటువంటి మార్పులేదు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సభ్యులు సభా వెల్‌లోకి దూసుకువచ్చి నినాదాలు చేయడం ప్రారంభించారు. దానితో డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ సభను మధ్యాహ్నం 3.30 గంటల వరకు వాయిదా వేశారు. అంతకుముందు సభ తిరిగి సమావేశమైనప్పుడు టీడీపీ, ఏఐఏడీఎంకే, టీఎంసీ సభ్యులు వెల్‌లోకి దూసుకువచ్చారు. కొంత మంది సభ్యులు ప్లకార్డులను చేబూనారు. ఒకదాని తరువాత ఒకటి వింటానని కురియన సభ్యులకు హామీ ఇచ్చారు. అయితే, సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. "ఏ అంశంపైనైనా చర్చకు అనుమతించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని కురియన్ చెప్పారు. "ఇది జరగాలంటే మీరు గందరగోళం సృష్టించడాన్ని ఆపాలి" అని అన్నారు. ప్లకార్డులను ప్రదర్శించడం నిబంధనలకు వ్యతిరేకమని అన్నారు. "మీరు అలా చేయడం తగదు. సభ్యులు హుందాతనంగా ఉండాలి...ఇలా జరుగుతుందని సభ్యుల నుంచి ఆశించకూడదు" అని చెప్పారు. "చర్చలు, సంప్రదింపులు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పద్ధతిలో సాగాలి. మీ డిమాండ్లకు స్పందించమని ప్రభుత్వాన్ని నేను కోరుతాను" అని కురియన్ తెలిపారు. అయినప్పటికీ సభ్యులు సంతృప్తి చెందక ఆందోళన కొనసాగిస్తుండడంతో సభను మధ్యాహ్నం 3.30 గంటల వరకు వాయిదావేశారు. సభ తిరిగి సమావేశమైన తరువాత కూడా పరిస్థితిలో ఎటువంటి మార్పులేకపోవడంతో కురియన్ సభను బుధవారానికి వాయిదావేశారు.

చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి విజయ్ గోయెల్ ఆందోళన చేస్తున్న సభ్యులతో అన్నారు. "చర్చకు మేము



సిద్ధం. బ్యాంకింగ్ రంగంలో అక్రమాలు, ఇతర అంశాలు ఈ నాటివికావు, వీటి నుండి ప్రభుత్వం పారిపోదు" అని చెప్పారు. లోక్‌సభలో కూడా వరుసగా రెండోరోజు ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. బ్యాంకింగ్ రంగంలో అక్రమాలపై ప్రధానమంత్రి స్పందించాలని కాంగ్రెస్, తృణమూల్ సభ్యులు డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలు రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండుపై పట్టుపట్టారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీలతో పాటు శివసేన ఎంపీలు సభా వెల్ వద్దకు దూసుకువచ్చి మరాఠకు ప్రాచీన భాష హోదా కల్పించాలని డిమాండు చేశారు. కావేరి జల నిర్వహణ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐఏడీఎంకే సభ్యులు డిమాండు చేశారు. రిజర్వేషన్లలో తెలంగాణ కోటా పెంచాలని టీఆర్ఎస్ ఎంపీలు డిమాం డు చేశారు. సభలో గందరగోళ పరిస్థితులు కొన సాగుతుండగానే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ మాట్లాడుతూ, బ్యాంకింగ్ రంగంలో అక్రమాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చర్చకు సమాధానం ఇస్తారని తెలిపారు. "ఇది బడ్జెట్ సమావేశాల రెండోదశ. మనం ద్రవ్యబిల్లును, అనుబంధ పద్దులను ఆమోదించుకోవాల్సి వుంది.సభ ప్రశాంతంగా జరిగితే అప్పుడు ప్రతి ఒక్కరూ వారి సమస్యలను ప్రస్తావించవచ్చు. కాంగ్రెస్ పార్టీ ఎందుకు చిరాకుపడుతోందో నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా వుంది. కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందో నేను అర్థం చేసుకోలేకపోతున్నాను" అని సభ్యుల గందరగోళం మధ్య అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బ్యాంకింగ్ రంగంలో అక్రమాలు, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావంపైన చర్చకు ఆర్ఎస్‌పీ సభ్యులు ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్, కాంగ్రెస్ సభ్యులు కేసీ వేణుగోపాల్ నోటీసు ఇచ్చారని, ఈ రోజు చర్చించే అంశాలలో ఆ నోటీసు కూడా ఉందని తెలిపారు. "బ్యాంకింగ్ రంగంలో అక్రమాలు జరుగుతున్నాయి. యూపీఏ హయాంలోనే ఇది ప్రారంభమైంది. చర్చ జరగకుండా వారు ఎందుకు అడ్డుకుంటున్నారో అర్థం కావడంలేదు. తప్పులు చేసిన వారిని శిక్షించాలని ప్రజలు కోరుకుంటున్నారు. యూపీఏ హయాంలో జరిగిన అక్రమ కార్యకలాపాలపై కాంగ్రెస్ పార్టీ చర్చించాలి" అని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖార్గే మాట్లాడుతూ, జాతీయ బ్యాంకులలో చోటుచేసుకున్న అక్రమాల కారణంగా వేలాది కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారు విదేశాలకు వెళ్లిపోయేందుకు అనుమతిస్తున్నారని అన్నారు. "దీనిపై చర్చించడం అవసరం" అని చెప్పారు.

గాంధీ విగ్రహం వద్ద రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీల ధర్నా



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో చోటుచేసుకున్న అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని, ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నోరుమెదపాలని డిమాండు చేస్తూ పార్లమెంట్ ఆవరణలో పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ఉభయ సభల్లోనూ కార్యకలాపాలను అడ్డుకున్నారు. బ్యాంకింగ్ కుంభకోణాలపై చర్చకు వాయిదా తీర్మానాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చారు. తన హయాంలో బ్యాంకింగ్ కుంభకోణాలు ఎలా చోటుచేసుకుంటున్నాయో అనే విషయంపై ఉభయ సభల్లో మోడీ వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ సభ్యులు డిమాండు చేశారు. "మోడీ మౌనాన్ని వీడండి", వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ చేసిన బ్యాంకు లూటీ నుంచి స్వచ్ఛంగా బయటకు రండి" అని వారు కోరారు. "దేశానికి కావలివాడు ఎక్కడ? నిద్రపోతున్నాడు, నిద్రపోతున్నాడు" అని కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. 'నేను దేశానికి కావలివాడను. అవినీతిని అనుమతించబోను" అని మోడీ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. "నీరవ్ మోడీని కాపాడేందుకు" ప్రభుత్వం ప్రయత్ని స్తోందన్న విమర్శలతో ఎంపీలు ప్లకార్డులను ప్రదర్శిం చారు. కాంగ్రెస్ ఎంపీల ఆందోళనలో కొద్ది సేపటి తరువాత వామపక్షాల నాయకులు కూడా పాల్గొన్నారు. అధికారులు, పీఎంఓకి ఫిర్యాదు చేసినప్పటికీ "దోషులు తప్పించుకుపోయారు" అని వారు విమర్శించారు. పాలక బీజేపీ నాయకులు ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఈ కుంభకోణం ప్రారంభమైందని చెప్పారు.

త్రిపురలో గెలుపు భావజాల విజయం

బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోడీ



న్యూఢిల్లీ : త్రిపుర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో బీజేపీ విజయం 'భావజాల విజయం'గా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివర్ణిం చారు. ఎన్నికల విజయాల పరంపరను కొనసాగిం చేందుకు కష్టించి పనిచేయాలని అన్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన పార్లమెం టరీ పార్టీ సమావేశంలో మోడీ మాట్లాడారు. "మన విజయపరంపర కొనసాగుతోంది. ఇప్పుడు కర్ణాటక వైపు తిరిగింది" అన్న నినాదంతో మోడీ ప్రసంగం ప్రారంభమైందని పార్లమెంటరీ వ్యవహా రాల శాఖ మంత్రి అనంతకుమార్ విలేకరులతో చెప్పారు. మూడు ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, నాగాలాండ్, మేఘాలయలో బీజేపీ సాధించిన మంచి విజయాలపై ప్రధాని మాట్లాడారు. త్రిపురలో విజయంపై వచ్చిన కొన్ని విమర్శలను మోడీ ప్రస్తావించారని సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు తెలిపారు. త్రిపుర చిన్న రాష్ట్రమని, అక్కడ కేవలం రెండు లోక్‌సభా నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయని కొందరు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ బీజేపీ అక్కడ గణనీయమైన విజయం సాధించిందని ఆ విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇది జరగడానికి ముందు కేరళలో బీజేపీ ఒకే ఒక్క అసెంబ్లీ సీటును గెలుచుకున్నదని. అదే త్రిపురలో వామపక్షాల పునాధిని కదిల్చివేసిందని మోడీ అన్నారు. "త్రిపురలో గత 25 సంవత్సరాలుగా వామపక్షాలు బలీయంగా ఉన్నాయి. అక్కడ బీజేపీ విజయం భావజాల విజయం"గా మోడీని ఉటంకిస్తూ పార్టీ నాయకులు చెప్పారు. ఈ విజయాలతో మనం సరిపెట్టుకోకూడదన్నారు. కర్ణాటకలో విజయంపై మనమంతా ఇప్పుడు దృష్టి పెట్టాలని, ఎన్నికలలో విజయపరంపరను కొనసాగించేందుకు కష్టించి పనిచేయడం అవసరమని చెప్పారు.

'అయోధ్య'పై రాజీనే సరి...

ఏఐఎంపీఎల్‌బీకి రవిశంకర్ అప్పీలు

బెంగళూరు : అయోధ్య వివాదానికి సంబంధించి అటు హిందువులకు, ఇటు ముస్లింలకు నష్టం వాటిల్లకుండా కోర్టు బయట రాజీ కుదుర్చుకోవడం సబబుగా ఉంటుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆలిం డియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ)కి బహిరం గ లేఖ రాశారు. రామజన్మభూమి వివాదానికి కోర్టుకు తీసుకెళితే దేశంలో అశాంతి నెలకొంటుందని హెచ్చరించారు. 'తగు కార్యాచరణ చేపట్టాలని ఇరు వర్గాల నేతలను కోరుతున్నా. లేకపోతే మన దేశాన్ని యుద్ధం దిశగా నెట్టిన వాళ్లమవుతాం' అని రవిశంకర్ అన్నారు. రవిశంకర్ మధ్యవర్తి త్వం వహిస్తూ హిందూ, ముస్లిం వర్గీయులతో చర్చలు జరుపు తుండడం తెలిసిందే. ఆయన నాలుగు మార్గాలను సూచిం చారు. కోర్టు ఆ భూమిని ముస్లింలకు లేదా హిందు వులకు ఇచ్చేయడం; ఒక ఎకరంలో మసీదు నిర్మించుకొని మిగతా 60 ఎకరాల్లో మందిరాన్ని నిర్మించుకొనేలా అలహాబాదు హైకోర్టు ఆదేశాలు ఇవ్వడం దానిని పార్లమెంటు ఆమోదం తెలపడం జరుగుతుందన్నారు. కోర్టు లేదా ప్రభుత్వం ద్వారాగానీ వీటిలో ఏది జరిగినా దేశానికి ముఖ్యం గా ముస్లింలకు తీవ్ర పరిణామాలు తప్పబోవని రవిశంకర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో కోర్టు బయట రాజీకి రావడమే సరైనదన్నారు. ఈ విధంగా ముస్లిం సంఘాలు ముందుకొచ్చి ఆలయం కోసం ఒక ఎకరాన్ని బహూకరిస్తే,, హిందువులు పెద్ద మసీదు నిర్మాణానికి ఐదెకరాలు ఇస్తారని వివరించారు. అలా బాబ్రీ మసీదును ధ్వంసం చేసిన వారికి గానీ ఆయా సంస్థలకుగానీ భూమిని ముస్లింలు అప్పగించరని ఆయన న్నారు. ఈ భూమిని భారతీయులకు కానుకగా ఇస్తున్నామని వారు తమ మదిలో గుర్తుంచుకోవాలని సూచిం చారు. పెద్దమనిషితరహాలో పెద్దమనసుతో ఆలోచించి రాజీ కుదుర్చుకుంటే ఔదా ర్యాన్ని, ఉదారతను చాటుకున్నవారు కాగలరని రవిశంకర్ అన్నారు.

వేలంకు ఠాగూర్ సంతకం చేసిన పుస్తకం

బోస్టన్ : నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'రాజా' బెంగాలీ నాటకం 'ది కింగ్ ఆఫ్ డార్క్ చాంబర్' గా ఆంగ్లానువాదం పొందింది. ఆ పుస్తకాన్ని అమెరికా వేలం వేయనుంది. ఈ బోల్పూర్ ఎడిషన్ బుక్ పరిచయం పేజీలో సిరాకలంతో ఆయన సంతకం చేశారు. ఈ పుస్తకాన్ని 1916లో మెక్‌మిల్లాన్ కంపెనీ ప్రచురించింది. ఈ నాటకం మొత్తం కనిపించని,గూఢమైన శక్తిమంతమైన దయగల రాజును ఆవిష్కరించారు. రాజు అందమైన భార్యపై, సరిహద్దు రాజులపై ఆయనకున్న విముఖతను ఈ నాటకంలో వ్యక్తపరుస్తాడు. ఈ పుస్తకాన్ని ఆయన బుక్ డీలర్‌కు ఇచ్చినట్లు అమెరికలోని ఆర్ఆర్ వేలం సంస్థ తెలిపింది. వేలంలో ఈపుస్తకం 500 డాలర్ల వరకు పలుకుతుందని భావిస్తు న్నారు. 1913లో మొదటిసారి నోబెల్ బహుమతిని అందుకున్న భారతీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్. ఆయన రాసిన పద్యాలు 50 సంపుటిలు అచ్చయ్యాయి. బ్రిటీష ప్రభుత్వం 1915లో ఆయనను యోధు డిగా గుర్తించి 'సర్' బిరుదుతో సత్కరించింది. అయితే జలియన్ వాలాబాగ్ దురంతంతో ఆయన ఆ బిరుదును వెనక్కి ఇచ్చివేశారు.

కార్తీకి మరో 3 రోజులు సీబీఐ కస్టడీ

- 9 రోజుల కోరిన సీబీఐ
- అకౌంట్ల రద్దుకే విదేశీ పర్యటన



న్యూఢిల్లీ : సీనియర్ కాంగ్రెస్‌నేత, మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి మరో 3 రోజులపాటు కస్టడీకి పొడిగించారు. 9 రోజులు కస్టడీని పొడిగించాలని సీబీఐ కోరగా కోర్టు 3 రోజులు పొడిగించింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టయిన కార్తీని సీబీఐ మంగళవారం కోర్టులో హాజరుపరిచింది. రెండు గంటలకు అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) తుషార్ మెహతా అందుబాటులులోకి వస్తారని అప్పటివరకు వేచి ఉండాలని స్పెషల్ జడ్జి సునీల్ రాణా తెలియజేశారు. రెండు గంటలకు హాజరైన సొలిసిటర్ జనరల్ ఆయనకు మరో మూడు రోజులు కస్టడీ పొడిగించారు. ఐదు రోజుల విచారణను సీబీఐ సీల్డు కవరులో కోర్టుకు అందించింది. అతని తండ్రి చిదంబరం, తల్లి నళిని చిదంబరంలను 10 నిమిషాలు కలుసుకోవడానికి కోర్టు అనుమతించింది. సీబీఐ కస్టడీలో కార్తీ చిదంబరాన్ని ముంబైలోని బైకుల్లా జైలుకు తరలించి, ఐఎన్ఎక్స్ మీడియా మాజీ డైరెక్టర్ ఇంద్రాణీ ముఖర్జీతో కలిపి విచారణ జరిపారు. మీడియా కుట్రలను వెలుగులోకి తెచ్చేందుకు అతనిని కస్టడీకి అప్పగించాలని సీబీఐ కోరగా మార్చి 1న సీబీఐ కోర్టు కార్తీ చిదంబరాన్ని ఐదురోజుల కస్టడీకి అనుమతించింది. ఈ కుట్రలో ఎవరెవరి హస్తాలు ఉన్నాయో తెలుసుకోవాలంటే ఆయనను కస్టడీకి తీసుకోవడం తప్పదని సీబీఐ తరపు న్యాయవాది వీకే శర్మ కోర్టును కోరారు. ఫారిన్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు (ఎఫ్ఐపీబీ)కి నేతృత్వం వహించిన ఆర్బీఐ మాజీ గవర్నర్ డి.సుబ్బారావు సాక్ష్యాదారాలను కూడా వారు సేకరించనున్నారు. 2007లో చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉండగా, ఐఎన్ఎక్స్ మీడియాకు రూ. 305 కోట్ల అక్రమ విదేశీ పెట్టుబడులను తెచ్చినట్లుగా కార్తీపై ఆరోపణలు ఉన్నాయి. షీనా బోరా హత్యకేసులో దోషి అయిన ఇంద్రాణీ ముఖర్జీ కార్తీకి వ్యతిరేకంగా సాక్షమిచ్చింది. విదేశాల్లోని తన బ్యాంకు ఎకౌంట్లు రద్దు చేసుకోవం కోసమే కార్తీ చిదంబరం విదేశాలకు వెళ్లారని, ఆ సాక్ష్యాధారాలు తమవద్ద ఉన్నట్లు సీబీఐ కోర్టుకు తెలిపింది.



త్రిపుర బీజేపీ శాసనసభా పక్షనేతగా బిప్‌లాప్ కుమార్ దేబ్ ఎంపిక

అగర్తలా : త్రిపుర బీజేపీ అధ్యక్షుడు, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే బిప్‌లాప్ కుమార్ దేబ్ బీజేపీ శాసనసభా పక్షనేతగా మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించారు. సమావేశంలో ఎమ్మెల్యే సుదీప్ రాయ్ బర్మన్ ఆయన పేరు ప్రతిపాదించారు, దేబ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తామని గడ్కరీ తెలిపారు. బీజేపీ మిత్రపక్షమైన ఇండీజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) రాష్ట్రంలో గిరిజనుడే ముఖ్యమంత్రిగా నియమితులవ్వాలని కోరుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్ర పరిశీలకుడిగా గడ్కరీని పంపారు. బీజేపీ ఎమ్మెల్యే జిష్ణు దెబ్బర్మను డిప్యూటీ సీఎంగా ప్రతిపాదిస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ తథాగత రాయ్‌కు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సంఖ్య బలం ఉందని దేబ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐపీఎఫ్‌టీ ఎమ్మెల్యేలు ఎవరూ హాజరు కాలేదు. తమ వర్గానికి ప్రాధాన్యతా పదవులు ఇవ్వకపోతే ప్రభుత్వ ఏర్పాటులో పాలు పంచుకోబోమని, వెలుపల నుంచి మాత్రమే మద్దతు పలుకుతామన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఐపీఎఫ్‌టీ కలసి 43 సీట్లు గెలుచుకున్నాయి.

కారులో మంటలు-నలుగురు సజీవదహనం

చండీగఢ్ : హర్యానాలోని కర్నాల్ జిల్లాలో ట్రక్కును ఢీకొట్టిన కారులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 7నెలల చిన్నారితోపాటు నలుగురు కుటుంబసభ్యులు కారులోనే సజీవదహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున షాంఘర్ గ్రామంలో చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. మృతులు ఢిల్లీవాసులని తెలిపారు. జాతీయ రహదారిలో ఢిల్లీకి వైపుకు వెళుతున్న వారి కారు అదుపు తప్పి డివైడర్‌పై నుంచి దాటి ట్రక్కును ఢీకొన్నదని, వెంటనే కారులో నుంచి మంటలు వచ్చాయని చెప్పారు.

బీఎస్ఎఫ్, పాక్ దళాల సమావేశం

జమ్మూ : జమ్మూ, కాశ్మీర్‌లో సాంబా జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ) వద్ద బీఎస్ఎఫ్, పాక్ రేంజర్ల సమావేశం జరిగింది. సరిహద్దు వెంబడి శాంతి, భద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సోమవారం సాయంత్రం ఈ సమావేశం జరిగిందని ఐబీ అధికారులు తెలిపారు. సరిహద్దు వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారన్న అంశాన్ని బీఎస్ఎఫ్ ఈ సమావేశంలో లేవనెత్తిందని చెప్పారు. ఈ సమావేశానికి ఇరువర్గాల సైనిక అధికారులు, జవాన్లు హాజరయ్యారు.

'ఆయుష్ భారత్' ప్రారంభ ఏర్పాట్లపై మోడీ సమీక్ష

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన జాతీయ ఆరోగ్య రక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్) ఆయుష్మాన్ భారత్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రధాని నరేంద్ర మోడీ సమీక్షించారు. ఉన్నతస్థాయి అధికారులతో మోడీ, ఆరోగ్య శాఖ మంత్రి రెండు గంటలపాటు చర్చించినట్టు పీఎంఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా లబ్ధిదారుల వైద్య సహాయానికి రూ.5లక్షల నుంచి 10 కోట్ల వరకు కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోందని పేర్కొంది. పేద, బలహీన వర్గాలకు చెందిన వారికి లబ్ధి చేకూరే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేయాలని అధికారులకు మోడీ సూచించారని తెలిపింది.

'పీఎన్‌బీ' కేసులో గీతాంజలి గ్రూప్స్ వైస్ ప్రెసిడెంట్ అరెస్ట్

ముంబై : పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వేల కోట్ల రూపాయలు మోసం చేసిన కేసులో గీతాంజలి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వైస్ ప్రెసిడెంట్ విపుల్ చైతలియాను సీబీఐ మంగళవారం అరెస్టు చేసిందని అధికారులు తెలిపారు. ముంబై విమానాశ్రయంలో సీబీఐ ఆయన్ని అదుపులోకి తీసుకుని, బంద్ర-కుర్లా కాంప్లెక్స్‌లో ఈ కేసుకు సంబంధించి విచారించిందని తెలిపారు. అయితే ఈ కేసులో ఆయన పాత్రకు సంబంధించిన వివరాలేమీ అధికారులు వెల్లడించలేదు. పీఎన్‌బీలో రూ.12,636 కోట్లు భారీ కుంభకోణానికి పాల్పడిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి చోక్సీ సమీపబంధువు.

ముందురోజు పరీక్షా ప్రశ్నాపత్రాలు ఇచ్చిన ఆరుగురిపై కేసు

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లో 12వ తరగతి బోర్డు పరీక్షల్లో ఒక ప్రశ్నాపత్రంకు బదులు తర్వాతి రోజు జరగాల్సిన పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఇచ్చినందుకు పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్‌తో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేసినటుట పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే, వీరు బయోలజీ, కామర్స్ సబ్జెక్టుల మొదటి పేపర్‌కు బదులు 7వ తారీఖున ఇవ్వాల్సిన రెండవ పేపర్‌ను ముందుగానే విద్యార్థులకు ఇచ్చివేశారని చెప్పారు. దీంతో ఈ ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

జైలుకు మొబైల్ ఫోన్లను చేరవేసిన న్యాయవాది అరెస్ట్

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లో ముజఫర్‌నగర్ జిల్లా జైలులోని తన క్లయింట్‌కు మొబైల్‌ఫోన్లను చేరవేసిన న్యాయవాదిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం తన సాక్సులో మొబైల్‌ఫోన్లను దాచి న్యాయవాది జిల్లా జైలులో ఉన్న క్లయింటను కలిసేందుకు వెళ్లాడని పోలీసులు తెలిపారు. జైలు ఆవరణలో జరిగిన తనిఖీలో ఆయన సాక్సు నుంచి రెండు మొబైల్‌ఫోన్లను కనుగొన్నట్టు తెలిపారు. జైలుకు నిషేధిత వస్తువులను తీసుకెళ్లిన ఆయన్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఇద్దరు డ్రగ్ స్మగ్లర్లు అరెస్ట్

జమ్మూ : జమ్మూలోని రైసీ జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులు ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో కారులో తరలిస్తున్న కొద్దిమొత్తంలోని హెరాయిన్‌తో వారు పట్టుబడినట్టు పోలీసులు తెలిపారు. కారులో ఉన్న ఇద్దరిని అబిద్ మాలిక్, ఈశ్వర్ శర్మలుగా గుర్తించినట్టు చెప్పారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

రైఫిల్‌తో కాల్చుకుని జవాన్ ఆత్మహత్య

న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని నాసిక్‌లో పదవీ విరమణ పొందిన ఆర్మీ జవాను ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే, వద్నేర్‌గావ్ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న సంతోష్‌కుమార్ మహేశ్వర్ చౌధురి తన తండ్రి రైఫిల్‌తో తననకు తాను కాల్చుకు చనిపోయినట్టు తెలిపారు. ఆయన అయన కుటుంబ సభ్యులు ఒక పెళ్లి వేడుకకు వేరొక గ్రామం వెళ్లినప్పుడు నివాసంకు సమీపంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు.

చిన్నారిపై అఘాయిత్యం- బస్సు క్లీనర్ అరెస్ట్

కోల్‌కతా : కోల్‌కతాలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై బస్సు క్లీనర్ అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు మంగళవారం తెలిపారు. సిటీ కెనాల్‌లో నిలిపి ఉన్న లగ్జరీ బస్సులో అఘాయిత్యానికి పాల్పడ్డాడని బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 45 ఏళ్ల క్లీనర్ షేక్ మున్నాను అరెస్టు చేసినట్టు పోలీసులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆర్‌జీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. సోదరుడితో కలిసి ఆడుకుంటున్న చిన్నారిని చాక్లెట్ ఆశ చూపి క్లీనర్ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు.

పశువులకు టీకాల అంశంపై మహా అసెంబ్లీలో రగడ

ముంబై : పశువుల ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడంలో జాప్యంపై మహారాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తంచేశారు. మంగళవారం సభలో కాంగ్రెస్, ఎన్‌సీపీ సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తి పశువులకు టీకాల నిర్వహణకు కంపెనీని ఎంపిక చేయడం, టీకాల నిర్వహణ ప్రకియలో అవకతవకలపై న్యాయవిచారణ జరపాలని డిమాండు చేశారు. గత ఏడాది టీకాలపై ప్రచారం నిర్వహించలేదని తెలిపారు. అనంతరం నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

విశ్వభారతి తాత్కాలిక వీసీగా సేన్

కోల్‌కతా : విశ్వభారతి విశ్వవిద్యాలయం తాత్కాలిక వైస్‌ఛాన్సలర్‌గా సబుజ్‌కలి సేన్‌ను నియమించినట్టు హెచ్ఆర్‌డీ మంత్రిత్వశాఖ తెలిపింది. వర్సిటీకి వీసీని నియామకం చేసే వరకు తనను కొనసాగించాలని సేన్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను తాత్కాలిక వీసీగా నియమిస్తున్నట్టు హెచ్ఆర్‌డీ మంత్రిత్వ శాఖ సోమవారం లేఖను పంపినట్టు రిజిస్ట్రార్ సౌగత ఛటర్జీ మంగళవారం విలేకరులకు తెలిపారు.

పెళ్లికుమారుడి తీరుతో పెళ్లి రద్దు

రూర్కెలా : పెళ్లికుమారుడు ఇంటిసభ్యులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పెళ్లికుమార్తె పెళ్లిని రద్దు చేసుకోవడమే కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాగి ఇంటికి వచ్చి ఇలాంటి పనికి పూనుకున్నాడని ఆమె పెళ్లిదుస్తుల్లోనే వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బోందుముండా గ్రామానికి చెందిన శంకర్‌పాండ (28) అతని స్నేహితులతో కలసి తాగి పెళ్లికుమార్తె తండ్రి, సోదరులతో అసభ్యంగా ప్రవర్తించాడని దీంతో మనస్తాపం చెందిన పెళ్లికుమార్తె ఫిర్యాదు చేసిందని పోలీసులు వెల్లడించారు. పెళ్లికుమారుడు,అతని అన్నను అదుపులోకి తీసుకున్నామన్నారు. తాగి తన కుటుంబ సభ్యులతో అసమంజసంగా ప్రవర్తించిన అతనిని పెళ్లిచేసుకోబోనని పెళ్లికుమార్తె తెగేసి చెప్పింది. అయితే పెళ్లికుమారుడు మాత్రం తన ఫ్రెండ్స్ కొబ్బరి నీళ్లు, కూల్ డ్రింక్‌ల్లో ఆల్కహాలు కలిపి ఇచ్చారని దానికి తానెంతో చింతిస్తున్నానని ఆమెను పెళ్లి చేసుకుంటానని పెళ్లికుమారుడు చెప్పడం కొసమెరుపు.

నాట్యకళాపీఠంలో దూరవిద్య పరీక్షా కేంద్రం రద్దు!

విశాలాంధ్ర - కూచిపూడి : కృష్ణాజిల్లా కూచిపూడిలోని శ్రీసిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠంలో దూరవిద్య పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర నలు మూలల నుంచి ఏటా ఈ కేంద్రంలో పరీక్షలకు హాజరయ్యే 100 నుంచి 200 మంది విద్యార్థులు అయోమయంలో పడ్డారు. గత ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో ఈ కేంద్రంలో దూరవిద్యా పరీక్షల కు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. పీఎస్ తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలో కూచి పూడి, రాజమండ్రి, శ్రీశైలం, హైదరాబాద్ కేంద్రాల్లో వివిధ కోర్సులకు సంబంధించి దూరవిద్యా కేంద్రం పరీక్ష లు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నుంచి కూచిపూడి, శ్రీశైలం కేంద్రాలను రద్దు చేసి ఆంధ్రప్రదేశ్‌లో రాజమండ్రి, తెలంగాణ ప్రాంత వాసులకు హైదరా బాద్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించేలా అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

గుంటూరులో డయేరియా అలజడి

- మరో ఇద్దరు మహిళలు మృతి
- మూడుకు చేరిన మృతుల సంఖ్య
- కొంపముంచిన తాగునీటి పైపులైన్ లీకేజీ



విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : గుంటూరు నగరంలో డయేరియా విజృం భిస్తోంది. తాజాగా మంగళవారం మరో ఇద్దరు మహిళలు మృతి చెందటంతో నగరవాసుల్లో భయాందోళనలు నెలకొ న్నాయి. మృతుల సంఖ్య మూడుకు చేరింది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు వణిక పోతున్నారు. నగరంలో తాగునీరు కలుషితం కావడంతో డయేరియా విస్తరిస్తున్నట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. తాగునీటి పైపులైన్లు లీకేజీ అయినట్టు భావిస్తున్నారు. పాతగుంటూరులోని వినోభానగర్‌కు చెందిన ఎస్‌కే ఫాతిమా (55) డయేరియా బారినపడి మూడురోజుల క్రితం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆనంద్‌పేట మూడోలైన్‌కు చెందిన బీబీజాన్ (70) కూడా డయేరియా ప్రభావంతో మృతిచెందినట్లు బంధువులు చెబుతున్నారు. వరుసగా ముగ్గురు మహిళలు మృతిచెందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ కోన శశిధర్ డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని నగరవాసులకు ఆయన సూచించారు.

పెళ్ళికానుక మరిచారు

- ఆరు నెలల క్రితం ప్రకటన
- జోరందుకున్న ముహూర్తాలు
- కళ్యాణమిత్ర ఎంపికతోనే సరి



విశాలాంధ్ర - కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన పెళ్లికానుక పథకం పత్రికలకే పరిమితమైంది. పెళ్ళి ముహూర్తాలు జోరందుకున్నా ఈ పథకం జాడ కాని పరిస్థితి. చంద్రబాబు ప్రకటనతో ఆశ పడిన అర్హులకు ఎదురుచూపే మిగిలింది. పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఆసరాగా ఉంటుందంటూ ఆరు నెలల క్రితం బయటికొచ్చిన పెళ్లి కానుక పథకం నేటికీ గందరగోళంలో ఉంది. ముహూర్తాలు లేని కారణంగా పెళ్ళి కానుక పథకాన్ని తొలుత జనవరి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. ఆ తర్వాత ఫిబ్రవరి ఒకటి నుంచి అమల్లోకి తెస్తామని చెప్పినా నేటికీ విధివిధానాలు తుదిరూపం దాల్చలేదు. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి జోరందుకున్న పెళ్ళిళ్ల ముహూర్తాలు ఏప్రిల్ నెలాఖరు వరకు ఉన్నాయి. వేల జంటలు ఒక్కటికానున్నా యి. ఇప్పటికీ అధికారుల్లో స్పష్టత లేకపోవడంతో ఆరా తీస్తున్న అర్హుల కుటుంబాలకు ఏమీ చెప్పలేకపోతున్నారు. ఈ పథకం అమలు కోసం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలో ముగ్గురు చొప్పున కల్యాణమిత్రలను ఎంపిక చేశారు. వీరికి గౌరవ వేతనం లేదు. ప్రత్యేక శిక్షణ లేదు. కొత్త పథకం ప్రకటించి ఆరు నెలలవుతున్నా అమలుకు నోచుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పథకం లక్ష్యమిది..

పెళ్ళి కానుక పథకం అందుకోవాలంటే వధువుకు 18 సంవత్సరాలు, వరుడికి 21 సంవత్సరాల వయస్సు తప్పనిసరి. ఆధార్‌కార్డుతోపాటు కుల, జన్మ, ధ్రువీకరణపత్రం, బ్యాంకు ఖాతా, వివాహ రిజిస్ట్రేషన్ పత్రం ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు రూ.50 వేలు, బీసీ, మైనార్టీలకు రూ.35 వేలు, కాపులకు రూ.30 వేల చొప్పున ప్రభుత్వ సాయం అందుతుంది. ఈ మొత్తం పెళ్లికుమార్తె బ్యాంకు ఖాతాలో జమచేస్తారు.

ప్రభుత్వ ఆదేశాలు రావాలి

పెళ్లికానుక పథకం అమలు కోసం కల్యాణమిత్రలను ఎంపిక చేశాం. పథకానికి సంబంధించి పూర్తి స్థాయి విధివిధానాలు రావాల్సిఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అమలు చేస్తాం. ఈ పథకం గురించి అడిగినవారికి వివరాలు చెబుతున్నాం.

- జి. హరిప్రసాద్, ఏపీఎం, కోటబొమ్మాళి

గాడిదలపై వినూత్న నిరసన



ఏపీకి ప్రత్యేక హెూదా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ఎండగడుతూ కర్నూలు నగర మాజీ మేయర్, తెలుగుదేశం పార్టీ నాయకుడు బంగి అనంతయ్య మంగళవారం నగర వీధుల్లో వినూత్న రీతిలో ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాస్కులు ధరించిన కొందరు అనుచరులతో గాడిదలపై ఊరేగుతూ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా ఇస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు అయినా అమలుచేయకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుతో కలిసి రాష్ట్ర ప్రజలందరూ కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు.

విశాలాంధ్ర - కర్నూలు కలెక్టరేట్

ఉయ్యాలలోనే బాలుడు సజీవ దహనం



విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని కూలి పనుల కోసం పొరుగు జిల్లాకు వలస వచ్చిన ఓ కుటుంబానికి చెందిన మూడేళ్ల బాలుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఉయ్యాలలోనే సజీవ దహనమైన విషాద ఘటన పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం గ్రామంలో మంగళవారం చోటు కుంది. బిడ్డను ఉయ్యాలలో నిద్రపుచ్చి వెళ్లిన తల్లిదండ్రులు ఈ ఘోర సమాచారం తెలుసుకుని తల్లడిల్లిపోయారు. గ్రామస్తులు కన్నీరు మున్నీరు అయ్యారు. గుంటూరు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన పేడెం బాలనాగు, కృష్ణవేణి దంపతులకు ముగ్గురు సంతానం. రెండేళ్ల క్రితం ఓ పాప మెదడువాపు వ్యాధితో చనిపోయింది. కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను ఆ దంపతులు పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం గ్రామాని కి చెందిన రైతు జమ్ముల సుబ్బారావు పొగాకు పని కోసం బయ్యవరం గ్రామం నుంచి తొమ్మిది కుటుంబాలకు చెందిన 23 మంది ఒక బంటాగా ఇక్కడికి చేరుకున్నారు. 35 ఎకరాల్లోని వర్జీనియా పొగాకు ఆకు కొట్టేందుకు వచ్చిన వీరితోపాటు బాలనాగు, కృష్ణవేణి దంపతులు ఇద్దరు పిల్లలను తీసుకుని వచ్చారు. మంగళవారం పెద్దలందరూ పొగాకు పనికి వెళ్లారు. బాలనాగు కుమారుడు నాగేంద్రబాబు (3)ను వీరు నివాసం ఉంటున్న తాటాకుపాకలో ఉయ్యాలలో ఉంచి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఉయ్యాలలోని బాలుడు సజీవ దహనమయ్యాడు. కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు గ్రామ స్తులను కంటతడి పెట్టించింది. అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి మంటల ను అదుపు చేశారు. కొయ్యలగూడెం ఎస్సై సూర్య భగవాన్ ఘటనా స్థలానికి చేరుకుని తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. చిన్నారి మృత దేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అమ్మోనియా లీకైన రొయ్యల కంపెనీ సీజ్



విశాలాంధ్ర - కరప : అమ్మోనియా గ్యాస్ లీకేజీతో తరచూ కార్మికులు ప్రమాద బారిన పడుతున్న తూర్పుగోదావరి జిల్లాలోని వీరభద్ర రొయ్యల కంపెనీ యాజమాన్యంపై అధికారులు చర్యలు చేపట్టారు. కరప మండలం గురజనాపల్లి గ్రామంలోని రొయ్యల కంపెనీలో వేలాది మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. విషవాయువు అమ్మోనియా గ్యాస్ లీకై 15 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఆర్డీవో ఎల్.రఘుబాబు మంగళవారం తహశీల్దార్ బూసి శ్రీదేవితో కలిసి కంపెనీకి చేరుకున్నారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు రొయ్యల కంపెనీని సీజ్ చేస్తున్నట్టు ఆర్డీవో ప్రకటించారు. నేటి నుంచి ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించరాదని సూచించారు. కంపెనీలో కోట్ల విలువైన స్టాక్ ఉందని యాజమాన్యం ఆర్డీవో దృష్టికి తీసుకెళ్ళగా, ఇద్దరికి అనుమతి ఇస్తున్నామని, స్టాకు పూర్తి అయిన అనంతరం మూసివేయాలని ఆదేశించారు.

హైదరాబాద్ - నరసాపూర్, కాకినాడ టౌన్ ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్ -నరసాపూర్, హైదరాబాద్- కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు మంగళవారం ఇక్కడ ఒక ప్రకటన లో తెలిపారు. రైలు నంబరు 07256గా ఈ నెల తొమ్మిదో తేదీన హైదరాబాద్‌లో సాయంత్రం 6.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.00 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబరు 07255గా ఈ నెల 11వ తేదీన నరసాపూర్‌లో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయ వాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, భీమవరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతుంది. రైలు నంబరు 07075 గా ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబరు 07076గా ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6.10 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.50 గంటలకు హైదరాబాద్ చేరు కుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగు రాళ్ళ, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్ల కోట స్టేషన్‌లలో ఆగుతుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

శ్రీయుత జిల్లా కలెక్టర్ పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారి ఉత్తర్వులు

ఆర్.ఓ.సి.నెం. ఇ-932 569/2017/జి1, తేది : 02-03-2018న ఆమోదించడమైనది.

ఫారం నెం.-6(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందేహక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్‌రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువననుసరించి షెడ్యూల్ దాఖలు భూములను పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం, దొమ్మేరు గ్రామంలో ప్రజాప్రయోజనములకై అనగా గుండుగొలను నుండి కొవ్వూరు వరకు గల జాతీయ రహదారులపై ప్రయాణించే ప్రయాణికులకు అవసరమైన వసతులు కల్పించు నిమిత్తం భూమి కావలయునని కలెక్టరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించినందున 2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించి యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీ చేయడమైనది.

కలెక్టర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి రెవిన్యూ డివిజనల్ అధికారి, కొవ్వూరు మరియు భూసేకరణ అధికారి వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి రెవిన్యూ డివిజనల్ అధికారి, కొవ్వూరు మరియు భూసేకరణ అధికారి వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ 15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/అక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలో రెవిన్యూ డివిజనల్ అధికారి, కొవ్వూరు మరియు భూసేకరణ అధికారి వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

మండలం : కొవ్వూరు | **గ్రామం : దొమ్మేరు**

క్రమ సంఖ్య	సం.నెం./ స.డి. నెం.	మొత్తం విస్తీర్ణం (య.సెం.)	భూ సేకరణ క్రింద విస్తీర్ణం (య.సెం.)	సంబంధిత ఆసామీ పేరు మరియు చిరునామా	సరిహద్దులు				చెట్లు, కట్టడములు, ఇతర వివరములు
					ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	
1	594-2బి 2	0.12	0.12	గోలి అచ్యుతరామయ్య తండ్రి. వీర్రాజు	594-1బి	594-2 సి3	594-4	594-1సి	
2	594-2 సి3	0.18	0.18	గోలి అచ్యుతరామయ్య తండ్రి. వీర్రాజు	594-1 బి	594-6 సి	594-5	594-2 బి2	
3	594-4	0.64	0.64	గోలి అచ్యుతరామయ్య తండ్రి. వీర్రాజు	594-2 బి2	594-5	596	594-3	
4	594-5	0.98	0.98	గోలి వెంకట లక్ష్మి భర్త. అచ్యుతరామయ్య	594-2 సి3	594-6 సి	596	594	బోర్-1
	మొత్తం	**1.92**	**1.92**						

సం./- శ్రీ భాస్కర్ కాటంనేని, ఐ.ఎ.ఎస్.
జిల్లా కలెక్టర్,
పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టరు వారి కార్యాలయము, ఒంగోలు

ఆర్.ఓ.సి. నెం. బి/34/2018 ది. 04-03-2018

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజాహిత ఉపయోగార్థం అనగా పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ క్రింద 7 యల్ మైనర్‌లో 14 యల్ మేజర్ ఇ5 బ్లాక్ కాలువ నిర్మాణంలోని భాగముగా తర్లుపాడు మండలం, గొల్లపల్లి గ్రామములోని కాలువ పోవుచున్నందున శ్రీయుత స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలువారు భావించినందున, 2013 సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1)న నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయడమైనది.

పై పేర్కొనిన చట్టంలోని సెక్షన్ 3(ఇ) మరియు రూల్2(బి) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ) పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్, ఆర్ అండ్ ఆర్ యూనిట్, మార్కాపురం వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టములోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ) అధికారి ముందస్తు అనుమతి లేనిదే, ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైన అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించిన తేది నుండి 60 (అరువది) దినములలోగా శ్రీ స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) అధికారి వారి ఎదుట అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా : ప్రకాశం | **మండలం : తర్లుపాడు** | **గ్రామము : గొల్లపల్లి**

క్రమ సంఖ్య	స.నెం/ నెం.	పూర్తి విస్తీర్ణం ఎ.సెం.	తర గతి/ భూ స్థితి	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధిత ఆసామీ పేరు (పట్టాదారు) మరియు చిరునామా	సంబంధిత ఆసామీ పేరు (అనుభవదారు) మరియు చిరునామా	సరిహద్దులు				చెట్లు మరియు కట్టడముల వివరములు
							ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	
1	2	3	4	5	6	7	8	9	10	11	12
1	186/1	3.03	సర్కారు పుంజ	0.22	కాగెపోగు సరళ భర్త. తోటకూరి శిఖామణి	కాగెపోగు సరళ భర్త. తోటకూర శిఖామణి	237	186/2	186/3	188	బీడు
2	186/2	1.34	సర్కారు పుంజ	0.22	తాడి సావిత్రమ్మ భర్త వెంకటరెడ్డి	తాడి సావిత్రమ్మ భర్త వెంకటరెడ్డి	186/1	184	186/3	187	బీడు
3	186/3	1.82	సర్కారు పుంజ	0.21	ఇతరులు	ఇతరులు	238	184	238	186/1	బీడు
	మొత్తం విస్తీర్ణం			0.65							

సం/- ఎస్ నాగలక్ష్మి, I.A.S.
ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ) పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు, ఒంగోలు

మేఘాలయ సీఎంగా కాన్రాడ్ సంగ్మా



షిల్లాంగ్:మేఘాలయాలో బీజేపీ మిత్రపక్షమైన నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) అధ్యక్షుడు కాన్రాడ్ సంగ్మా(40) మంగళవారం ఉదయం 10.30కు ఆ రాష్ట్ర 12వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌సభ మాజీ స్పీకర్ పీఏ సంగ్మా కుమారుడైన కాన్రాడ్ సంగ్మా ఎన్‌పీపీ, భాజపా సహా నాలుగు పార్టీలు, ఓ స్వతంత్రుడితో కలిసి ఆయన సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా సంగ్మా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు.ఎన్‌పీపీ మేఘాలయలో 19 స్థానాలు గెలుచుకుంది. భాజపాకు 2 స్థానాల్లోనే విజయం సాధించినప్పటికే ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది. ఎన్‌పీపీ, బీజేపీలతో పాటు రెండు ప్రాంతీయ పార్టీలు, ఓ స్వతంత్ర సభ్యుడితో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీని దక్కించుకున్నారు. ఎన్‌పీపీ(19), యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ(6), పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్(4), భాజపా(2), ఓ స్వతంత్ర ఎమ్మెల్యే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ 21 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైంది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగ్మాకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ముందే సవాలు ఎదురైంది. రెండు స్థానాల్లో గెలిచిన హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ తొలుత సంగ్మాకు మద్దతిచ్చింది. కానీ సోమవారం మద్దతు ఉపసంహరించుకుంది. భాజపాతో పొత్తు లేకుండానే ప్రాంతీయ పార్టీలతో ప్రభుత్వం ఏర్పాటు చేయొచ్చని, కూటమి నుంచి బీజేపీని నుంచి తప్పించాలని ఆ పార్టీ డిమాండు చేసింది. అయితే అది కుదరకపోవడంతో మద్దతు ఉపసంహరించుకుంది. అయినప్పటికీ సంగ్మాకు 32 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండడంతో ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. అయితే కూటమితో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడం చాలా కష్టమైన పని అని కాన్రాడ్ సంగ్మా వెల్లడించారు.

పల్లెలకు రహదారులేవీ?

- రోడ్లతో అనుసంధానం కాని గ్రామాలు 11,907
- అన్ని గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించాలి
- అధ్వాన్నంగా తయారైన రోడ్లను మరమ్మతులు చేయాలి
- రూ. 4,234 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం
- ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేల అసహనం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో అనేక గ్రామాలు, ప్రధాన మండలాలు, జిల్లా కేంద్రాలతో అనుసంధానం కాకుండా ఉన్నాయని పలువురు ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. చాలా ప్రాంతాల్లో రహదారులు గోతుల మయంగా మారాయని, వాటికి మరమ్మత్తులను నిర్వహించాలన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా తొలిరోజైన మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఎం వేణుగోపాలరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి కె నారాయణ సమాధానం చెప్పారు. రాష్ట్రంలో 47,745 గ్రామాలున్నాయని, వీటిలో 11,907 గ్రామాలను ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. మొత్తం రూ. 4,234 కోట్ల అంచనా వ్యయంతో 5,469 కి.మీ. పొడవుతో రహదారులను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను మెరుగుపరిచేందుకు, నిర్వహణ కోసం 2017-18 సంవత్సరంలో రూ. 1,538.94 కోట్లను కేటాయించామన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ మార్గదర్శకత్వంలో ప్రభుత్వం రోడ్ల నిర్వహణ విధానాన్ని రూపొందించి అనుసరిస్తోందన్నారు.

హోంగార్డులంటే జాలి లేదా?: విష్ణుకుమార్‌రాజు

పోలీసులతో సమానంగా పనిచేసే హోంగార్డులంటే ప్రభుత్వానికి జాలి లేదా? అని బీజేపీ శాసనసభ పక్షనేత విష్ణుకుమార్‌రాజు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 15వేల మంది హోంగార్డులు రోజుకు రూ. 400 వేతనంతో కుటుంబాన్ని పోషించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంశాఖమంత్రి, డిప్యూటీ సీఎం చినరాజప్ప మాట్లాడుతూ 2016 ఏప్రిల్ 1నుంచి హోంగార్డుల డ్యూటీ అలవెన్స్‌ను రూ. 300ల నుంచి రూ. 400లకు పెంచిందన్నారు. అయితే రూ. 400 నుంచి రూ. 500 లకు పెంపుదలకు సంబంధించిన ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. వీరికి యూనిఫారం అలవెన్స్, కాలుష్య అలవెన్స్, భోజన ఖర్చులు, ప్రసూతి సెలవు, వైద్య చికిత్సను అందించే ప్రతిపాదనలేవీ ప్రభుత్వం వద్ద లేవన్నారు. దీనిపై స్పందించిన విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ మంత్రి సమాధానం సంతృప్తికరంగా లేదన్నారు. పొరుగున్న తెలంగాణ సహా అనేక రాష్ట్రాల్లో మెరుగైన వేతనాలు చెల్లిస్తుంటే ఇక్కడ మాత్రం చాలీచాలని జీతాలివ్వడం దారుణమన్నారు. రాష్ట్రంలో హోంగార్డులపై ఆధారపడిన కుటుంబ సభ్యులు 60వేలకు పైగా ఉన్నారని, వీరందరి బాగోగులను విస్మరించడం సరికాదన్నారు.

పీఎంకేవీవైలో 42,862 మందికి శిక్షణ : మంత్రి కొల్లు రవీంద్ర

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకం ద్వారా ఇప్పటి వరకూ 144 శిక్షణా కేంద్రాలలో 69 కోర్సుల్లో 42,862 మంది యువతకు శిక్షణను అందచేసినట్లు రాష్ట్ర యువజన సర్వీసులు, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పీఎంకేవీవై పథకంలో ఏయే కోర్సులు, ఏయే సంస్థల ద్వారా అందచేస్తున్నారని ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అడిగి ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఈ పథకంలో కేంద్ర ప్రాయోజిత రాష్ట్ర నిర్వహణ (సీఎస్ఎస్ఎం)లో 87 కోర్సుల్లో 16,152 మంది యువతకు నైపుణ్య శిక్షణను ఇచ్చేందుకు 147 కేంద్రాలను గుర్తించినట్లు ఆయన వివరించారు.

సాంఘిక సంక్షేమానికి రూ. 3,692.43 కోట్లు : మంత్రి నక్కా ఆనందబాబు

సాంఘిక సంక్షేమానికి 2017-18 సంవత్సరానికి రూ. 3,692.43 కోట్లను కేటాయించినట్లు మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ఈ మొత్తంలో 2,937.93 కోట్లను విడుదల చేసి దానిలో రూ. 2,491.53 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించారు.

ఈబీసీ విద్యార్థులకు రూ. 682.75 కోట్ల వ్యయం : మంత్రి కె అచ్చెన్నాయుడు

ఆర్థికంగా వెనుకబడి కులాల (ఈబీసీ) విద్యార్థుల కోసం ప్రభుత్వం 682.75 కోట్లను కేటాయించినట్లు మంత్రి కె అచ్చెన్నాయుడు అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 5 నాటికి 1.90 లక్షల మంది ఈబీసీ విద్యార్థులకు లబ్ధి చేకూర్చడం ద్వారా రూ. 664.65 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసినట్లు వివరించారు. వెనుకబడిన కులాల సంక్షేమానికి 2017-18 సంవత్సరానికి ప్రభుత్వం 5015.70 కోట్లను కేటాయించి రూ. 4844.25 కోట్లను విడుదల చేసిందని మంత్రి కె అచెన్నాయుడు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 3537.21 కోట్లను ఖర్చు చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యేలు వి గణేష్‌కుమార్, కె రవికుమార్, ఎ సత్య ప్రసాద్, ఎ రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవాలనుకునేవారు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై స్పీకర్ కోడెల శివప్రసాద్ స్పందించి రుణాల మంజూరుపై కూలంకు షంగా చర్చించి బ్యాంకులకు దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ జూన్‌లో నీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నీటికుంటలను తవ్వడం ద్వారా భారీగా భూగర్భజలాలను పెంచుకోగలిగినట్లు వివరించారు.

సమ్మె విరమణ





విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు 15 రోజులుగా చేస్తున్న సమ్మెను మంగళవారం పొద్దుపోయాక విరమించారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులతో మంగళవారం రాత్రి గుణదలలోని విద్యుత్ సౌధలో ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్ జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో బుధవారం నిర్వహించతలపెట్టిన విద్యుత్ సౌధ ముట్టడిని రద్దు చేశారు. ప్రస్తుతం సమ్మె విరమించి బుధవారం నుంచి విధులకు హాజరుకావాలని, 9వ తేదీన పూర్తిస్థాయిలో చర్చలు నిర్వహించి సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామని, ఇందుకు సంబంధించి ఏయే హామీని ఎప్పటిలోపు అమలు చేస్తామనే విషయాన్ని రాసి ఇస్తామని సీఎండీ ఇచ్చిన హామీకి జేఏసీ నేతలు అంగీకరించారు. అనంతరం గాంధీనగర్ ధర్నా చౌక్‌లోని నిరాహారదీక్ష శిబిరం వద్దకు వచ్చి చర్చల సారాంశాన్ని ట్రాన్స్‌కో జోన్ సీఈ ప్రవీణ్, జేఏసీ నేతలు కాశీ మధుబాబు, బలకాశి, 15 రోజులుగా జరిగిన పరిణామాలను ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు వివరించారు.నేరుగా వేతనాల చెల్లింపు అంశాన్ని ప్రభుత్వానికి తొమ్మిదో తేదీలోపే తెలియజేసి సానుకూల నిర్ణయం తీసుకుంటామని సీఎండీ చెప్పినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. సమ్మె నోటీసులో పేర్కొన్న ఏ ఒక్క హామీ అమలుకు అంగీకరించపోయినా మళ్లీ సమ్మెకు వెనుకాడబోమని చెప్పారు. ఆ తర్వాత మూడు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ చైర్మన్ కాశీ మధుబాబు, సెక్రటరీ జనరల్ బాలకాశి, కోశాధికారి చంద్రశేఖర్, కో-కన్వీనర్ నాగరాజు, చీఫ్ కో-ఆర్డినేటర్ జి.హారతి, సీహెచ్ సరోజతోపాటు వారికి మద్దతుగా రెండు రోజులుగా నిరవధిక దీక్షలో ఉన్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని రామారావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్‌కు ప్రవీణ్, ఇతర నాయకులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ప్రభుత్వంపై నమ్మకంతో సమ్మెను విరమిస్తున్నామని చెప్పారు. తమ పోరాటానికి మూడు రోజులు విరామం మాత్రమేనని, చర్చలు విఫలమైతే వెంటనే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని ప్రకటించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కార్మికుల క్షేమం కోసం సమ్మెకు తాత్కాలిక విరామం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడం ద్వారా ఒక మెట్టు దిగిందని చెప్పారు. తొమ్మిదో తేదీన చర్చలకు తాను కూడా వెళతానని, సానుకూల వాతావరణంలో చర్చలు జరిగి 24వేల మంది కార్మికులకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకునేలా ప్రభుత్వం, ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, శ్రామిక మహిళా ఫోరం నాయకురాలు శైలజ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మద్దతు తెలిపిన నేతలు...

నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న నాయకులకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జల్లి విల్సన్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.సుబ్బారావు, బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేవైఎం నాయకుడు రమేష్, వైసీపీ నగర అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాస్, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు రామారావు, ఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకుడు కిషోర్‌బాబు, ఎస్‌యూసీఐ నేత శ్రీధర్, సీపీఐ ఎంఎల్(లిబరేషన్) నాయకుడు ఈశ్వరన్, వైఎస్సార్ టీయూ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి, ఏపీ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకుడు శ్రీను, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసు తదితరులు కార్మికులకు సంఘీభావం తెలియజేసి ప్రసంగించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు రమణమూర్తి, సీపీఎం నాయకులు వి.ఉమామహేశ్వరరావు, దోనేపూడి కాశీనాథ్, ముజఫర్ అహ్మద్, నాగేశ్వరరావు, వందలాది మంది కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారుడు ఆర్.పిచ్చయ్య విప్లవ గీతాలను ఆలపించి కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపారు.

సంఘీభావం తెలిపిన పలు సంఘాలు...

ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎల్ఐసీ, ఆర్టీసీ ఎంప్లాయిస్ సంఘ్, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం కాంట్రాక్టు కార్మికుల దీక్షా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. వర్కింగ్ ఉమెన్స్ అసోసియేషన్, ఆటో కార్మిక సంఘాలు, హమాలీ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్లు, సెక్యూరిటీ గార్డుల అసోసియేషన్ నాయకులు ర్యాలీగా వచ్చి మద్దుతు తెలిపారు. వస్త్రలత ముఠాకార్మికులు పెద్ద సంఖ్యలో వచ్చి తమ మద్దతు ప్రకటించారు. వస్త్రలత ముఠా కార్మికుల పెద్ద మేస్త్రీ చీపిళ్ల సత్యనారాయణ దీక్షలో ఉన్నవారికి కండువాలు కప్పి సంఘీభావం తెలిపారు. ఇబ్రహీంపట్నం నుంచి పంచాయతీరాజ్ కాంట్రాక్టు ఉద్యోగులు వచ్చి మద్దతు తెలిపారు.

ముందస్తు అరెస్టులు..

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జేఏసీ బుధవారం విద్యుత్ సౌధ ముట్టడికి పిలుపునివ్వడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కార్మికులు, కార్మిక నాయకులను ముందస్తుగా పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. సమ్మె విరమణ విషయం తెలుసుకున్న అనంతరం నాయకులను విడుదల చేశారు.

ఆంధ్రుల హక్కు

(మొదటిపేజీ తరువాయి)

న్యాయం చేయాలని, కేంద్రం మోసం చేస్తే సహించేది లేదని చెబుతూ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా వామపక్షాల ధర్నాకు మద్దతు ఇచ్చారు. పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి, ఎంపీ కేవీపీ రామచంద్రరావు వామపక్షాల ధర్నాకు వెళ్లి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా డి. రాజా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్రం మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలోనూ, ఢిల్లీలోనూ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సీపీఐ ఆందోళనలు చేస్తుందన్నారు. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం చేసిన వాటికే విలువ లేకపోతే ప్రజాస్వామ్యం అనే పదానికి ఇక అర్థం ఎక్కడ ఉందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు వారు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఎలా అని ప్రశ్నించారు. విభజన చట్టంలో హామీలను కేంద్రం వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ప్రత్యేక హోదాపై హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ వాగ్దానాలను మర్చిపోయి ప్రజల్ని మోసం చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదాపై అన్ని రాజకీయ పార్టీలు ఒకేతాటిపైకి వచ్చి కేంద్రాన్ని నిలదీయాలని సూచించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏపికి ప్రత్యేక హోదా ఇచ్చే వరకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి, జనసేన నేత పవన్ కల్యాణ్ ఢిల్లీకి వచ్చి ధర్నాలు చేసి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేసే వరకు ఆందోళనలు చేయాలని సూచించారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రధానమంత్రి వద్దకు అఖిల పక్షాన్ని తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయా లని చంద్రబాబును కోరారు. గత మూడేళ్లుగా తమ పార్టీ ప్రత్యేక హోదాపై పోరాడుతుందని స్పష్టం చేశారు. సీఎం తక్షణమే అసెంబ్లీని వాయిదా వేసి ఢిల్లీకి రావాలని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పాదయాత్రను వాయిదా వేసుకుని ఢిల్లీకి వచ్చి ఆందోళన చేస్తే కేంద్రం దిగి వస్తుంద న్నారు. పి.మధు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్రం నిర్లక్షం చేస్తున్నదని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాలు, వైసీపీ నేతలు అందరూ కలిసి కట్టుగా కేంద్రంపై పోరాటం చేస్తే కేంద్రం దిగి వస్తుందని సూచించారు. ఏపికి ప్రత్యేక హోదా విషయంలో మోడీ, చంద్రబాబు ఇద్దరూ ఏపీ ప్రజల్ని మోసం చేస్తున్నారని పేర్కొన్నారు.



ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతో తమకు ఆత్మహత్యలే గతి అని పేర్కొంటూ ఆత్మహత్యల రూపంలో అనంతపురం జిల్లా రైతులు నిరసన

డీఎస్సీ ఎప్పుడో?

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణపైనే ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది.

15వేలకు పెరగనున్న ఉపాధ్యాయ పోస్టులు..!

రాష్ట్రంలోని 13జిల్లాల డీఈవోల నుంచి వచ్చిన నివేదికల అనంతరం ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు దాదాపు 15వేలకు పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

తొలుత ఏపీలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు 12,370 వరకూ వున్నాయని మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించిన విషయం విదితమే. ఇందులో మోడల్ స్కూళ్లలో దాదాపు వెయ్యి వరకూ వున్నాయి. డీఈవోల నివేదిక అనంతరం ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలపై ఒక స్పష్టత వస్తుందని అభ్యర్థులు ఆశిస్తున్నారు.

ఏపీపీఎస్సీ ద్వారా డీఎస్సీ

తొలిసారిగా డీఎస్సీ పరీక్షలను ఏపీపీఎస్సీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది.దీంతో డీఎస్సీ పరీక్షల నిర్వహణ ప్రక్రియ, ప్రశ్నల సరళి మరింత కష్టతరంగా వుంటుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీలోగా రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయాల్సి వుంది. డీఎస్సీ సిలబస్, ఖాళీల జాబితాను ఇంతవరకూ ఏపీపీఎస్సీకి ప్రభుత్వం అందజేయలేదు.

కొత్తగా స్కూలు యాజమాన్యం సిలబస్..?

డీఎస్సీలో కొత్తగా ఈ ఏడాది స్కూలు యాజమాన్యం సిలబస్‌ను ప్రవేశపెట్టే ఆలోచనలో ప్రభుత్వం వున్నట్లు తెలిసింది.విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) నిబంధనలలో భాగంగా అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థుల తల్లిదండ్రుల పర్యవేక్షణలో స్కూలు యాజమాన్య కమిటీ(ఎస్ఎం)ను నిర్వహిస్తున్నారు.

ఈ అంశంపై రాబోయే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకుగాను డీఎస్సీ సిలబస్‌లో 5 మార్కులకు జోడించాలని పలువురు విద్యావేత్తలు సూచించినట్లు తెలిసింది.దీనిపై ఇంతవరకూ ప్రభుత్వం ఆమోదముద్ర వేయలేదు. డీఎస్సీని (టెట్‌లో 20 మార్కుల వెయిటేజీ మినహాయించి) 80 మార్కులకుగాను అన్ని సబ్జెక్టులకూ నిర్వహించనున్నారు.

ఇందులో 10 మార్కులకు కరెంట్ అఫైర్స్ అండ్ జీకే, మరో 10 మార్కులకు విద్యా దృక్పథాలు, మిగిలిన 40 మార్కులకు ఆయా సబ్జెక్టుల వారీగా కంటెంటుకు ప్రశ్నలు కేటాయిస్తారు. కొత్తగా స్కూలు యాజమాన్య కమిటీ సిలబస్‌ను ప్రవేశపెడితే..అన్ని సబ్జెక్టుల కంటెంట్ విభాగం నుంచి 5 మార్కులను తగ్గించే అవకాశముంది.డీఎస్సీ నోటిఫికేషన్ అనంతరం సిలబస్ ప్రక్రియపై ఒక స్పష్టత రానుంది.

టెట్ అర్హతా అభ్యర్థుల్లో అయోమయం

టెట్ పరీక్షల్ని దిగ్విజయంగా రాసిన అభ్యర్థులకు రాబోయే డీఎస్సీ సిలబస్‌పై అయోమయం నెలకొంది.2012 డీఎస్సీ తరహాగానే సిలబస్ వుంటుందా?.కొద్దిపాటి మార్పులు కొనసాగుతాయా? అనేదీ అస్పష్టంగా వుంది. వేగవంతంగా డీఎస్సీ నోటిఫికేషన్, సిలబస్ వివరాల్ని వెల్లడించాలని అభ్యర్థులు కోరుతున్నారు.



హోదాపై మహోద్యమం

మండే కుండలు నెత్తిన పెట్టుకొని సీపీఐ వినూత్న నిరసన

విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : మండుతున్న కుండలు నెత్తిన పెట్టుకొని తిరుపతి నగరంలో మంగళవారం సాయం త్రం సీపీఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రత్యేక హోదా ఇవ్వకుంటే బీజేపీని మంటల్లో కలిపేయడం ఖాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామా నాయుడు హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రజలు బీజేపీ వైఖరిపై రగిలిపోతున్నారని, మహోద్యమానికి సిద్ధపడుతు న్నారని అన్నారు. ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి ప్రకాశం రోడ్డు మీదుగా కృష్ణాపురం ఠాణా, గాంధీరోడ్ మీదుగా నాలుగు కాళ్ల మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా రామానాయుడు మాట్లాడుతూ, ఢిల్లీలో సీపీఐ, సీపీ ఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా పోరు జరుగుతున్నదని, టీడీపీ అధినేత బీజేపీతో రాయబారం చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణం అసెంబ్లీని వాయిదా వేసి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి ప్రత్యక్ష ఉద్యమంలో భాగస్వామ్యం కావాలన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రను వాయిదా వేసుకొని పోరాటానికి కలిసికావాల న్నారు. రాష్ట్రం రావణకాష్టంలా రగులుతున్నప్పటికీ మోడీ కనీసం ప్రకటన చేయకపోవడం శోచనీయమన్నారు. మొండి వైఖరికి నిరసనగా తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామ న్నారు. టీడీపీ, బీజేపీలు రెండూ సన్నాయి నొక్కులు నొక్కుతూ నాటకాలాడుతు న్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు గుణ పాఠం తప్పదని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దించేందుకు ప్రజలు వామపక్షాలు చేపడు తున్న కార్యక్రమాలకు కలిసిరావాలని పిలుపు నిచ్చారు. ఈకార్య క్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రామ చంద్రయ్య, రైతు సంఘం అధ్యక్షుడు ఆర్. వెంకయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సహాయ కార్యదర్శి రాధాక్రిష్ణ, కార్యవర్గ సభ్యులు ఎన్.డి.రవి, నదియ, రత్నమ్మ, ఏఐ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శశి, చలపతి, దాము, ప్రజా సంఘాల నాయకులు శ్రీరాములు, తనికాచలం, రామ చంద్రయ్య, ఇబ్రహీం, రేణుక, లక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

దండకారణ్యంలో ప్రతీకారాగ్ని..!

విశాలాంధ్ర- భద్రాచలం : దండకారణ్యంలో మావోయిస్టులు ప్రతీకారంతో రగిలిపోయారు. తడపుల గుట్ట ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగా మూడు తెలంగాణ బస్సులను, నాలుగు ట్రక్కులను దహనం చేశారు. ఒక మాజీ కానిస్టేబుల్‌ను కాల్చి చంపారు. దక్షిణ బస్తర్ రేంజీ డీఐజీ పీ.సుందర్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం అర్ధరాత్రి మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న సుకుమా ? కుంట రోడ్డు మధ్య వివిధ ప్రాంతాల్లో తెలంగాణకు వెళ్తున్న మూడు బస్సులను తగులబెట్టారు. పెద్ద కుడ్తితి, పెంట గ్రామాల మధ్య ఈ మూడు బస్సులను దహనం చేశారు. జగదల్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న టీఆర్టీసీ బస్సును, దంతేవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సును, మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సును సాయుధ మావోయిస్టులు అడ్డుకున్నారు. బస్సుల్లోని ప్రయాణికులను దించివేశారు. ఆ తరువాత బస్సు డీజిల్ ట్యాంక్‌ను పగులగొట్టి, ఆయిల్‌ను బస్సులో చల్లి నిప్పంటించారు. ఇదే మార్గం గుండా వెళ్తున్న మరో ప్రైవేటు బస్సు, టిప్పరు, ఒక ట్రాక్టర్‌నూ దహనం చేశారు. ప్రయాణికులు చూస్తుండగానే సుకుమా నుంచి మణికుంట వెళ్తున్న మాజీ కానిస్టేబుల్ మున్నా సోదీని కాల్చి చంపేశారు. పోలీసు శాఖ ఇతడిని సర్వీసు నుంచి తొలగించింది. ప్రతిరోజు సుకుమా నుంచి తన స్వగ్రామం మణికుంటకు వెళ్తుంటాడని డీఐజీ తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న భద్రతా దళాలు మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రయాణికులు, బస్సు డ్రైవర్లు సమీపంలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు చేరుకున్నట్లు సమాచారం. మరో వైపు మావోయిస్టులు ఎదురుదాడి నేపథ్యంలో ఇంటలిజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్?యంలో తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌కు బయల్దేరారు. ఖమ్మం, భూపాల్‌పల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ముందస్తు సమాచారం ఇచ్చి పర్యటించాలని పోలీసు శాఖ సూచించింది.



జర్నలిస్టులకు ఇళ్లు నిర్మిస్తాం : కాల్వ శ్రీనివాస్

విశాలాంధ్ర అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాత్రికేయుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి సూచనల మేరకు గృహనిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి కాల్వ శ్రీనివాస్ వెల్లడించారు. మంగళవారం మంత్రి కాల్వ శ్రీనివాస్‌తో జర్నలిస్టు నేతలు భేటీఅయ్యారు. గృహనిర్మాణంకు సంబంధించి మంత్రులు కాలువ శ్రీనివాసులు, నారాయణ, మీడియా సలహాదారులు పరకాల ప్రభాకర్ సభ్యులుగా కమిటీ మూడూ రోజులలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏప్రల్ చివరనాటికీ ఇళ్ల నిర్మాణానికి ప్రయత్నం చేస్తామన్నారు. విలేకరుల సంక్షేమానికి బడ్జెట్ లో నిధుల కేటాయింపులు చేస్తామన్నారు. మృతి చెందిన జర్నలిస్ట్ కుటుంబానికి ఇచ్చే పెన్షన్ 1000 నుండి మూడు వేలకు పెంపుదల చేస్తామని హామీ ఇచ్చారు .సాధారణంగా మృతి చెందిన జర్నలిస్ట్ కుటుంబానికి రూ 3 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.అక్రెడిటేషన్ లు మరో ఏడాదికి రెన్యువల్ చేసి, మార్చి నెలాఖరుకు గతంలో ఉన్న నిబంధనల తోనే కొత్త అక్రిడేషన్స్‌లు మంజూరు చేస్తామన్నారు.

వైసీపీ పోరాటంలో చిత్తశుద్ధి లేదు : ఆంజనేయులు

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు మిగిలిన 18 హామీలను సాధించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ముందుకెళుతుందని శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు చెప్పారు. అసెంబ్లీ మీడియా ప్రాంగణం వద్ద మాట్లాడుతూ, రాష్ట్ర సంక్షేమం కాంక్షిస్తూ తెలుగుదేశం పార్టీ ఎంపీలు అవిశ్రాంతగా పని చేస్తున్నారని కొనియాడారు.టీడీపీ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతర పోరాటం చేస్తుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీ అయిన వైసీపీ చేస్తున్న పోరాటంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రత్యేక హోదా విషయంలో మినహా మిగిలి ఉన్న 18 హామీల విషయంలో వైసీపీ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కేసుల నుంచి తప్పించుకోవటం కోసం విభజన హామీలను అడ్డం పెట్టుకుందని ఆరోపించారు. ఢిల్లీలో వైసీపీ నాయకులు పట్టుకున్న తెలుగు ప్లకార్డులు చూస్తేనే తెలుస్తుందని వారి పోరాటంలో చిత్తశుద్ధి లేదని ఎద్దేవాచేశారు.విభజన హామీల అమలు కోసం ప్రధాని మోడీకి,ఇతర రాజకీయ పక్షాలకు లేఖలు అందించనున్నామని తెలిపారు. బీజేపి నేతలు సైతం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని వెల్లడించారు.

నాలుగేళ్లలో ఎన్నో మాటలు మార్చారు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రత్యేక హోదాపై ఆంధ్రపదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగేళ్లలో ఎన్నో మాటలు మార్చారని వైసీపీ శాసనసభ్యులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ, బీజేపీ నాయకులు కలిసి ప్రజలను అయోమయంలో పడేస్తున్నారని విమర్శించారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వైఎస్ జగన్ మొదటినుంచి ప్రత్యేక హోదా కావాలని అంటుంటే టీడీపీ, బీజేపీ నేతలు వ్యంగ్యంగా మాట్లాడారని గుర్తుచేశారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు తమ దారిలోకి వచ్చినందుకు సంతోషమని, మళ్లీ మాట మార్చకుండా హోదాకు కట్టుబ డాలని డిమాండు చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలిని ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ సోమవారం చేసిన ప్రసంగంలో రాష్ట్రంలో అంతా బాగుంద న్నట్టు పేర్కొన్నారని, విభజన హామీలు అమలు కాలేదని చెప్పారన్నారు. అయితే గతేడాది గవర్నర్ ప్రసంగంలో మాత్రం దేశంలో హోదా అనే అంశం లేదని, దానికి బదులు రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ సాధించినట్టు చెప్పారని రాజేంద్రనాథ్‌రెడ్డి గుర్తు చేశారు.

బంగారు నాణెంతో టాస్



కొలంబో: భారత్-బంగ్లాదేశ్-శ్రీలంక మధ్య ప్రారంభమైన ముక్కోణపు టీ20 సిరీస్ కోసం లంక ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 70 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో శ్రీలంక క్రికెట్ బోర్డు ఈ ముక్కోణపు సిరీస్‌ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మ్యాచ్ ప్రారంభానికి ముందు వేసే టాస్ కోసం లంక బోర్డు ప్రత్యేకంగా బంగారు నాణేన్ని తయారు చేయించింది.

ఈ విషయాన్ని బోర్డు అధ్యక్షుడు తిలంగ సుమతిపాల తెలిపారు. 'ఈ సిరీస్‌లో ఫైనల్‌తో కలిపి మొత్తం ఏడు మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రతి మ్యాచ్ ప్రారంభానికి ముందు వేసే టాస్ కోసం ప్రత్యేకంగా ఏడు నాణేలను తయారు చేయించాం. ఈ నాణెలకు బంగారం పూత వేయించాం' అని ఆయన తెలిపారు. 'టోర్నీలో భాగంగా మంగళవారం భారత్-శ్రీలంక మధ్య జరగనున్న మ్యాచ్‌కు టికెట్లన్నీ అమ్ముడుపోయాయి. అని సుమతిపాల వివరించారు.

కోల్‌కతా గౌరవం నిలబెట్టాలి : షారూఖ్



కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ నూతన సారథిగా ఎంపికైన దినేశ్ కార్తీక్‌ను ఆ జట్టు సహ యజమాని, బాలీవుడు నటుడు షారుఖ్ ఖాన్ అభినందించారు. కార్తీక్ ఎంపికను స్వాగతించాడు. ఈ మేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. 'సరికొత్త సీజన్‌లో అడుగు పెడుతున్న సందర్భంగా మా సారథిగా దినేశ్ కార్తీక్‌కు స్వాగతం పలుకుతున్నాం. గత సారథుల మాదిరిగానే మీరూ మా జట్టును గౌరవం, గుర్తింపు దిశగా నడిపిస్తారని మాకు తెలుసు' అని షారుఖ్ ట్వీట్ చేశారు. కోల్‌కతా జట్టులో సీనియర్ ఆటగాడు రాబిన్ ఉతప్ప సైతం సారథ్య రేసులో ఉన్నాడు. చివరికి దినేశ్ కార్తీక్‌ను ఆ ఫ్రాంఛైజీ సారథిగా నియమించింది. ఉతప్పను ఉపసారథిగా ఎంపిక చేసింది. 'పదేళ్లుగా కోల్‌కతా చాలా చక్కగా ఆడింది. దానికి ఘన వారసత్వం ఉంది. ఆ జట్టును నడిపిస్తున్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. మా బృందంలో యువకులు, అనుభవజ్ఞులు ఉన్నారు. కోచ్ కలిస్ నేతృత్వంలో ముందుకు పోవాలని కోరుకుంటున్నాం. కేకేఆర్‌లో మంచి విదేశీ ఆటగాళ్లున్నారు. గంభీర్ వదిలి వెళ్లిన స్థానాన్ని పూరిస్తానన్న నమ్మకం ఉంది' అని దినేశ్ కార్తీక్ అన్నాడు. ప్రస్తుతం దినేశ్ కార్తీక్ టీమిండియాలో నిలకడగా చోటు దక్కించుకుంటున్నాడు. తమిళనాడుకు చెందిన దినేశ్ దేశవాళీ క్రికెట్‌లో రాణించాడు. సారథిగా 2019-10 విజయ్ హజారే ట్రోఫీని తమిళనాడుకు అందించాడు. 2017లో ఇండియా రెడ్‌కు సారథ్యం వహించి దులీప్ ట్రోఫీ కైవసం చేసుకున్నాడు.



భారత జట్టు భద్రతపై ఆందోళన

కొలంబో : శ్రీలంకలో చోటు చేసుకున్న మత ఘర్షణల నేపథ్యంలో అక్కడ అత్యవసర పరిస్థితి ప్రకటించారు. పది రోజుల పాటు ఎమర్జెన్సీని విధిస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. కాండీ జిల్లాలో బౌద్ధులు, ముస్లింల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్న నేపథ్యంలో.. ఈ అల్లర్లు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రస్తుతం ముక్కోణపు సిరీస్‌లో భాగంగా టీమిండియా శ్రీలంకలో పర్యటిస్తోంది. ఆర్.ప్రేమదాస స్టేడియంలో జరిగే మ్యాచ్ కోసం భారత జట్టు ప్రస్తుతం కొలంబోలో ఉంది. అయితే అక్కడ అత్యవసర పరిస్థితి ప్రకటించిన నేపథ్యంలో టీమిండియా భద్రతపై బీసీసీఐ ఆందోళన వ్యక్తం చేసింది. జట్టు సభ్యులకు తగిన భద్రత కల్పించేలా చూడాలని బీసీసీఐ సీనియర్ అధికారి రాజీవ్ శుక్లా భారత ప్రభుత్వాన్ని కోరారు. అయితే ప్రస్తుతం కొలంబోలో పరిస్థితి అంతా సవ్యంగానే ఉన్నట్లు భారత జట్టుతో ఉన్న బీసీసీఐ అధికారులు తెలిపారు. మ్యాచ్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవని వెల్లడించారు. శ్రీలంకలో పది రోజుల అనంతరం పరిస్థితులను బట్టి అత్యవసర స్థితి పొడిగించాలా వద్దా అనే దానిపై అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోనున్నారు.

బౌలర్లు భేష్ : మెక్‌గ్రాత్

చెన్నై: ఆస్ట్రేలియా దిగ్గజ బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ భారత బౌలర్లపై ప్రశంసల వర్షం కురిపించారు. సౌతాఫ్రికా సిరీస్‌లో తమ అద్భుతమైన బౌలింగ్‌తో భారత పేసర్లు సఫారీలకు చుక్కలు చూపించారు. టెస్ట్ సిరీస్ ఓడినప్పటికీ.. జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ప్రతీ మ్యాచ్‌లోనూ 20 వికెట్లు తీశారు. దీనిపై మెక్‌గ్రాత్ స్పందించారు. "టెస్ట్‌ల్లో 20 వికెట్ల తీయకుంటే మ్యాచ్ గెలిచే అవకాశం లేదని అంటారు. కానీ భువనేశ్వర్, షమీ, బుమ్రా ఇంకా స్పిన్నర్లు మాత్రం అద్భుతమైన బౌలింగ్ చేశారు" అని ఆయన అన్నారు. భారత్‌కు బౌలర్ల కొరత లేదని గ్లెన్ అభిప్రాయపడ్డారు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా గొప్ప ప్రదర్శన చేశాడని ఆయన పేర్కొన్నాడు.

భారత్‌కు షాక్..!



- ఐదు వికెట్ల తేడా లంక ఘనవిజయం
- అర్ధసెంచరీతో రాణించిన కుశాల్ పెరీరా
- ధావన్ అర్ధసెంచరీ
- మరోసారి నిరాశపరిచిన కెప్టెన్ రోహిత్

కొలంబో: హీరో నిదహాస్ ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా భారత్, శ్రీలంక మధ్య మంగళవారం తొలి మ్యాచ్ జరిగింది. నిర్ణీత 20 ఓవర్లలో టీమిండియా 174 పరుగులు చేసింది. 175 పరుగుల లక్ష్యంగా బరిలోకి దిగిన లంక ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అంతకుముందు టాస్ గెలిచిన లంక భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్ శిఖర్‌ధావన్ మెరుపులు మెరిపించాడు. 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 90 పరుగులు చేశాడు. భారత్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్ ప్రారంభించారు. మొదటి ఓవర్ రెండో బంతికే కెప్టెన్ రోహిత్ శర్మ వెనుదిరిగాడు. చమీరా బౌలింగ్‌లో జీవన్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఈ మ్యాచ్‌తో రోహిత్ తన డకౌట్ల రికార్డును కొనసాగించాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన సురేష్ రైనా కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. భారీ షాట్‌కు యత్నించి ప్రదీప్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. దీంతో స్కోరు వేగం మందగించింది. క్రీజ్‌లో ఉన్న శిఖర్ ధావన్‌కు మనీష్ పాండే తోడయ్యాడు. వీరద్దరూ కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ధావన్ ధాటిగా ఆడుతూ గ్రౌండ్‌కు నలువైపులా చూడచక్కని షాట్లు కొట్టాడు. ఈ క్రమంలోనే 50 పరుగులు పూర్తి చేసుకున్నాడు. అనంతరం భారీషాట్‌కు యత్నించిన మనీష్ పాండే (37, 35 బంతులు, 3×4, 1×6) మెండీస్ బౌలింగ్‌లో గుణతిలకకు చిక్కాడు. అప్పటికి స్కోరు 104. సెంచరీకి చేరవవుతున్న ధావన్(90, 49 బంతులు, 4×6, 6×6)ను గుణతిలక బోల్తా కొట్టించాడు. బౌండరీ లైన్ వద్ద తిసారా పెరీరా అద్భుతంగా క్యాచ్ అందుకోవడంతో శిఖర్ వెనుదిరిగాడు. క్రీజ్‌లోకి వచ్చిన దినేశ్ కార్తీక్ 13 పరుగులు చేసి నాటౌట్‌గా మిగిలాడు. రిషబ్ పంత్(23, 23 బంతులు 1×4, 1×6)ను చమీర ఔట్ చేశాడు. శ్రీలంక బౌలింగ్‌లో చమీరకు 2 వికెట్లు దక్కగా, ప్రదీప్, జీవన్ మెండీస్, గుణతిలకలకు తలో వికెట్ దక్కింది.

175 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక... మొదటినుంచి ధాటిగా ఆడటం మొదలు పెట్టింది. ఓపెనర్ కుశాల్ మెండీస్ (11 పరుగులు, 6 బంతులు 2×4)లతో మంచి ఊపుమీద ఉన్న సమయంలో వాషింగ్టన్ సుందర్ మంచి బాల్‌లో బోల్తా కొట్టించాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన కుశాల్ పెరీరా ఒక్కసారిగా భారత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో వరుసగా 3 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అనంతరం గుణతిలక(19 పరుగులు, 12 బంతులు 1×4, 2×6)ను ఉనాద్కట్ పెవిలియన్‌కు పంపాడు. తరువాత వచ్చిన దినేష్ చండీమాల్‌ను చాహల్ బౌల్డ్ చేశాడు. ధాటిగా బ్యాటింగ్ చేసి భారత్ బౌలర్లను వణికించిన పెరీరాను వాషింగ్టన్ సుందర్ పెవిలియన్‌కు పంపాడు. 37 బంతులు ఆడిన పెరీరా 66 పరుగులు చేశాడు. దీన్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు ఉన్నాయి. అనంతరం ఉపుల్ తరంగను చాహల్ బౌల్డ్ చేశాడు. అప్పటికి లంక స్కోరు 136. క్రీజ్‌లో ఉన్న షనకకు తిసారి పెరీరా తోడై లక్ష్యాన్ని అవలీలగా సాధించారు. టీమిండియాలో వాషింగ్టన్ సుందర్‌కు 2, యజ్వేంద్ర చాహల్‌కు 2, ఉనాద్కట్‌కు ఒక వికెట్ దక్కాయి. లంకతో రెండో మ్యాచ్ ఈనెల 8న జరగనున్నది.

సచిన్‌కు ప్రత్యేక ఆహ్వానం



న్యూఢిల్లీ : మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు శ్రీలంక నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. శ్రీలంక ఈ ఏడాది 70 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది.. ఈ నేపథ్యంలోనే భారత్, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులతో చర్చించి నిదహాస్ ముక్కోణపు టీ20 సిరీస్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఈ సందర్భంగా శ్రీలంక క్రికెట్ బోర్డు మాస్టర్ బ్లాస్టర్ సచిన్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపింది. వేడుకల్లో పాల్గొనాలని, మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించాలని బోర్డు అధ్యక్షుడు తిలంగ సుమతిపాల సచిన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నాడు. దీనికి సచిన్ స్పందించాడు. బిజీ షెడ్యూల్ కారణంగా రాలేకపోతున్నానని తెలిపిన సచిన్ 70ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్న లంకకు, ఆ దేశ ప్రజలకు శుభా కాంక్షలు తెలిపాడు. గతంలో భారత్ నిదహాస్ ట్రోఫీలో ఆడిన సమయంలో శ్రీలంకతో జరిగిన ఫైనల్లో గంగూలీ-సచిన్ కలిసి తొలి వికెట్‌కు 252 పరుగులు చేశారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి వికెట్‌కు అత్యధిక పరుగులు సాధించిన జోడీల్లో ఈ జోడీ ఏడో స్థానంలో కొనసాగుతోంది. లంక 50ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించిన సమయంలో భారత్-శ్రీలంక-న్యూజిలాండ్ మధ్య ముక్కోణపు వన్డే సిరీస్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

బాధగా ఉంది : రూట్

ఇంగ్లండ్ : ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ఆడలేకపోవడంపై ఇంగ్లండ్ టెస్టు క్రికెట్ జట్టు సారథి జో రూట్ ఆవేదన వ్యక్తం చేశాడు. తాజాగా రూట్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఐపీఎల్‌లో ఆడకపోవడం చాలా బాధగా ఉంది. ఎందుకంటే ఒక వేళ నేను ఈ టోర్నీలో ఉండే ఎక్కువ టీ20 క్రికెట్ ఆడే అవకాశం దక్కేది. డబ్బు కోసం ఈ లీగ్ ఆడాలని నేనెప్పుడూ అనుకోలేదు. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన వేలంలో నేను అమ్ముడు పోలేదు. ఇది కొంత నిరుత్సాహానికి గురి చేసింది. పరిస్థితులను నేను అర్థం చేసుకోగలను' అని రూట్ తెలిపాడు. '2016 నుంచి ఇంగ్లండ్‌లో ఆడిన 13 టీ20ల్లో నేను కేవలం 5 మాత్రమే ఆడాను. రెండేళ్లలో టీ20 ప్రపంచకప్ జరగనుంది. వీలైనంత ఎక్కువ టీ20 క్రికెట్ ఆడి తేనే ప్రపంచకప్‌లో రాణించగలం. ఐపీఎల్ టోర్నీలో ఆడితే ఆటగాళ్లకు ఎంతో అనుభవం వస్తుంది. ఈ టోర్నీలో చోటు దక్కి ఉంటే బాగుండేది'అని రూట్ అన్నాడు. రూ.2కోట్ల కనీస ధరకు వేలానికి అందుబాటులోకి వచ్చిన రూట్‌ను దక్కించు కోవడానికి ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి కనబరచలేదు. సహచర ఆటగాడు బెన్ స్టోక్స్ గత ఏడాది, ఈ ఏడాది వేలంలో రికార్డు స్థాయిలో అమ్ముడుపోయాడు. అతన్ని గత ఏడాది రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ దక్కించుకుంటే ఈ ఏడాది రాజస్థాన్ రాయల్స్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

ప్రత్యేక ప్యాకేజీకీ మంగళం..?

- రాష్ట్రంపై నమ్మకం లేక క్షేత్రస్థాయిలో తనిఖీ
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీతి అయోగ్ బృందం పర్యటన



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మొన్నటివరకు మిత్రులుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం కత్తులు దూసుకుంటున్నాయి. దీని ప్రభావం రాష్ట్రాభివృద్ధిపై కూడా పడు తోంది. ఇటీవలే రాష్ట్రానికి కేటాయించిన నిధులను ఇచ్చినట్టే ఇచ్చి, వెనక్కు తీసుకుంది కేంద్రం. విభే దాల ఫలితంగా రాష్ట్రానికి కేటాయించిన ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు కూడా ఆగిపోయే పరిస్థితి నెల కొంది. రాష్ట్రంపై నమ్మకం కోల్పోయిన కేంద్రం, తాను కేటాయించిన నిధులను ఏవిధంగా ఖర్చు చేస్తోందో ఆరా తీస్తోంది. దీన్లో భాగంగానే ఇప్పుడు ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీతి అయోగ్ బృందం పర్యటిస్తోంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలోని మొత్తం 7 జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ(ఎస్‌డీపీ) నిధులను నాలుగేళ్ల క్రితం కేంద్రం కేటాయించింది. అది కూడా అరకొరగా. జిల్లాల అవసరాలకు తగ్గట్టుగా వందలకోట్లు అవసరం కాగా, కేవలం ఏడాదికి రూ.50కోట్లు మాత్రమే కేటాయించింది. అప్పట్లో దీనిపై పలువురు కేంద్రాన్ని విమర్శించారు. అయినా అవేమీ పట్టించుకోకుండా ఏడు జిల్లాలకు ఏడాదికి రూ.350 కోట్లు చొప్పున మూడేళ్లుగా విడుదల చేసింది. అంతా సజావుగా జరుగుతున్న తరుణంలో, ఇటీవలే కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో ఈ ఏడాది నిధుల విడుదలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఏప్పటిలాగే ఈ ఏడాది కూడా కేంద్రం రాష్ట్రానికి గతనెల 9న రూ.350 కోట్లను విడుదల చేసింది.

అయితే అంతలోనే ఇరు ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో విడు దల చేసిన నిధులను 15న వెనక్కు తీసుకుంది. మనతోపాటు తెలంగాణకు కూడా విడుదల చేసిన ఎస్‌డీపీ నిధులు ఆ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలోనే ఉండగా, ఆంధ్రప్రదేశ్ నిధులు మాత్రం వెనక్కు వెళ్లిపోయాయి. దీంతో రాష్ట్రప్రభుత్వం కంగుతింది. నిధులను వెనక్కు రప్పించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయితే కేంద్రం అంతటితో ఆగలేదు. ఇంతకుముందు ఈ కోటాలో విడుదల చేసిన నిధులను ఆంధ్రప్రదేశ్ ఏవిధంగా ఖర్చు చేస్తుందో, లేదా నిధులను మళ్లించి ఇతర అవసరాలకు వాడుకుందో తనిఖీ చేయాలని నీతి అయోగ్ బృందాన్ని జిల్లాలకు పంపించింది. ఈ బృందం సభ్యులు ఇప్పటికే విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఈ బృందంలో నీతి అయోగ్ డైరెక్టర్ జగదీష్ కిశోర్ శర్మ, సీనియర్ రిసెర్చ్ ఆఫీసర్ రాజ్‌పాల్ సింగ్, ఎకనామిక్ ఆఫీసర్ భూషణ్ కుమార్ చౌరాసియా సభ్యులుగా ఉన్నారు. అసలే నిధులకు కటకటలాడుతున్న రాష్ట్రం, ఈ బృందాన్ని ప్రసన్నం చేసే పనిలో నిమగ్నమై ఉంది. ఈ నిధులతో పక్కాగా చేపట్టిన అభివృద్ధి పనులను చూపించాలని, వారికి సకల మర్యాదలూ చేసి సంతృప్తి పరచాలని ఆయా జిల్లాల అధికారులకు రాష్ట్ర ఉన్నతాధికారులనుంచి మౌఖిక ఆదేశాలు కూడా అందాయంటే, రాష్ట్రప్రభుత్వం ఈ నిధులకోసం ఎంత తాపత్రాయ పడుతుంతో, మన ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కోహ్లి ర్యాంకు పదిలం

దుబాయ్ : అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లి రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో కోహ్లి 912 రేటింగ్ పాయింట్లతో రెండో స్థానాన్ని పదిలం చేసుకోగా, ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ప్రథమ స్థానంలో కొనసాగుతున్నాడు. స్టీవ్ స్మిత్ 947 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని కాపాడుకున్నాడు. మరొకవైపు భారత ఆటగాడు ఛతేశ్వర పుజారా ఆరో స్థానాన్ని నిలబెట్టుకోగా, బౌలర్ల విభాగంలో రవి చంద్రన్ అశ్విన్ ఆరో స్థానానికి పడిపోయాడు. ఇక ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ ఐదో స్థానంలో నిలిచి తన కెరీర్ అత్యుత్తమ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. డర్బన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో ఆసీస్ ఘన విజయంలో కీలక పాత్ర పోషించిన స్టార్క్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. స్టార్క్ 805 రేటింగ్ పాయింట్లతో ఐదో స్థానానికి ఎగబాకాడు.

స్నేహితుడి పెళ్లిలో కోహ్లి స్టెప్పులు



ముంబై : భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి మరోసారి తన స్నేహితుడి పెళ్లిలో స్టెప్పులేస్తూ కనిపించాడు. శ్రీలంకలో మంగళవారం మొదలైన ముక్కోణపు టీ20 సిరీస్ నుంచి బీసీసీఐ విరాట్ కోహ్లికి విశ్రాంతి కల్పించిన సంగతి తెలి సిందే. ఈ నేపథ్యంలో కోహ్లి తన విలువైన సమయాన్ని కుటుంబసభ్యులతోనే గడుపుతున్నాడు. తాజాగా తన స్నేహి తుడు గగన్ గుర్జాల్ పెళ్లి వేడుకకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా సన్నిహితులతో కలిపి స్టెప్పు లేశాడు. బాలీవుడ్ సినిమా 'బంటీ ఔర్ బబ్లీ' సినిమాలోని 'కజరా రే' పాటకు చిం దేశాడు. ఆ వీడియోలు ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారాయి. ఈ వేడుకకు కోహ్లి తన అత్తమామలతో కలిసి హాజరయ్యాడు. భార్య అనుష్క శర్మ షూటింగ్‌లతో బిజీగా ఉండటంతో ఆమె హాజరు కాలేకపోయినట్లు తెలుస్తోంది.



అస్సాంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా శిరోముండనం చేయించుకుంటున్న మహిళలు

అధికారంలోకి వస్తే హోదా..!

- మహాధర్నాలో రాహుల్‌గాంధీ
- మద్దతు పలికిన వామపక్ష నేతలు డి.రాజా, రామకృష్ణ, పి.మధు



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం ఢిల్లీలో ఏపీ కాంగ్రెస్ నిర్వహించిన ఆత్మగౌరవ సభకు ఆయన హాజరయ్యారు. ఏపీకి హోదా ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అందరం కలిసికట్టుగా ప్రధాని నరేంద్ర మోడీపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక హోదా సాధించాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఒక్క నిమిషంలోనే ప్రసంగం ముగించి వేదికపై దిగి వెళ్లిపోవడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆశ్చర్యానికి గురయ్యారు. సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం నాయకుడు మధు ఆత్మగౌరవ సభకు హాజరయ్యారు. పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి నేతృత్వంలో జరిగిన సభకు మాజీకేంద్ర మంత్రి పల్లం రాజు, ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, టి.సుబ్బిరామిరెడ్డి, ఏపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు పాల్గొన్నారు. ఏపీ కాంగ్రెస్ నేత గిడుగు రుద్రరాజు ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఏపీ సీఎం చంద్రబాబు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇద్దరూ కలిసి ఏపీ ప్రజల్ని మోసగిస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేసిందన్నారు. మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు మాట్లాడుతూ 2014లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటు సాక్షిగా చేసిన వాగ్దానాలను ఇప్పటి ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండు చేశారు. మరో నాలుగు రోజులు పాటు ఏపి కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ఉండి ఏపీకి ప్రత్యేక హోదాపై ఆందోళన చేయనున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.